# పుష్కరవేణి

(కృష్ణాపుష్కర కరపత్రికా సంకలనం)

సంపాదకుడు

**డాక్టర్ ఎస్.బి. రఘునాథాచార్య**



తిరుమల తిరుపతి దేవస్థానములు

తిరుపతి

2004

# పుష్కరవేణి

(కృష్ణాపుష్కర కరపత్రికా సంకలనం)

సంపాదకుడు

**డాక్టర్ ఎస్.బి. రఘునాథాచార్య**

ప్రచురణ

**కార్యనిర్వహణాధికారి**

**తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.**

**2004**

# PUSHKARAVENI

*(Collections of Pamphlets on Krishna Pushkaram)*

T.T.D. Religious Publications Series No.89

© All Rights Reserved

*Editor*
**Dr. S.B. Raghunadhacharya**

Krishna Pushkaram
Roudri, 1981
Second Print : 1992
Third Print : 2004
Copies : 1,000

*Published by*
**Sri Ajeya Kallam, I.A.S.,**
*Executive Officer,*
Tirumala Tirupati Devasthanams,
Tirupati.

*Printed at*
Tirumala Tirupati Devasthanams, Tirupati.

# ముందుమాట

మానవ జీవనానికి జీవనదులకు విడదీయలేని సంబంధం ఉన్నదనే మాట మన కందఱకు తెలిసినదే. అలాంటి జీవనదులు హిమాలయాల నుండి కన్యాకుమారి వఱకు ప్రవహిస్తూ మనకొక మహత్తర సందేశాన్నందిస్తున్నాయి. మిగతా సమయాల్లో ఆ నదుల పుట్టుపూర్వోత్తరాలను గురించి తెలిసుకోలేకపోయినా, పుష్కరాల్లాంటి పర్వకాలాల్లోనైనా వాటి విశేషాలను తెలుసుకోవడం, మన కర్తవ్యాన్ని ఆచరించడం మన అందరి విధి.

మన ఆంధ్రదేశానికి పాడిపంటలనందిస్తూ, సాంస్కృతికంగా మనకు మహోన్నత స్థానాన్ని సంపాదించిపెట్టిన నదీమతల్లి కృష్ణవేణి. 1980 ప్రాంతంలో వచ్చిన కృష్ణవేణి పుష్కరకాలంలో పై ఉద్దేశ్యంతో ఈ అవకాశాన్ని సద్వినియోగం చేయాలని, పుష్కరాల విశేషాలను అందరికి అందించాలని తి.తి. దేవస్థానం సంకల్పించింది. పన్నెండుగురు ప్రముఖుల ద్వారా పన్నెండు విషయాలపై కరపత్రికలను సిద్ధం చేసింది. పుష్కరాల్లో పన్నెండు రోజులు లక్షలాది యాత్రికులకు ఈ సందేశం అందాలని లక్షలకొలది ప్రతులను పంచింది. ప్రజలకోరికపై అన్నింటినీ కలిపి 'పుష్కరవేణి' అనే పేరుతో ఒక ప్రత్యేక సంచికగా ఆనాడు విడుదల చేసింది. తిరిగి 1992 ప్రాంతంలో వచ్చిన కృష్ణ పుష్కరాలకు ఈ 'పుష్కరవేణి' సంపుటిని పునర్ముద్రించి పంచింది. ఇప్పుడు 2004లో వస్తున్న పుష్కరాలకు ఈ 'పుష్కరవేణి' తృతీయ ముద్రణకు నోచుకుని ఇలా మీ హస్తాలను అలంకరించింది.

తి.తి.దే. వారి సూచనల మేరకు ఈ కార్యక్రమాన్ని రూపొందించి దక్షతతో నిర్వహించిన కీ॥శే॥ డా॥ ఎస్.బి. రఘునాథాచార్య గారిని ఈ సందర్భంగా స్మరించుకోవలసి ఉంది.

ఈ ''పుష్కరవేణి'ని అందరూ చదివి విశేషాలను గ్రహిస్తారని ఆశిస్తున్నాను.

శ్రీ అజేయ కల్లం, ఐ.ఏ.ఎస్.,
కార్యనిర్వహణాధికారి,
తి.తి. దేవస్థానములు, తిరుపతి.

30-7-2004,
తిరుపతి.

# సంపాదకీయం

పర్వకాలాల్లో ఆచరించే ప్రతి కర్మకు ఫలం ఎన్నిరెట్లో ఉంటుందని ధార్మిక ప్రవృత్తికల భారతీయుల దృఢవిశ్వాసం. మనకెన్నో పర్వకాలా లున్నాయి. అందులో నదీపుష్కరాలు చాలా ముఖ్యమైనవి. అసలు సమాజంలో చాలామందికి పుష్కర స్వరూపం సరిగా తెలియదు. పుష్కరం అంటే ఏమిటో, అప్పుడు ప్రతివారు ఏం చేయాలో వారికి తెలియజేయడం ఎంతైనా అవసరం. ఈ సంవత్సరం కృష్ణాపుష్కరం వచ్చింది. మన దేశాన్ని సస్యశ్యామలం చేసిన మహానది కృష్ణమ్మ. అందుకే తి.తి. దేవస్థానం ఈ సందర్భంలో పుష్కరానికి సంబంధించిన విశేషాలన్నింటిని కరపత్రికల రూపంలో మన వారందరికీ అందుబాటులోకి తేవాలని సంకల్పించింది.

పుష్కరకాలంలో మొదటి పన్నెండు రోజులు విశిష్టమైనవి గనుక పన్నెండు విభిన్న శీర్షికలపైన ప్రముఖులు వ్రాసిన వ్యాసాలను 1980 ప్రాంతపు పుష్కరాలలో కరపత్రికలుగా సంపాదించి లక్షల ప్రతులు పంచడం జరిగింది.

సందర్భం పుష్కరం కనుక, దాని స్వరూపాన్ని గూర్చి మొదటి శీర్షికలో చెప్పబడింది. పుష్కరాల్లో మనమేం చేయాలో రెండవ వ్యాసం వివరిస్తుంది. పుష్కరాల్లో మనమాచరించే శ్రాద్ధాదికర్మల సాఫల్యాన్ని నిరూపించడానికి మూడవ వ్యాసం ఉద్దేశింపబడింది. ఈ పితృకర్మలు ఎందుకు చేయాలో విశదీకరిస్తుంది నాల్గవ వ్యాసం. పుష్కరం కూడా పర్వకాలమేనన్న ప్రతిపాదన ఐదవ వ్యాసంలో చేయబడింది. తరువాత ఈ పుష్కరాలకు మాత్రమేగాక మన భారతీయ సంస్కృతికి కూడా ఆశ్రయాలైన నదుల విశేషాలపై కొన్ని వ్యాసాలు తయారుచేయబడ్డాయి.

పుణ్యక్షేత్రాలకు నదీతీరాలకు కల సంబంధం ఆరవ వ్యాసంలో చెప్పబడగా, ఏడవ వ్యాసం పురాణాల్లో నదుల మాహాత్మ్యాన్ని కీర్తించింది. మనదేశంలోని జీవనదుల స్వరూపం ఎనిమిదవ వ్యాసంలో తీర్చిదిద్దబడగా, నదులెలా మన సంస్కృతిని నిలబెడుతున్నాయని, అవి మనలో ధార్మిక

భావననెలా పెంపొందిస్తాయనే విషయాలు తొమ్మిది, పది వ్యాసాలలో చర్చింపబడ్డాయి. తీర్థయాత్రల స్వరూపాన్ని పదకొండవ వ్యాసం పేర్కొనగా, ఇతిహాస పురాణాలు ఏయే నదుల్ని పేర్కొన్నాయని పన్నెండవ వ్యాసం అభివర్ణించింది.

ఇలా పుష్కరాలను గురించి, నదులను గురించి పరిశీలనా దృక్పథంతో ఈ వ్యాససంపుటి సంక్షిప్తంగా రూపొందించబడింది. విషయం మీద అభిరుచి కలిగించడమే ఈ ప్రయత్నానికి లక్ష్యం కాబట్టి సందర్భాను గుణంగా వ్యాసాలు సంపాదింపబడినాయి. ఎందఱో ఈ ప్రయత్నం చాలా ఉపయోగకరమైనదని వారి అభిప్రాయాలు వ్రాశారు. వారికి మా ధన్యవాదాలు. వారిచ్చిన ప్రోత్సాహంతో ఇంకా ఇలాంటి వాటి ద్వారా మన ధార్మిక సాహిత్యాన్ని అందరికీ అందుబాటులోకి తీసుకురావడానికి కృషి జరుగుతున్నది.

తిరుపతి.
13-2-1981.

ఎస్.బి. రఘునాథాచార్య
సంపాదకుడు

# పుష్కరవేణి

దేహంలో విస్తరించిన రక్తనాళాలు ఎంత ప్రధానమైనవో, ఒక దేశంలో ప్రవహించే జీవనదులు ఆ దేశ ప్రజలకు ప్రాణభిక్ష పెట్టడంలో అంతే ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. ఒక దేశపు ఆర్థిక, సాంఘిక వ్యవస్థలతో పాటూ ఆ దేశ నాగరకత ఆ దేశంలో ప్రవహించే ప్రధాన నదీతీరాలలోనే వృద్ధి చెందడం గమనార్హం.

ఉత్తర అమెరికాలో ప్రవహించే మిసిసిపీ, దక్షిణ అమెరికాలో పరవళ్ళు తొక్కే అమెజాన్, ఆఫ్రికాకు నాగరకతను నేర్పిన నైలునది, రష్యాకు జలభిక్ష పెడుతున్న ఓల్గా, ఆస్ట్రేలియాలో ఉరకలు వేస్తున్న ముర్రే డార్లింగ్, లండన్‌లోని థేమ్సు, చైనాలోని హొయాంగ్‌హో, రోములోని టైబర్ - లాంటి నదులలాగే భారతదేశంలో సింధు, గంగ, బ్రహ్మపుత్ర, తుంగభద్ర, కావేరి వంటి జీవనదులు మనకు పాడి పంటలనందించడంలో ప్రముఖ పాత్రను పోషిస్తున్నాయి.

విదేశీయులు నదీమతల్లుల్ని కేవలం జలవనరులుగా మాత్రమే భావిస్తారు. మన భారతీయులు మాత్రం జీవనదుల్ని దేవతామూర్తులుగా ఆరాధిస్తారు. ఈ సంప్రదాయం ప్రకారమే, గ్రహస్వరూపుడైన బృహస్పతి పుష్కరునితో కలిసి మేషాది ద్వాదశ రాసులలో ప్రవేశించే సమయాల్లో, ఒక్కో సంవత్సరం, ఒక్కో నదికి పుష్కర పుణ్యకాలంగా జ్యోతిశ్శాస్త్రవేత్తలు నిర్దేశించారు. ఈ మహత్తమ సమయంలో చేసే స్నానాలవల్ల, ఎవరికీ తెలియని ఎన్నో ఓషధులు కలిసిన జలాలు మనకు ఆరోగ్యాన్ని అందిస్తాయి.

ఈ సంవత్సరం 2004లోని ఆగస్టు మాసంలో వచ్చిన కృష్ణా పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని, 1980 ప్రాంతంలో ఒక చిరు పుస్తక రూపంలో వెలువడిన వ్యాసాల్ని తృతీయ ముద్రణ క్రింద పునర్ముద్రించడంలో ఈ పుస్తకం వెలువడింది.

ఇందులో - పుష్కర విశదీకరణం, పితృకర్మలు - శాస్త్రీయ దృక్పథం, నదీతీరాల పుణ్యక్షేత్రాలు, నదులతో ముడివడిన మన సంస్కృతి - ఇత్యాది పంౘ్రెండు విషయాల మీద పన్నిద్దరు ప్రముఖ సాహితీ వేత్తలతో వ్రాయించిన వ్యాసాలు చోటు చేసుకున్నాయి.

# విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | పుష్కరం అంటే ఏమిటి? కృష్ణాపుష్కరం<br>శ్రీ తూములూరి లక్ష్మీనారాయణ | 1 |
| 2. | పుష్కరాలు మన కర్తవ్యం<br>శ్రీ సన్నిధానం లక్ష్మీనారాయణమూర్తి | 6 |
| 3. | పితృకర్మలు – వైజ్ఞానిక సమన్వయం<br>డా॥ ఎక్కిరాల కృష్ణమాచార్య | 11 |
| 4. | పుష్కరాల్లో ఎందుకు పితృకర్మలు చేయాలి?<br>శ్రీ ఎం. బాలవిశ్వనాథశర్మ | 16 |
| 5. | పర్వకాలం అంటే ఏమిటి?<br>శ్రీమద్భాగవతం లక్ష్మీనరసింహాచార్యులు | 19 |
| 6. | నదీతీరాల్లో పుణ్యక్షేత్రాలు<br>డా॥ ఎస్.బి. రఘునాథాచార్య | 24 |
| 7. | పురాణాలలోని నదీమాహాత్మ్యము<br>ఆచార్య దివాకర్ల వెంకటావధాని | 31 |
| 8. | మనదేశంలో జీవనదులు<br>డా॥ ప్రసాదరాయకులపతి | 37 |
| 9. | మన నదులు – మన సంస్కృతి<br>శ్రీ చెఱుకుపల్లి జమదగ్నిశర్మ | 43 |
| 10. | నదులు ధార్మిక భావన<br>శ్రీ డి.ఆర్. ఆచార్య | 48 |
| 11. | తీర్థయాత్రలు వాటి స్వరూపం<br>డా॥ శలాక రఘునాథశర్మ | 52 |
| 12. | ఇతిహాసపురాణాలు పేర్కొన్న నదులు<br>శ్రీ మురళి - దుర్గ | 57 |
| 13. | పుష్కర స్నానాదివిధులు<br>శ్రీ వంగల రామకృష్ణశాస్త్రి | 62 |

# పుష్కరం అంటే ఏమిటి? కృష్ణాపుష్కరం

శ్రీ తూములూరి లక్ష్మీనారాయణ

**శక్తి స్వరూపం :**

ఈ ప్రపంచం అనేక శక్తులతో కూడిన మహాశక్తి స్వరూపం. ఒక్కొక్క శక్తి ఒక్కొక్క సమయంలో, ఒక్కొక్క స్థలంలో మహోజ్వలంగా ప్రవరిస్తూ ఉంటుంది. భారతీయ మహర్షులు ఈ విశేషాన్ని గుర్తించారు. ఈ శక్తుల వెనుక అధి దైవికశక్తులున్న విషయాన్ని కూడా వారు గుర్తించారు. ఆ వివరాలను సామాన్యుల ఊహలకు అందేటట్లుగా రమ్యమైన కథల రూపంలో అందించి, ఆ శక్తుల విశేషాలను తెలుసుకొని అవలంభించ వలసిన యోగ్య జీవన విధానాన్ని, సంస్కృతిని, ధర్మాన్ని, విధులను ప్రబోధించారు.

**పుష్కరం అంటే ఏమిటి:**

అట్టి శక్తులలో జలము ఒకటి, పుష్కర విజ్ఞానం, దానికి సంబంధించినది. జలానికి పుష్కరమని పేరున్నది. ''పోషయంతీతి పుష్కరం'' - పోషించేది అని అర్థము. ఈ విజ్ఞానాన్నొక రమ్యమైన కథ రూపంలో పూర్వులు మనకు అందించారు.

పూర్వం తుందిలుడనే ధర్మనిష్ఠుడున్నాడు. అతడు పరమేశ్వరుని గురించి తపస్సుచేసి శాశ్వతంగా పరమేశ్వరునిలో వుండేటట్లు వరం పొందాడు. పరమేశ్వరుని అష్టమూర్తులలో ఒకటైన జలరూపంలో అతడికి శాశ్వత స్థానమిచ్చారు. మూడున్నర కోట్ల పుణ్యతీర్థాలకు అధి కారణుడుగను, జలసామ్రాజ్యానికి సార్వభౌముడుగాను కూడా ఆ పుష్కరుడు వరాలు పొందాడు. అనంతర కాలంలో బ్రహ్మకు జగత్సృష్టి చేయడానికి జలము అవసరమైంది. అతడు పరమేశ్వరుని గురించి తపస్సుచేసి, పుష్కరుడు తన కమండలములో నివాసముండేటట్లు వరం పొందాడు.

**పుష్కరోదంతం :**

ఆ తరువాత బృహస్పతి బ్రహ్మను గురించి తపస్సు చేయవలసి వచ్చింది. ప్రాణులను బ్రతికించే ధర్మం బృహస్పతిది. అందువలన జీవనాధారుడైన పుష్కరుని తన అధీనంలో వుంచవలసిందిగా బ్రహ్మను

ప్రార్థించాడు. అయితే పుష్కరునికి బ్రహ్మను విడిచి వెళ్ళటానికి ఇష్టం లేక, బ్రహ్మను కూడా తనతో బృహస్పతి వద్ద ఉండవలసిందిగా ప్రార్థించాడు. అది సాధ్యము కాని పని. అందువల్ల బ్రహ్మ ఒక ఏర్పాటు చేశాడు. గ్రహ స్వరూపుడైన బృహస్పతి మేషాది ద్వాదశ రాసులందు ప్రవేశించే టప్పుడు 12 రోజులు ఆ రాసుల నుండి నిష్క్రమించేటప్పుడు 12 రోజులు సంవత్సరంలో మిగిలిన అన్ని దినాలలో మధ్యాహ్న సమయంలో రెండు ముహూర్తముల కాలం పుష్కరుడు బృహస్పతితో ఉండాలని, ఆ సమయాలలో తాను సమస్త దేవతలతోను బృహస్పతి ఉన్న రాశికి అధిష్ఠానమైన పుణ్యనదికి వస్తూ ఉంటానని - ఈ విధంగా పుష్కరుడు నిరంతరం బ్రహ్మతోను, బృహస్పతితోను ఉండే ఏర్పాటు జరిగింది. సృష్టి, స్థితులకు ఆధారభూతమైన జల ప్రశస్తిని గురించిన అధిదైవిక విజ్ఞానానికి ఈ కథ నొక సంకేతంగా స్వీకరించవచ్చు. నదులకు పుష్కరాలు ఈ విధంగా ఏర్పడ్డాయి.

**నదులు పుష్కరాలు :**

*శ్లో॥ మేషే గంగా వృషే రేవా మిథునే చ సరస్వతీ।*
*కర్కటే యమునా ప్రోక్తా సింహే గోదావరీ స్మృతా॥*
*కన్యాయాం కృష్ణవేణీ చ కావేరీ ఘటకే స్మృతా।*
*వృశ్చికే తామ్రపర్ణీ చ చాపే పుష్కరవాహినీ॥*
*మకరే తుగభద్రా చ కుంభే సింధునదీ స్మృతా।*
*మీనే ప్రణీతా చ నదీ గురోస్సంక్రమణే స్మృతా॥*
*పుష్కరాఖ్యే మునీనాం హి ప్రదేశోఽత్ర బుధైః స్మృతః।*

అనే శ్లోక ప్రమాణం ప్రకారం బృహస్పతి పుష్కరునితో కలిసి మేషరాశిని ప్రవేశించినప్పుడు గంగకు పుష్కరం. వృషభరాశిలో నర్మదకు, మిథునంలో సరస్వతికి, కర్కాటకంలో యమునకు, సింహంలో గోదావరికి, కన్యలో కృష్ణకు, తులలో కావేరికి, వృశ్చికంలో భీమరథికి, ధనుస్సులో వాహినికి (బ్రహ్మపుత్ర) మకరంలో తుంగభద్రకు, కుంభంలో సింధుకు, మీనంలో ప్రణీతానదికి పుష్కరాలు సంభవిస్తాయి.

**కృష్ణాపుష్కర ప్రశస్తి :**

కృష్ణానదికి సంబంధించినంతవరకు బృహస్పతి కన్యారాశిలో ప్రవేశించినప్పుడు పుష్కరం సంభవిస్తుందనే విషయంలో అభిప్రాయభేదం

లేదు. కృష్ణానది విష్ణురూపిణి అని ప్రసిద్ధి. లోకాలను తరింపచేయటానికి కృష్ణపరమాత్మ సహ్యాద్రిపైన అశ్వత్థ వృక్షరూపంలో నిలిచాడని, ఆ చెట్టు వ్రేళ్ళ నుండి కృష్ణానది అవతరించిందని ఐతిహ్యం. సహ్యాద్రిపైన బ్రహ్మ తపస్సు చేసినచోట బ్రహ్మగిరి, వేదాలు మూర్తిరూపం పొంది ఈశ్వరుని స్తుతించిన స్థలంలో వేదగిరి ఏర్పడ్డాయని, వేదగిరి వద్ద కృష్ణపరమాత్మ అశ్వత్థ రూపాన్ని ధరించాడని పురాణాలలో చెప్పబడింది. కలియుగంలో పాపప్రక్షాళనా వసరాలను తీర్చే వ్యవస్థ కోసం మునులు పరమేశ్వరుణ్ణి ప్రార్థించగా అతడు లింగాకారంలో ఆ ప్రదేశంలో వెలిసాడు. ఆ ప్రదేశంలో గల ఆమలక (ఉసిరిక) వృక్షం నుండి వేణీనది అవతరించి కృష్ణానదితో ఏకమై ఇనుమడించిన ప్రాశస్త్యంతో కృష్ణవేణీనది ఏర్పడిందని చెబుతారు. శివకేశవుల అబేధత్వమిది. ఈ అన్ని కారణాలవల్ల కృష్ణవేణీమతల్లి పరమపవిత్రంగా భావించబడింది. ఈ నదిలో స్నానం, పానం, నదీ తీరంలో జీవనం అత్యంత ఫలదాయకాలని విశ్వసించబడింది. క్రమంగా నదీతీరంలో అంతటా అనేక పుణ్యక్షేత్రాలు నెలకొన్నాయి.

**కృష్ణానది - ఉపనదులు :**

సహ్యాద్రి నుంచి సాగరసంగమం వరకు సాగిన 800 మైళ్ళ సుదీర్ఘయాత్రలో, కృష్ణానది అనేక ఉపనదీనదాలను తనలో కలుపుకుంది. వేణి, కకుద్మతి (కొయినా), సావిత్రి, గాయత్రి, వర్ణ, పంచగంగ, భీమ, తుంగ, భద్ర, మూసి ఇట్లెన్నెన్నో నదీ నదాలు కలిసిన మహారాష్ట్ర, కర్నాటక, ఆంధ్రరాష్ట్రల చారిత్రక, సాంస్కృతిక జీవనంలో ఈ నది ప్రముఖ స్థాన మాక్రమించింది. పురాణాలలో కృష్ణవేణిగాను జాతక కథలలో కన్నపెన్నగాను, ఖారవేల శాసనంలో కన్న పెమ్నగాను ప్రస్తావన పొందింది.

**పుష్కర ప్రశస్తి :**

పుష్కర సమయాలలో నదీజలాలు అధి దైవిక తేజస్సును పొంది ఉంటాయి. కాబట్టి ఆ సమయాలలో మానవులు స్నాన, దాన, జప, అర్చన, ధ్యాన, హోమ, తర్పణాది అనుష్ఠానాలను పితృపిండ ప్రధానాలను చేయాలని మహర్షులు ప్రబోధించారు. ఈ కర్మల వలన శారీరక, మానసిక, బౌద్ధిక కల్మషాలు తొలగి, మానవులు పవిత్రులు, తేజోవంతులై ఉత్తేజితులవుతారు. ఆధ్యాత్మికోత్తేజం కలిగి - ఐహిక సత్ఫలాలేగాక అాముష్మిక ప్రయోజనాలు సిద్ధిస్తాయి. ఇంకో మాటలో చెప్పాలంటే

ఈ కర్మలు ఆధ్యాత్మిక సంస్కార హేతువులు. అందువల్లనే ఆధ్యాత్మిక సాధనలకు, మోక్ష లక్ష్యానికి విశేష ప్రాముఖ్యమిచ్చే భారతీయ సంస్కృతిలో ఈ ధార్మిక కర్మలకు విశేష ప్రాధాన్యమీయబడింది. ఈ ఆధ్యాత్మిక చింతన మన జాతి ఏకత్వానికి పునాదివంటిది కూడా.

**పుష్కర వ్రతం :**

కృష్ణాపుష్కర దినాలలో అపమృత్యు పరిహారార్థం పుష్కరవ్రతం సూచించబడింది. అందు కృష్ణ, పుష్కర, బృహస్పతి, నారాయణ, భాస్కర, మహాలక్ష్మి, గణేశ, శ్రీకృష్ణ, సరస్వతి, పార్వతి, మహేశ్వర, అనంత, నృసింహ, వామన, శ్రీరామచంద్ర మహామంత్ర జపాలు - కనీసం ప్రార్థనాదులు కర్తవ్యాలు.

పుష్కర సమయంలో 12 దినాలు జరిపే వ్రతం, 12 ముఖ్య కల్పాల్లో జరిపే వ్రతానికి సమానమని పుష్కర వ్రతకథలో చెప్పబడింది. మూడు యామాల ఆయుర్దాయమే మిగిలిన చిత్రరథుడనే రాకుమారుడు కృత్స్నుడనే ముని ప్రబోధంచే, కృష్ణాపుష్కర సమయంలో ఈ వ్రతమాచరించి దీర్ఘాయుర్దాయం పొందేడని వ్రతమహాత్మ్యంలో చెప్పబడింది.

**దానధర్మాలు :**

కృష్ణాపుష్కర దినాలలో దినానికొక రీతిని దానవిధి ప్రతిపాదింపబడింది. వెండి, బంగారం, భూమి, ధాన్యం, హిరణ్యం, గోవులు, లవణాలు, మణులు, వస్త్రాలు - అశ్వం, బెల్లం, పండ్లు కూరలు - తైలం, నేయి, పాలు, తేనె, పానకం - బండి, నాగలి, ఎద్దు, మహిషం - కస్తూరి, చందనం, ఔషధం - గృహం, శయ్య, పీట, ఊయల - కందమూలాలు, పూలు, దాసదాసీజనం, కన్య, కంబళి,అన్నం - ముత్యాలహారాలు - పుస్తకం, తాంబూలం, జందెము, షోడశమహా దానాలు - ఇత్యాది దానకర్మలను క్రమంగా ఆ 12 దినాలలోను చేయాలని ధర్మశాస్త్రం చెబుతుంది. ఈ పట్టికను గమనించి ఐహిక జీవితంలో మనం సంపాదించే సమస్తవస్తువులలో, స్థిరచరాస్తుల భోగభాగ్యాలలో వ్యామోహాలను వదలి వరులకు సమర్పించడం ద్వారా పరార్థ చింతనము, పరమార్థ సాధనను అవలంభించాలని ప్రబోధంగాను, అందుకు సాధనగాను కనిపిస్తుంది. మోక్షగామికి ఈ దానాలు అత్యంత ఫలప్రదమనటం ఆ విషయాన్నే వక్కాణిస్తుంది. ఇది సామాజికం, ఆధ్యాత్మికమైన సాధన.

**పుష్కరాలలో శ్రాద్ధాలు :**

పుష్కర సమయంలో విశేష ప్రాముఖ్యమివ్వబడే మరొక అంశం పితృదేవతలకు తర్పణాలు, పిండప్రదానాలు. తొలిదినాన హిరణ్యశ్రాద్ధం. 9వ దినాన అన్నశ్రాద్ధం. 12వ దినాన ఆమశ్రాద్ధం చెప్పబడింది. ఆ విధి విధానాలు స్పష్టీకరించబడి ఉన్నాయి. అందు తల్లివైపున, తండ్రి వైపున గల బంధు జనులకు, రక్తబంధువులకే గాక, గురువులు, మిత్రజనులకు సైతం శ్రాద్ధాలను పెట్టాలని చెప్పబడింది. మనమీ పితృజనులందరి వలన భౌతిక కాయాన్నేగాక, ఆంతరిక సంస్కారాలను కూడా పొంది వున్నందు వలన వారికి మనం ఋణపడి వుంటాం. వారిలో కొందరు సద్గతి పొందియుండవచ్చు. కొందరు పొందియుండకపోవచ్చు. అట్టివారందరికి శ్రద్ధతో ఈ మహాపుణ్యకాలంలో శ్రాద్ధవిధులు నిర్వర్తించడం వలన వారికి ఉత్తమగతులు కల్గటం ద్వారా మనం ఋణ విముక్తులమౌతామని ఇందులోని సందేశం. ఇది మనకు వారికి కూడా సత్ఫలితం కల్గించే విషయం కాబట్టి తప్పక ఆచరించదగిన దవుతున్నది. పుష్కర సమయంలో పుణ్య నదుల జలాలు - ఎన్నడో మరణించిన వారికి కూడ ఉత్తమ గతులీయగల సామర్థ్యం గలవి అనే మాట కూడ ఇందులో ఉంది. పుష్కరసమయంలో శ్రద్ధా విరహితుడై శ్రాద్ధకర్మను నిర్వహించినా ఫలప్రదమేయని ప్రబోధించడానికి ఒక చక్కని కథ చెప్పబడింది. గోవిందశర్మ అనే భ్రష్ట బ్రాహ్మణుడు, కర్మభ్రష్టుడు నాస్తికుడై పులివాతబడి దుర్మరణం పాలవుతాడు. అతడి కుమారుడు శివశర్మ అంతకుమించిన భ్రష్టుడు, నాస్తికుడు. అతడి తల్లి సుగుణవతి. ఆమె సంతృప్తి కొరకు శివశర్మ కృష్ణాపుష్కర సమయంలో తండ్రికి అశ్రద్ధగానైనా శ్రాద్ధం పెట్టిన కారణంచేత గోవిందశర్మకు సద్గతి కలిగిందని ఆ కథలో చెప్పబడింది. పితరులను స్మరిస్తూ జరిపే ఈ విధి విధానం, మన జాతిలో వంశపారం పర్యానికీయబడే ప్రాముఖ్యం, పితరుల ఋణవిముక్తి ప్రాధాన్యాలను వక్కాణిస్తున్నది.

**పుష్కరాల్లో మన బాధ్యత :**

పుష్కర కాలంలో జరుపవలసిన విస్తృత విధి విధానమొక గొప్ప తపస్సు వంటిది. అంతటి దీక్షాయుత కృషి సాధ్యం కాని వారు కూడా జప, దాన, అర్చన, శ్రాద్ధాదుల విషయంలో యథాశక్తిగానైనా ప్రవర్తించడం, ఆ పవిత్ర సమయాన్ని సద్వినియోగం చేసుకోవడమే అవుతుందని గ్రహించవలసి ఉంది.

* * * *

# పుష్కరాలు - మన కర్తవ్యం

శ్రీ సన్నిధానం లక్ష్మీనారాయణమూర్తి

**పరిచయం :**

భారతీయులమైన మనం తరతరాల నుంచి ఏదో ఒక ధర్మమార్గాన్ని అనుసరించి జీవనం సాగిస్తున్నాం. ఇలా ధార్మికంగా జీవించే మనకు ఈ కృష్ణాపుష్కరం ఒక సువర్ణావకాశం. ఇది 12 సంవత్సరాలకొకసారి సంభవించే పవిత్ర సన్నివేశం. అన్ని శ్రేయస్సులకు ధర్మమే సాధనమని, కనుక దాన్ని సాధించాలని అన్ని వేదాలు శాస్త్రాలు ఉపదేశిస్తున్నాయి.

కర్తవ్యంగా ఉపదేశింపబడిన ధర్మం కూడా దేశ - కాల - పాత్రాలను బట్టి అనేక విధాలుగా ఉంటుంది. అంతెందుకు లోకవ్యవహారంలో మన అందరి కర్తవ్యాలు ఒకే రకంగా ఉండవు. వారి వారి వయస్సును అవస్థలను అనుసరించి అనేక పనులను చేస్తూ వుండటం మనకు తెలిసిన విషయమే. ధర్మాన్ని ఆచరించేటప్పుడు కూడా అలాగే వాళ్ళ వాళ్ళ అన్ని అర్హతలను, అవకాశాలను దృష్టిలో పెట్టుకోవాలి.

ధర్మాచరణం వల్ల మిగతా సమయాల్లో సిద్ధించే ప్రయోజనం కన్నా విశిష్ట సమయాల్లో ఎక్కువ ప్రయోజనాలు కలుగుతుంటాయి. నిత్యం మనం చేసే స్నానం, ధ్యానం, దేవతార్చన మొదలగునవి పుష్కరాల వంటి పర్వకాలాలలో వందలరెట్లు ఫలితాన్ని ఇవ్వగలుగుతాయి. ఔషధం ఒకటే అయినా ఋతుభేదం వల్ల అనుపానభేదం వల్ల విశిష్ట ప్రయోజనాన్ని కల్గించడం మనకు తెలియని విషయం కాదు.

**పుష్కర వృత్తాంతం :**

బృహస్పతి ఒక్కొక్క రాశిలో ప్రవేశించినప్పుడు ఒక్కొక్క నదికి పుష్కరం వస్తుందని మనకు తెలుసు. అయితే పుష్కరుడు అంటే ఎవరు? అన్న సందేహం కలుగుతుంది కదూ! *ఈ కథ వినండి:* పూర్వం తుందిలుడనే మహర్షి ఉండేవాడు. ఆయన చాలకాలం పరమేశ్వరుణ్ణి ఆరాధించాడు. ఆయన దయవల్ల 3 కోట్ల పుణ్యతీర్థాలకు రాజై, పుష్కరుడు అనే ప్రసిద్ధి సంపాదించాడు. ఈశ్వరుని అష్టమూర్తులలో ఒకటైన జలమయమూర్తిలో ప్రవేశించి ఈశ్వరుడే అయినాడు. ఇలా వుండగా ఒకప్పుడు బ్రహ్మ తన

తపస్సుతో పరమేశ్వరుణ్ణి సంతోషింపచేసి అన్ని కోర్కెలను తీర్చే పుష్కరుణ్ణి సృష్టికార్యం కోసం తనకిమ్మని అడిగాడు. అలాగే అన్నాడు ఈశ్వరుడు జలరూపంలో ఉన్న పుష్కరుణ్ణి తన కమండలంలో పెట్టుకొని బ్రహ్మ సృష్టిచేస్తున్నాడు.

ఇంకొంత కాలానికి బృహస్పతి బ్రహ్మను మెప్పించి పుష్కరుడు తనకు కావాలని కోరుకొన్నాడు. సరేనన్నాడు బ్రహ్మ. కాని పుష్కరుడు బ్రహ్మను వదలివెళ్ళడాని కిష్టపడలేదు. ఎట్లాగో ఒక ఒప్పందం కుదిరింది. దాని ప్రకారం బృహస్పతి కొత్తగా ఒకరాశిలో ప్రవేశించినపుడు మొదటి 12 రోజులు, చివరి 12 రోజులు మిగతా రోజుల్లో మధ్యాహ్నం 4 ఘడియలు మాత్రం పుష్కరుడు బృహస్పతి అధీనంలో వుండాలి. ఆ సమయంలో దేవగణాలందరితో బ్రహ్మ పుష్కరుణ్ణి అనుసరించాలి. ఈ ఒప్పందం ప్రకారు పై చెప్పిన పుష్కరకాలాల్లో 3 కోట్ల 50 లక్షల పుణ్యతీర్థాలకు అధిపతియైన పుష్కరుడు బ్రహ్మ మొదలగు దేవతలందరితో ఆయానదుల్లో బృహస్పతితో కలిసి నివసిస్తాడు. కాబట్టే ఆ నదుల్లో దేవతలందరి సాన్నిధ్యంవల్ల చెప్పలేనంత ప్రభావముంటుంది. అప్పుడు ఆచరించిన స్నాన, తర్పణాది కర్మలన్నింటికీ మనకెంతో పుణ్యం కలుగుతుంది.

**పుష్కరస్నానం :**

ఈ పుష్కర సమయంలో అందరూ స్నానాన్ని దానాన్ని ఆచరించవచ్చు. ఎన్నో పుణ్యకార్యాలు ఈ సమయంలో చేయాలని శాస్త్రాలు చెపుతున్నాయి. కాని వాటన్నింటిలోకి ముఖ్యమైంది, ఎంతో ఫలితాన్నివ్వగలిగింది పుష్కరస్నానం నదులు దైవ, ఆర్ష మానవ, అసుర భేదంతో నాలుగురకాలు అని బ్రహ్మపురాణం చెబుతున్నాది. త్రిమూర్తుల చేత ప్రవర్తింపచేయబడేవి మొదటి తరగతికి చెందుతాయి. అలా మొదటి తరగతికి చెందిన గంగ, గోదావరి మొదలగువాటితో కృష్ణవేణి కూడా పరిగణింపబడింది సహజంగా ఇలాంటి గొప్ప ప్రభావం కలిగి పుష్కర కాలంలో 3 కోట్ల 50 లక్షల పుణ్యతీర్థాలతో ప్రకాశించే కృష్ణవేణిలో స్నానం చేయడం ఎంతటి అదృష్టవంతులకు సాధ్యమవుతుందో మీరే ఊహించండి.

నీళ్ళకింత విలువా? అని కొందరంటారు. నీళ్ళలో రెండురకాల శక్తులున్నాయని వేదం చెప్తుంది. మురికిని పోగొట్టడం, దాహాన్ని తీర్చడం

అనే లౌకికశక్తి అందరికి తెలిసిందే. ఇంకా అతీంద్రియమైన దైవికశక్తి కూడా ఒకటి వుంది. అది 'మేధ్యం', 'యజ్ఞ్యం' అని రెండురకాలు. అందులో 'మేధ్యం' అనే శక్తి స్నానం ఆచమనాదుల ద్వారా మనపాపాన్ని పోగొడ్తుంది. 'యజ్ఞ్యం' అనే శక్తి ప్రోక్షణాదుల ద్వారా ద్రవ్యశుద్ధిని కలిగిస్తుంది. ఈ రెండూ కంటికి కనబడేవి కావు. ఆ ఫలితం కలగడానికి అలాంటి భావన ముఖ్యం. పుష్కర సమయంలో కృష్ణానదిలో స్నానం చేస్తే గంగ. గోదావరి మొదలైన నదుల్లో 12 సంవత్సరాలు ప్రతిరోజూ స్నానం చేసిన ఫలితం కలుగుతుందని, పూర్వజన్మల్లో మనస్సు, వాక్కు, శరీరమనే త్రికరణాలతో చేసిన అన్ని పాపాలు నశించి మోక్షప్రాప్తి కలుగుతుందని బ్రహ్మాండపురాణం చెప్తున్నది. అంతేకాదు చాలా శ్రమపడి చేయవలసిన అశ్వమేధయాగం కంటే ఎక్కువ ఫలితాన్ని కృష్ణా పుష్కర స్నానం మనకిస్తుందని మన విశ్వాసం. ఇంకా నర్మదా తీరంలో తపస్సు, కురుక్షేత్రంలో దానం, కాశిలో మరణం ఈ మూడు మోక్షాన్నిస్తాయని పుష్కరకాలంలో కృష్ణలో స్నానం చేయడంపై మూడింటివల్ల కలిగే ఫలితం కలుగుతుందని పద్మపురాణం పేర్కొన్నది.

పుష్కరసమయంలో ప్రాతఃకాలస్నానం ఉత్తమమైందని, మధ్యాహ్న స్నానం మధ్యమమని, అపరాహ్ణస్నానం అధమమైందని శాస్త్రాలు చెప్తున్నాయి. అవకాశమున్న వారు పుష్కరవిధిని ఆచరించడానికి ముందురోజే రెండు పూటలో, ఒక పూటో ఉపవాసం చేసి మరుసటిరోజు ఉదయం ముండనం చేయించుకొని స్నాన, దాన, శ్రాద్ధ, తర్పణాదులను ఆచరించడం ఉత్తమం. స్నానం చేసిన తర్వాత స్నానఫలం సిద్ధించడానికి కృష్ణవేణి - తీర్థ రాజ, బృహస్పతి - బ్రహ్మ, విష్ణు - మహేశ్వర - ఇంద్రాది దేవతలకు అర్ఘ్యప్రదానం చేసి అటు తర్వాత ధర్మార్ఘ్యలు ఇవ్వమని బ్రాహ్మణులకు తగిన దక్షిణలనివ్వమని ముత్తైదువులకు వాయనాలను ఇవ్వమని పుష్కరస్నాన కల్పం చెప్తుంది.

**దానధర్మాలు :**

గృహస్థులు ఈ పుష్కర కాలాన్ని చక్కగా వినియోగించుకోవాలి. శాస్త్రాలు పుష్కర సమయంలో దానవిధిని ఇలా ఉపదేశిస్తున్నాయి.

మొదటిరోజు సువర్ణ - రజత - ధాన్య - భూదానాలు, రెండవ రోజు వస్త్ర - లవణ - ధేను - రత్నదానాలు, మూడవ రోజు గుడ - అశ్వ

- శాక - ఫలదానాలు, నాల్గవరోజు ఘృత - తైల - క్షీర - మధు దానాలు, ఐదవరోజు ధాన్య - శకట - మహిషి - వృషభ - హలదానాలు, ఆరవ రోజు ఔషధ - కర్పూర - కస్తూరి - చందన దానాలు, ఏడవరోజు గృహ- పీఠ - శయ్య - ఆందోళికా దానాలు, ఎనిమిదవరోజు చందన - పుష్పమాల - మూల ఆర్ద్రక దానాలు. తొమ్మిదవరోజు పిండ - దాసీ - కన్యా - కంబళ దానాలు, పదవ రోజు శాక - సాలగ్రామ - పుస్తకదానాలు, పదకొండవరోజు గజాది దానాలు, పన్నెండవరోజు తిల - అజాది దానాలు, మిక్కిలి ప్రశస్తమైనవి.

సువర్ణ, రజత దానాలవల్ల ఈ లోకంలో సుఖభోగాలతో బాటు సూర్య, చంద్రలోక ప్రాప్తి, భూదానం వల్ల భూపతిత్వం. వస్త్రదానం వల్ల వసులోకప్రాప్తి, గోదానం వల్ల రుద్రలోకప్రాప్తి, ఆజ్యదానం వల్ల ఆయుష్యాభి వృద్ధి, ఔషధదానం వల్ల ఆరోగ్యం, సాలగ్రామ దానం వల్ల విష్ణులోకం, గృహదానం వల్ల చిరసౌఖ్యం, దాసీ - శయ్యదానం వల్ల స్వర్గసుఖం. తిలదానం వల్ల ఆపదలు తొలగిపోవడం మొదలైన ఫలితాలు నిర్దేశింపబడ్డాయి.

**పూజా పురస్కారాలు:**

ఈ పర్వకాలాల్లో ఎన్నో రకాల పూజలు కూడా చెప్పబడ్డాయి. అందులో 3 కోట్ల 50 లక్షల తీర్థాలతో పుష్కరునితో కూడి ఉన్న కృష్ణవేణిని పూజించడం చాలా ముఖ్యమైంది. అంటే కృష్ణానదీ జలాలను పూజించడం ద్వారా అభిమాన దేవత అయిన కృష్ణవేణిని పూజిస్తున్నామన్నమాట. తరువాత పుష్కర ప్రవర్తకుడైన బృహస్పతిని, త్రిమూర్తులను. ఇష్టదేవతను పూజించాలి. ఇంకా కృష్ణా ప్రవాహం ప్రాంతంలో వున్న ఇతర పుణ్యతీర్థాలను వాటిలో వెలసిన దేవతలను తప్పక పూజించాలి. పుష్కర సంవత్సరంలో ప్రత్యేకంగా చెప్పబడిన ఆయా విశిష్ట సమయాల్లో పై చెప్పిన దేవతలను పూజింపమని కూడా పుష్కరకల్పం చెప్తున్నది.

**తీర్థశ్రాద్ధవిధి:**

పుష్కర సమయంలో తప్పనిసరిగా ఆచరించవలసిన పుణ్యకార్యం తీర్థశ్రాద్ధ. దీన్ని పుష్కరాలలో తొమ్మిదవరోజు జరుపుకోవడం మంచిది. అలా

కాకపోతే ఆయా పితృదేవతల (మృత) తిథినాడు కాని లేక 12 రోజులలో ఏదో ఒక రోజు కాని ఆచరించవచ్చు తల్లిదండ్రులు లేనివారే ఈ తీర్థశ్రాద్ధాన్ని ఆచరించడానికి అర్హులు.

ఈ శ్రాద్ధకర్మ పితరుల ప్రేతత్వవిముక్తికి పుణ్యలోకప్రాప్తికి మాత్రమే కాకుండా బ్రతికివున్న సంతతికి ప్రత్యవాయం లేకుండా చేయడానికి వంశం పెరగడానికీ, మంచి కలగడానికి సాధనం అవుతుంది. పుష్కరకాలంలో చేయబడే ఈ తీర్థశ్రాద్ధంతో మాతృవర్గ, పితృవర్గాలకే కాకుండా. మాతామహి మాతామహ వర్గత్రయానికి భాతృ - పితృవ్య భగినీ - భావుక శ్వశుర - స్యాలక - గురు రిక్థి మొ॥ వారికి మరణించిన, తన సంబంధులందరికీ పిండప్రదానం చేయాలి.

అంతేకాక తనకు ఉపకారం చేసినవారు, మిత్రులు, ఆశ్రితులు, సేవకులు విష, శస్త్ర, అగ్ని, జల అశనిపాతాదులవల్ల దుర్మరణాన్ని పొందినవారు, మరణానంతరం అంత్యకర్మ లోపించినవారు. క్షయ, అపస్మారక, కుష్ఠాదిరోగాలతో మరణించినవారు, దారాపుత్రాదులు లేనివారు, వికలాంగులు, కర్మభ్రష్టులు, జాతిభ్రష్టులు, బ్రహ్మహత్యాది మహాపాపాలు చేసినవారు ఎవరైనా వుంటే వారందరికి సద్గతి కలగడానికి ధర్మపిండ ప్రదానం చేయబడుతుంది. ఇలా తీర్థ శ్రాద్ధాన్ని ఆచరించటం ద్వారా పితృదేవతల అనుగ్రహం కలిగి, వారి ఆశీస్సులు లభించి, తను, తన కుటుంబం సుఖశాంతులతో జీవించే అవకాశం లభిస్తుంది.

తన శక్తికి తగినట్లు సామాన్య మానవుడైనా పారణవిధానంగా అన్నశ్రాద్ధాన్ని ఆచరించడం మంచిది. అలా సాధ్యం కాకపోతే ఆమశ్రాద్ధాన్ని లేకపోతే, హిరణ్య శ్రాద్ధాన్ని చేయవచ్చు.

ఈ కృష్ణాపుష్కరం భారతీయులమైన మన అందరకు గొప్ప భాగ్యవశమున వచ్చిన మహావకాశం. ఈ సమయంలో వారి వారి శక్తికి, అర్హతకు తగినట్లు పైన చెప్పిన స్నాన, దాన, శ్రాద్ధాది కర్మలను అనుష్ఠించి మంచి పుణ్యవిశేషాన్ని మనమందరం సంపాదించుకోవడానికి ప్రయత్నం చేద్దాం.

★★★★

# పితృకర్మలు - వైజ్ఞానిక సమన్వయం

*డాక్టర్ ఎక్కిరాల కృష్ణమాచార్య*

**విభాగం :**

పితృకర్మలు అంటే భారతీయ సంప్రదాయాన్ని అనుసరించేవారు తమ తల్లిదండ్రులు చనిపోయినపుడు ఆచరించే వేదోక్తకర్మలు. వీటిని శ్రద్ధతో ఆచరిస్తారు గనుక, శ్రాద్ధకర్మలు అని కూడా అంటారు. ఈ శ్రాద్ధ కర్మలలో చాలా తరగతులు ఉన్నాయి. దేహాన్ని విడిచినపుడు దహనం చేసేవరకూ కొన్ని కర్మలు, అటుపైన ప్రేతత్వాన్ని లేకుండా చేయడానికి పదిరోజులవరకూ కుమారుడు ఆచరించే కర్మలూ, ఒక తరగతికి చెందినవి. అలాగే దేహం విడిచిన సంవత్సరంలో ప్రతిమాసం అదే తిథినాడు ఆచరించే కర్మలు మాసికాలు. అటుపైన ప్రతి సంవత్సరమూ ఆ మాసంలో ఆ తిథినాడు ఆచరించే వేదోక్తకర్మను ఆబ్దికం లేక తద్దినం అంటారు, నిష్ఠాపరుడైన గృహస్థుడు ప్రతి అమావాశ్యనాడు ఆచరించే పితృకర్మని పిండపితృయజ్ఞం అంటారు. ఇదికాక పుష్కరాల్లో పుణ్యనదీ తీరాన ఆచరించే పితృకర్మను పుష్కరశ్రాద్ధం అంటారు.

**సర్వమతవ్యాప్తి :**

ఈ కర్మలన్నీ వేదోక్తాలే అయినా వీటిని ఆచరించే విధానం వేదమంత్రాల్లో కనబడదు. ధర్మశాస్త్రగ్రంథాల్లో కనిపిస్తుంది. కనుక కొంతమంది వీటిని కల్పితాలు అనుకొంటారు. అలా అనుకోవడం న్యాయం కాదు. అలా భావించే పక్షంలో మానవుడు కనిపెట్టిన శాస్త్రాలు, కళలు, విద్యలు, చట్టము, రాజ్యాంగము అన్నీ మానవకల్పితాలే గదా! వాటిని అసత్యాలు అనగలమా? వాటిని కనిపెట్టిన మానవుడు జీవితాన్ని సంస్కారవంతం చేసుకొంటున్నాడు. గనుక ఇవన్నీ శాస్త్రసంస్కారాలే. అలాగే పితృ కర్మలు కూడాను. జాగ్రత్తగా పరిశీలిస్తే భారతీయ సంప్రదాయంలోనే కాదు వివిధ దేశాల సంప్రదాయాల్లో కూడా దేహం విడిచిన వాళ్లకి బ్రతికివున్న వాళ్ళు చేసే శ్రాద్ధ కర్మలు ఏదో ఒక రూపంలో జరుగుతూనే ఉన్నాయని తెలుస్తుంది. కర్మసిద్ధాంతాన్ని నమ్మని క్రైస్తవ మతంవారు కూడా నవంబరు 7వ తేదీనాడు ప్రతి సంవత్సరం 'ఆల్ సోల్స్ డే' అనే పేరుతో తద్దినాలు

పెడతారు. చనిపోయిన వారి గోరీల దగ్గర శ్రద్ధాభక్తులతో పోయి పువ్వులు, భక్ష్యభోజ్యాలు అర్పిస్తారు. పిల్లల గోరీల దగ్గర ఊయలలు, ఆట బొమ్మలు కూడా ఉంచి వస్తారు. అలాగే మహమ్మదీయ, యూదు మతాలలో కూడా పితరుల ఆరాధన ఉన్నది.

**పితరుల ద్వారా పునర్జన్మ :**

దేహం విడిచిన తర్వాత జీవుడు ఉంటాడన్న శాస్త్ర సత్యంమీద ఆధారపడి ఉంది ఈ పితృకర్మలవిధానం అంతా. దేహంతో జీవుడు అంతమవుతాడు అనేది కంటికి కనిపించే విషయమేకానీ శాస్త్రీయ సత్యంకాదు. బల్బు మాడిపోతే విద్యుచ్ఛక్తి లేకుండాపోదు. కాని ఇది కంటికి తెలిసే సత్యంకాదు. బుద్ధి గమ్యమైన శాస్త్ర సత్యం. కుండలు తయారుచేసే కుమ్మరివాడు ఉంటాడని తెలియని కుర్రవాడికి కుండ బ్రద్ధలైతే ఏడుపు వస్తుంది. దేహం తల్లిగర్భంలో కుండలాగా తయారుచేయ బడుతుంది. దాన్ని తయారుచేసుకొనేవాడు జీవుడు. కర్మాగారం వంటిది తల్లిగర్భం. అందులో టెక్నీషియన్ల వంటివాళ్ళు మనస్సు, బుద్ధి, ఇంద్రియశక్తులు, జీవశక్తులు. వీరందరినీ ఎరిగి ఉన్న ప్రాచీనశాస్త్రం వీళ్ళకి దేవతలు అని పేరు పెట్టింది. అందులో తల్లిగర్భంలో జీవుణ్ణి ఆధారం చేసి పెంచే దేవతలు పితృదేవతలు అనబడే వర్గంలో ఒక అంతర్భాగం. వాళ్లు చంద్రకిరణాలు, చంద్రకళలు ఆధారంగా చేసుకొని గర్భంలో పిండాన్ని నిర్మాణం చేస్తారు. కనుకనే చంద్రుడు భూమిచుట్టూ ఒకసారి తిరిగే కాలవ్యవధి స్త్రీ ఋతుకాలానికి కేలండరులాగా పనిచేస్తుంది. (28 రోజులు) జీవుడు దేహం విడిచినప్పటినుండి మళ్లీ తల్లి గర్భంలో పడేలోపున జరగవలసిన పరిశుద్ధి కొంత ఉంటుంది. ఆ పరిశుద్ధికి సంబంధించినవే చనిపోగానే చేసే శ్రాద్ధకర్మలు. ఆ జీవి మళ్లా తల్లి గర్భంలో ఉత్తమ జన్మ పొందటానికి చేసే శాస్త్రీయమైన కర్మకాండయే తద్దినం. పిండ పితృయజ్ఞం, పుష్కర శ్రాద్ధం.

**పితృకర్మలు శారీరకదోషాలను పోగొడతాయి :**

మనకి భౌతిక శరీరం ఉన్నట్లే ఇంకా కొన్ని సూక్ష్మ శరీరాలు ఉన్నాయి. అవి ఆవేశ శరీరం, భావనామ శరీరం, బుద్ధిమయ శరీరం మొదలైనవి. వీటిలో కొన్నివేల పొరలు సూక్ష్మశరీరాలు ఉన్నమాట సత్యం. ముఖ్యంగా మూడు విభాగాలు చేసి, స్థూలశరీరం, సూక్ష్మశరీరం, కారణశరీరం అని

సామాన్యులకోసం చెప్పారు పెద్దలు. ఈ శరీరాలన్నీ జీవుడికి అలవాటు చొప్పున ఏర్పడేవి. ఈ అలవాటునే పూర్వకర్మ అంటారు. మనం అలవాటు చొప్పున నిద్ర లేవడం, స్నానాదులు చేయడం, ఆఫీసుకు వెళ్ళడం, ఇంటికి రావడం, భార్య మొదలైన వాళ్ళను గుర్తించడం చేస్తున్నాం. అలవాటు అయినకొద్దీ ఆలోచన అక్కరలేకుండా జరుగుతాయి. అలాగే పూర్వకర్మ బలీయమైనకొద్దీ దేహాలు అప్రయత్నంగా ఏర్పడుతాయి, పెరుగుతాయి, అపవిత్రము అయిన పదార్థాన్ని చేకూర్చుకొంటాయి. దురభ్యాసాలు ఋణాది భయాలు, ఈర్ష్యలు, అసూయలు మొదలైన అలవాట్లతో కూడిన సూక్ష్మద్రవ్యం భౌతికదేహం విడిచిన తర్వాత కూడా ఆ గుణాలతో వెటాడుతుంది. దాన్ని పోగొట్టవలెనంటే ఒక శాస్త్రీయమైన విధానం ఉండాలి. ఇది వైద్యంలాంటిది. నాలిక మీద మందుపడితే మోకాటిలో ఉన్న నొప్పి ఎలా తగ్గుతుందో అలాగే ఒక బ్రతికి ఉన్నవాడిని భోక్తగా పూజించి శ్రాద్ధకర్మ చేస్తే చనిపోయినవాడికి ఉన్న పూర్వకర్మదోషాలు తొలగుతాయి. ఇందులో స్నానాదికాలతో శుచిత్వాన్నీ, వేదమంత్రంతో శబ్దాన్నీ, నువ్వులు మొదలైన వస్తువులతో శాస్త్రీయమైన ద్రవ్యాన్నీ, సందర్భ పరచడం ఉంటుంది. ఈ సందర్భపరచడాన్నే కల్పము లేక క్రతువు అంటారు. దీని వలన మన చుట్టూ ఉన్న శబ్ద స్పర్శ రూప రసగంధాలను శాస్త్రీయంగా వినియోగించడం జరుగుతుంది. దీనితో ఆ దేహం వదలినవారికి, సూక్ష్మశరీరంలోని దుష్కర్మ బంధాలు తొలగి, పవిత్రమైన శరీరంతో, మనస్సుతో మరల జన్మ లభిస్తుంది.

**లౌకికసమన్వయం :**

జీవించి ఉన్న ఒకరు భోంచేస్తే చనిపోయిన మరి ఒకరికి ఆ శ్రాద్ధం ఎలా చెందుతుంది? అని సందేహం కలగవచ్చు. దృశ్యమైన ఈ లోకంలో తిరుగుతూ ఉన్న మన వెనుక అదృశ్యాలైన అనేక లోకాలు ఉన్నాయి. ఆ లోకాల మధ్య తంతి తపాలా వంటి ఏర్పాట్లు ఉన్నాయని శాస్త్ర పరిశీలన వలన తెలుస్తుంది. మనం పోస్టాఫీసులో మనియార్డరు చేసి పొస్తువారికి డబ్బు అప్పచెబితే మనం ఉద్దేశించివాళ్ళకి అది చేరే ఏర్పాటు ఉన్నది గదా! దీనినే తపాలాశాఖ అంటాం. అలాంటిదే పితృదేవతలశాఖ.

**వంశగౌరవాభివృద్ధి :**

ఈ పితృకర్మల విషయంలో మరొక విశేషం కూడా ఉన్నది. పవిత్రమైన జీవితం నడిపిన మహానుభావులు దేహం వదలిన వెనుక ఆ ఇంట్లో అదే విధమైన పవిత్ర జీవితం తరువాత తరాల్లో నడుస్తూ ఉంటే తాము మరల అదే ఇంట్లో బిడ్డలుగా జన్మిస్తారు. దానికి ఈ పితృకర్మలు ఎంతగానో సహాయపడుతాయి. ఇలా జన్మించడం వల్ల కుటుంబ సంస్కారం పతనం కాకుండా నిలబడటానికి, విశ్వశ్రేయస్సు అనే యజ్ఞార్థ జీవితాన్ని అలవరచుకోవడానికి వీలవుతుంది. అలాంటి కుటుంబాలతో నిండిన ఊరులు జాతి అభ్యుదయానికీ, ఔన్నత్యానికీ, ఏకముఖత్వానికీ చాలా సహాయపడుతారు. ఇంతకన్నా నరజన్మకు పరమావధి వేరే లేదనే చెప్పాలి. ఏ కుటుంబాలలో నిత్యస్నానమూ, శుచిత్వమూ, శ్రాద్ధకర్మలూ, భూతదయా, ఆస్తిక్యమూ ఉంటాయో ఆ కుటుంబాలు అన్ని విధాలా అభివృద్ధిలో ఉంటాయి. ఏ పరిస్థితులలో ఉన్నా వాళ్లు సుఖశాంతులను, స్వేచ్ఛను అనుభవిస్తూ ఉంటారు. స్వచ్ఛమైన అద్దంలో ప్రతిబింబంలాగా జ్ఞానంకూడా సహజత్వంతో వెలుగొందుతుంది.

**వైజ్ఞానిక సమన్వయం :**

ఇంతకీ శ్రాద్ధకర్మలు చేయనివాళ్ళంతా పతనం చెందుతున్నారు? శ్రాద్ధకర్మలు చేయనివాళ్ళకి గతులు లేవా? అని ప్రశ్నించవచ్చు. ఉన్నాయి కాని సంస్కారమయమైన జీవితంలో ఉన్న సుఖం, మిగిలినవి ఎన్ని ఉన్నా ఉండదు. మానవుడు కంచంలోనో గిన్నెలోనో ఎందుకు అన్నం తింటాడు? కుక్కలాగా నేలమీద పోసుకొని తింటే ఆకలి తీరదా? చేతులతో తినడందేనికి? తినేముందు, తిన్న తర్వాత చేయి కడుక్కోనడం దేనికి? అన్న ప్రశ్న ఎలాంటిదో ఇదీ అలాంటిదే. పెళ్ళి చేసుకోకపోతే బిడ్డలు పుట్టరా? జంతువులకు పుట్టడంలేదా? అన్న ప్రశ్న ఎలాంటిదో ఇదీ అలాంటిదే. పరిశుభ్రమైన పాత్రలో అన్నం తినడం, మంత్రపూతంగా స్త్రీ పురుషులు వివాహమాడటం, కామ సంబంధమైన అంటు వ్యాధులు లేకుండా పాతివ్రత్యమూ, ఏకపత్నీవ్రతం నిర్వహించడం ఎలాంటిదో పితృకర్మలవల్ల కలిగే పవిత్రమైన లోకాల అనుభవాలు కూడా అలాంటివే. అది లేనివారు జీవించరని అర్థంకాదు. తెలిసినవారు సద్వినియోగం చేసుకోవాలనే అర్థం.

ఎలక్ట్రిక్ లైట్లు, ఫంకాలు, టెలిఫోన్లు, రేడియోలు లేకపోతే మానవుడు బ్రతకడా? బ్రతుకుతాడు. అయినా ఈ శాస్త్రీయ విజ్ఞానాన్ని ఎలా వినియోగం చేసుకొంటున్నాడో అలాగే మానవుడు పితృకర్మల శాస్త్రాన్ని కూడా వినియోగం చేసుకోవచ్చు. మానవుడు అనుభవించే పవిత్రలోకాలు పైన ఆకాశంలో ఎక్కడా ఉండవు. వాడి అనుభవంలోనే ఉంటాయి. ఒకడు నిద్రపోతూ ఉండగా మరొకడు మేలుకొని ఉంటే వారిద్దరి నడుమా గల భేదం ఎట్టిదో లోకాలభేదం కూడా అట్టిదే. లోకాలు ప్రజ్ఞలకు సంబంధించినవి గాని చోటుకి సంబంధించినవి కావు.

**పుష్కరాల్లో పితృకర్మలు :**

శ్రాద్ధకర్మల్లో పుష్కరంలో చేసేవి ఒక భాగం. భారతదేశంలో పుణ్యనదులు చాలా ఉన్నాయి. అందు ముఖ్యంగా పన్నెండు నదులని పెద్దవాళ్ళు లెక్కలోకి తీసుకొన్నారు. బృహస్పతి అనే గ్రహం పన్నెండు సంవత్సరాలకి ఒకసారి రాశిచక్రంలో తిరిగి వస్తుంది. ఒక్కొక్క నదిలో ఉన్న జలాలు బృహస్పతి సంచారం చేసే రాశిని అనుసరించి ప్రభావితం అవుతూ ఉంటాయి. ఆ ప్రభావితం అయిన కాలాన్ని ఆ నదికి పుష్కరం అంటారు. ఈ శాస్త్రం మన పురాణాలలో విశేషంగా వివరించబడి ఉంది. ఈ సంవత్సరం కృష్ణానదిమీద ఈ ప్రభావం ఉంటుంది గనుక, ఇది కృష్ణాపుష్కరం. కొన్ని వేల సంవత్సరాలనుండి మహా పురుషులు పుష్కరశ్రాద్ధం పేర పితృకర్మలు ఆచరించినట్లు పురాణాల్లో వర్ణింపబడి ఉంది. మనం కూడా వారి మార్గాన్ని అనుసరించి వారిచ్చిన విజ్ఞానాన్ని వినియోగించుకొనడం మంచిది. ప్రాచీన నవీన శాస్త్రాల్లో దేనినీ కాదనడం శాస్త్ర దృక్పథం కాదు. తెలిసిన విజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవడంలోనే పరిశీలనాబుద్ధి ఇమిడి ఉంటుంది. మానవుడు బుద్ధిజీవి గనుక ఈ వినియోగం అందరికీ శ్రేయస్సు చేకూరుస్తుంది. పన్నెండు సంవత్సరాలకు ఒకమారువచ్చే ఈ కృష్ణాపుష్కర సదవకాశాన్ని అందరూ వినియోగించుకొని పితృకర్మలు ఆచరించి, తమ పెద్దలైన పితరులకు సుఖశాంతులు కల్పించడం శ్రేయోదాయకం. పుష్కరశ్రాద్ధం మొదలైన పితృకర్మలన్నీ సూక్ష్మంగా శాస్త్రీయ దృక్పథంతో పరిశీలించినకొద్దీ వాటిలో ఉన్న విశేషం బోధపడుతుంది. వినియోగించుకొన్న కొద్దీ జీవితం వికాసవంతం అవుతుంది.

★★★★

# పుష్కరాల్లో ఎందుకు పితృకర్మలు చేయాలి?

శ్రీ ఎం. బాలవిశ్వనాథశర్మ

నదీజలాల్లో చేప త్రిషవణ స్నానం చేస్తూ ఉంటుంది. సర్పము గాలినాహారంగా తీసుకొని జీవిస్తుంది. మేక ఆకుల నమిలి బ్రతుకుతుంది. చాతకపక్షి నెలల తరబడి ఆహారమే ముట్టుకోదు. ఎలుకలు కొండగుహల్లో నివసిస్తాయి. గాడిద బూడిద పూసుకొంటుంది. కొంగ సంతత ధ్యానం చేస్తుంది. ఈ ప్రాణులు చేసే పనులే ఋషులూ చేస్తారు. కాని జంతువులకు లేని భావశుద్ధి ఋషులకు ఉంటుంది. అందుచేతనే ఋషులు తరిస్తారు. ఇతర ప్రాణులకు తరణోపాయం లేదు. భావంలోను, విశ్వాసంలోను దైవమున్నదేగాని ఇతరంలో లేదు.

వైదిక మార్గాన్ని, ఋషి వాక్యాన్ని విశ్వసించే మతం మనది. ఆ మంత్రద్రష్టలైన ఋషులు కూడ గుడ్డిగా నమ్మమని మనకు చెప్పలేదు. నిరాధారమైన పలుకు వారి నోటివెంటరాదు. తప్పుపనులు మనచేత చేయింపవలసిన అవసరం కూడా వారికి లేదు. అయినా ఎప్పుడో భావితరంలో పుట్టనున్న మనల్ని మోసగించినంత మాత్రాన వారికి ఒరిగే లాభమూ లేదు. ఋషిమతం మీద, ఋషివాక్యంమీద, అర్థధర్మం మీద విశ్వాస ముంచుకొన్నవాడు ఎన్నటికీ చెడడు.

నదీ పుష్కరాల్లో శ్రాద్ధమెందుకు చేయాలి? అసలు పుష్కరానికి శ్రాద్ధానికి ఏమిటి సంబంధం? అన్నది ప్రశ్న. ఈ ప్రశ్నకిది సూటిగ సమాధానం.

*శ్లో॥ గంగాయాం పుష్కరే శ్రాద్ధే అర్ఘ్యమావాహనాదికమ్।*
*తృప్తి ప్రశ్నాదికం పిండం యథావిధి సమాచరేత్॥*

*శ్లో॥ భూతలే యాని తీర్థాని తాని కన్యాగతే గురౌ।*
*అయాంతి కృష్ణవేణీం తు మహాపుణ్య ఫలాయ చ॥*

శ్లో॥ బ్రహ్మా విష్ణుశ్చ రుద్రశ్చ ఇంద్రాద్యా స్సర్వ దేవతాః।
పితరో ఋషయశ్చైవ తత్రైవ నివసంతి హి॥

శ్లో॥ కృష్ణాయాః పుష్కరే కృత్వా స్నానం దానం చ పైతృకమ్।
గంగాయాం కోటిగుణితం ఫలమాప్నోతి మానవః॥

"బ్రహ్మవైవర్తే"

బృహస్పతి కన్యారాశిలో ప్రవేశించుటచేత కృష్ణానదికి పుష్కరాలు వచ్చాయి. ఈ పుష్కరం మహాపర్వం. అనగా గొప్ప పుణ్యసమయం.

ఈ సమయంలో భూమండలంలోని సమస్తతీర్థాలేగాక ఇతర లోకాల్లోని పవిత్ర తీర్థాలన్నీ కృష్ణానదిలో చోటు చేసుకుంటాయి. ఈ పవిత్ర సమయంలో పుణ్యఫలంమీద, నివాపాంజలుల మీద అపేక్షకొద్దీ, త్రిమూర్తులు, ఇంద్రాది దేవతలు, సమస్త ఋషులు, పితృదేవతలు, పర్వకాలం దాటేంతవరకు, పుష్కరస్థానంలో నివాసాలు ఏర్పరచుకొంటారు. అందుకే స్నానము, దానము, పూజ, పితృతర్పణాలు, శ్రాద్ధకర్మలు ఈ పుష్కరాల్లో చేయడం. దీనిచేత మానవులు పుణ్యాన్ని కోటిరెట్లు పెంచుకుంటారు.

పుష్కర సమయాల్లో దేవతలు, ఋషులు, వారితోపాటు పితరులు కూడా వస్తారన్న ప్రమాణవాక్యమున్నది. గనుక స్నానదానములతోపాటు పైతృకకర్మలు కూడ చేయాలన్నదే సంగ్రహమైన సమాధానం. ఇవి చేయడంచేత విధిని అనుష్ఠించిన తృప్తి మనకు, తమ భాగాలనందుకొన్న తృప్తి వారికి తద్ద్వారా పరస్పర సహకారభావములు కల్గడమే ప్రయోజనం.

కాగా మరొక విషయ మిక్కడ మనం తెలుసుకోవలసినదున్నది. ఇక్కడ చేసే శ్రాద్ధం వారికి అక్కడ తిండిపెడుతుందా?

ఢిల్లీ రేడియో స్టేషనులో మాట్లాడే మాటలు, పాడే పాటలు మన ఇంట్లో మనము ఇక్కడ వింటున్నాం, అంటే వాయు తరంగాలలో మన కంటికి కనబడని శబ్దగ్రాహకములైన కొన్ని అణువులు అక్కడి శబ్దాలను మోసుకొని మన కిక్కడికి తెచ్చి వినిపిస్తున్నాయన్నమాట. ఇదేవిధంగా

మనకంటికి కనబడని కొన్ని పదార్థ గ్రాహకములైన అణువులు ఇక్కడ సమంత్రకంగా పెట్టే శ్రాద్ధ ద్రవ్యంలోని ఆహారసారాన్ని మన పితరులకు అందివ్వవచ్చును గదా! ఇంతలేనిది జ్ఞానధనులైన మన పెద్దలు మనకీ సంప్రదాయాన్ని ఎందుకు అందిస్తారు? దానిపై విశ్వాసం కొద్దీ అది పనిచేస్తుంది.

"ఆపస్స్వభావతో మేధ్యాః" అని జలము స్వతః పవిత్రమైనను, కొన్ని సమయాల్లో కొన్ని చోట్ల పారేనీళ్ళు పవిత్ర నదీసారాలను తమ గర్భము నందుంచుకొని పారుచుండును. దేశకాలప్రభావితమైన ఆ స్థలంలో తత్ప్రయుక్తములైన కార్యాలు చేయాలి. అది అనంతమైన పుణ్యాన్ని ఇచ్చేదేకాక ఇహపరములను కూడా సాధించిపెండుతుందని ఋషుల సూక్తి. గుండెలో ఫిరంగిగుండు పెట్టుకొనియైనా బ్రతుక వచ్చునుగాని, ఆప్తులైన ఋషుల వాక్యం మీద అప్రమాణబుద్ధి పెట్టుకొని బ్రతకడం కష్టం.

★ ★ ★ ★

# పర్వకాలం అంటే ఏమిటి?

**శ్రీమద్భాగవతం లక్ష్మీనరసింహాచార్యులు**

**పరిచయం:**

ఈ భూమండలంలో భారతభూమికి రెండు రకాల ప్రసిద్ధు లున్నాయి. ఒకటి ఇది ధర్మభూమి అని, రెండు కర్మభూమి అని. భోగభూములైన ఇతర దేశాల్లో జన్మించడానికంటే కర్మభూమి అయిన ఈ దేశంలో జన్మ ఎత్తడానికి ఆ జీవికి ఎంతో అదృష్టం ఉండాలి. ఎన్నో జన్మల అదృష్టంవల్లనే కొన్ని వేల జన్మలకొకసారి ఈ భూమిపైన జీవి మానవుడై పుడతాడు. ఇది ఎవరో కాలక్షేపానికి చెప్పినమాట కాదు. విష్ణుపురాణం ఎలుగెత్తి చాటుతున్న సత్యం కానీ ఇక్కడ విచారకరమైన విషయమేమిటంటే, మనకు కల్గిన అదృష్టాన్ని గుర్తించే స్థితిలో మనం లేకపోవడం. ఈ నగ్నసత్యాన్ని బాగా గుర్తించిన మన పూర్వులు మన జీవితాన్ని చక్కగా విభజించి, ఆయా దశల్లో మనం నిర్వహించాల్సిన కర్మల్ని మన కుపదేశించారు. కర్మసిద్ధాంతాన్ని తీసివేస్తే మన వేదాంతాలు, సంస్కృతులు సంప్రదాయాలు నిలవడానికి కూడా చోటుండదు. ఒక జీవితాకలంలో మానవుడు ఆచరించవలసిన ఈ కర్మలను క్రమంగా ఎంతో చక్కని పద్ధతిలో వారు మనకు బోధించారు. కొన్ని కర్మలను కొన్ని యోగ్యమైన కాలాలలోనే ఆచరించాలి. కొందరే కొన్ని కర్మలను అనుష్ఠించడానికి అర్హులు. కాబట్టి అన్ని కర్మలూ అన్ని కాలాల్లోను ఆచరించాలనుకోకుండా. యోగ్యా యోగ్యతలను నిశ్చయించుకొని నిర్వహించాలి. కొన్ని కర్మలు పర్వకాలంలోనే ఆచరించదగినవి. వాటిని మిగతా కాలంలో చేస్తే ప్రాయశ్చిత్తం చేయవలసి ఉంటుంది. అయితే పర్వకాలమనే మాటకు ఏమిటి అర్థం? అని సంశయం కలుగుతుంది. చూడండి.

**పర్వనిర్వచనం:**

పర్వశబ్దం మనకు ఋగ్వేదంలోను, శతపథబ్రాహ్మణంలోను, మహాభారతంలోను కనబడుతుంది. పర్వపదానికి ముడి, సంధి, కణుపు, గ్రంథభాగం, ఉత్సవం అనేవి సామాన్యార్థాలు. ఒక మహా ప్రాసాదానికి కట్టిన సోపానపంక్తిలో ఉండే సోపానానికి కూడా పర్వమనే వ్యవహారం ఉంది. తరువాతి కాలంలో చాతుర్మాస్యవ్రతం కూడా పర్వమనే పిలవబడింది. రాను రాను ఒక విశిష్టమైన సమయపరంగా కూడా పర్వపదం ప్రయోగంలో చోటు

చేసుకుంది. వీటినన్నింటిని పరిశీలించిన తరువాత పర్వపదం యొక్క ప్రయోగాన్ని బట్టి, రెండు ప్రత్యేకకాలాలకు మధ్యలో సంధిలాంటి పవిత్రకాలం పర్వమని, ఆత్మసంస్కారాన్ని పెంపొందించుకొనే వైదికకర్మలు కొన్ని ఆకాలంలో చేయబడతాయని మనం భావించవచ్చు.

**ఏవి పర్వకాలాలు:**

వెనుక చెప్పినట్లు కర్మభూమియైన భారతభూమిలో ఎన్నో సత్కర్మలను చేసి వాటిద్వారా పుణ్యాన్ని సంపాదించుకొనే అర్హతగల మానవులకు ఎన్నో సత్కర్మలు, వాటిని ఆచరించడానికి తగిన కాలాలు మహర్షులచేత నిర్దేశింపబడ్డాయి. మొట్టమొదట ఈ పర్వకాలాలెన్ని? అనే విచారం ఏర్పడినప్పుడు ఇవి నాలుగు అన్నారు. వాటనెలా గుర్తించడం? అంటే, చంద్రుడు కళలను పెంచుకోవడంద్వారా గాని, పోగొట్టుకోవడం ద్వారా గాని కొన్ని మార్పులు వస్తాయి. కాబట్టి అదొక పర్వం. అలాగే చతుర్దశి నాటికి ఇంకొన్ని మార్పులకు అతడు గురౌతాడు కాబట్టి అదీ ఒక పర్వం. ఇక మిగిలింది అమావాస్య. ఆనాడు దేవకార్యం కోసం పూర్తిగా క్షీణిస్తాడు కాబట్టి అదొక పర్వం. ఇలా మొదట ఈ పర్వకాలాలు నాలుగుగా పేర్కొనబడ్డాయి. ఇలాగే సూర్యుడు ఒక రాశి నుచి ఇంకో రాశికి సంక్రమించే రోజు కూడా పర్వకాలంగా గుర్తించబడింది. అంటే ప్రతి సూర్యసంక్రమణం మనకు పర్వకాలమన్నమాట. కాలక్రమేణ మొత్తం సూర్యచంద్రుల్ని బట్టి సంభవించిన 5 పర్వకాలాలను కలిపి పంచపర్వాలనే పేరుతో వ్యవహరించారు. దీన్నే విష్ణుపురాణం ఇలా చెబుతుంది:

*చతుర్దశ్యష్టమీ చైవ అమావాస్యాథ పూర్ణిమా।*
*పర్వాణ్యేతాని రాజేన్ద్ర రవిసంక్రాంతిరేవ చ॥*

మొత్తంమీద 1. అష్టమి 2. చతుర్దశి 3 పూర్ణిమ 4. అమావాస్య 5. సూర్యసంక్రమణ దినం ఈ అయిదు పంచపర్వాలనే పేరుతో ప్రసిద్ధిని పొందాయి.

ఇవికాక సూర్య చంద్ర గ్రహణసమయం, పుష్కరసమయం కూడా పర్వకాలమే అవుతుంది. పుష్కరం అంటే ముఖ్యంగా బృహస్పతి ఒక రాశిని వదలి ఇంకొకరాశిలో ప్రవేశించిన మొదటి, చివరి పన్నెండురోజులు కాబట్టి అది కూడా సంక్రమణమే కనుక పర్వకాలమే. అంతేగాక పర్వమంటే ప్రత్యేకమైన పవిత్రకాలమని కూడా అర్థం కాబట్టి దాన్ని పర్వకాలం అనడంలో తప్పులేదు.

**పర్వకాలంలో ఏం చేయాలి?:**

పర్వకాలంలో సాధారణంగా స్నాన - దాన - జప - తపస్సులను ఆచరించాలి. అది పుష్కరమైతే అప్పుడు చేయవలసిందంతా చాలా విస్తృతంగా ఉంటుంది. సామాన్య పర్వకాలాలలో పై చెప్పిన కర్మలను శాస్త్రోక్తంగా చేయాలి. పర్వకాలాల్లో తల్లిదండ్రులు లేనివారు కొన్ని శ్రాద్ధ - తర్పణాదులను చేయాలి. వాటిని 'పార్వణం' అని 'పార్వణశ్రాద్ధం' అని కూడా అంటారు. అమావాస్య నాడు ముగ్గురిని ఉద్దేశించి చేసే శ్రాద్ధకర్మకు పార్వణశ్రాద్ధమనే వ్యవహారం ఉంది.

*''తత్ర త్రిపురుషోద్దేశేన యత్క్రియతే తత్ పార్వణమ్''*

*మితా 1-217*

***అమావాస్యాం యత్క్రియతే తత్పార్వణముదాహృతమ్।***
***క్రియతే వా పర్వణి యత్తత్పార్వణమితి స్మృతిః॥***

భవిష్యపురాణం అమావాస్య పర్వకాలంలో చేసే ఈ కర్మ పార్వణమని పేర్కొంటున్నది.

ఒక్కొక్క పర్వానికి ఒక్కొక్క వైశిష్ట్యం ఉటుంది. ఆ పర్వంలో విధింపబడిన వాటిని ఆచరించడం ద్వారా, నిషిద్ధమైన వాటిని ఆచరింపకపోవడం చేతను మన ఆత్మ - మనో గతదోషాలు పోయి, పుణ్యంవల్ల ఆత్మప్రకాశం లభిస్తుంది.

**పర్వకాలంలో ఏం చేయకూడదు?:**

పర్వకాలాల్లో విధివిహితమైన కర్మలు చేస్తే ఎలా పుణ్యం సంభవిస్తుందో, నిషిద్ధమైన కర్మలు చేస్తే అలా పాపం కూడా సంభవిస్తుంది. స్త్రీ సంపర్కం, ఒంటికి గాని తలకుగాని నూనె రాచుకోవడం, లేక అభ్యంగన స్నానం చేయడం, మాంసాన్ని తినడం మొదలైనవి నిషేధించాలి. అలా నిషేధించకపోతే చనిపోయిన తరువాత విణ్మూత్ర భోజనమనే నరకాన్ని అతడు పొందుతాడు. ఈ విషయాన్నే విష్ణుపురాణం ఇలా ప్రదిపాదిస్తుంది:

***స్త్రీ తైలమాంససంభోగీ పర్వస్వేతే, వై పుమాన్।***
***విణ్మూత్రభోజనం నామ ప్రయాతి నరకం మృతః***– విష్ణు - III, II, 119

కనుక పర్వకాలంలో భోగాలు, విలాసాలు మానేసి, సాత్వికాహారం తీసుకొని శాస్త్రోక్తంగా వైదిక కర్మలను ఆచరించాలి.

**అలా చేస్తే ఏం లాభం:**

ఇలా పర్వకాలాలలో విద్యుక్తమైన కర్మలను ఆచరించటం వల్ల మానవునకు ఏం లాభం కలుగుతుంది? అనేది ప్రశ్న. దీనికి సంగ్రహంగా ఇది సమాధానం.

మానవుడు పుడుతూనే మూడు ఋణాలతో పుడతాడు. అవి దేవ ఋషి పితృఋణములు. పుట్టినప్పటినుంచి అనేక కర్మల ద్వారా ఈ ఋణాలను మూడింటిని తీర్చుకోవటానికి ప్రయత్నం చేస్తూ ఉంటాడు. జీవితంలో ఒక్కొక్క పర్వకాలంలో తానాచరిస్తున్న కొన్ని కొన్ని కర్మల ద్వారా ఒక్కొక్క ఋణము తీరిపోయి ఋణవిముక్తుడవుతాడు. అతడు ఋణవిముక్తిని పొందే కొద్దీ అతడి ఆత్మమోక్షం పొందడానికి అర్హతను సంపాదిస్తుంది. పర్వం అనే శబ్దానికి మెట్టు అనే అర్థం ఉన్నట్లు ఇంతకు పూర్వం అను కొన్నాం. ఒక్కొక్క పర్వంలో ఒక్కొక్క రకమైన కర్మను చేస్తూ ఒక్కొక్క మెట్టు ఎక్కి ఆత్మ ప్రకాశాన్ని సంపాదించుకొని ముక్తి ప్రాసాదాగ్రానికి చేరగలుగుతాడు మానవుడు.

అలాగే పర్వం అనే పదానికి ముడి అని సంధి అని కూడా అర్థాలున్నాయికదా! మానవుడు అంతకు పూర్వం సంపాదించిన సంస్కారానికి ముందు సంపాదించబోయే సంస్కారానికి ఈ పర్వకాలం ఒక సంధిలాంటిది అని కూడా చెప్పవచ్చును. అలాగే ఈ పర్వకాలంలో ఆచరించే కర్మలు ఇతడి ఆత్మసంస్కారాన్ని ప్రతి పర్వంలోను దృఢపరుస్తూ ముడిపెడుతుంటాయి అని కూడ మనం ఊహించుకోవచ్చు.

మొత్తం మీద కర్మభూమి అయిన భారతావనిలో పుట్టిన ప్రతి మానవుడు తన జీవితకాలంలో సంభవించే పవిత్రమైన ప్రతి పర్వకాలంలోను పరంపరగా వస్తున్న శాస్త్రీయమైన అనేక కర్మలను ఆచరించటం ద్వారా సంస్కారాన్ని దృఢతరం చేసుకొని ఒక్కొక్క మెట్టు ఎక్కి మాధవాభిముఖంగా ప్రయాణం చేస్తూ మోక్షాన్ని సాధించటానికి అర్హతను సంపాదిస్తాడు. అందుకే ఈ పర్వకాలాలను ప్రతివాడు చక్కగా ఉపయోగించుకోవాలని శాస్త్రాలు ఉపదేశిస్తున్నాయి.

★★★★

## కృష్ణవేణీ ప్రభావం

**నమామి సుకృతశ్రేణిం కృష్ణవేణిం తరంగిణిమ్।**
**యద్వీక్షణం కోటిజన్మకృత దుష్కర్మశిక్షణమ్॥** తీ.ప్ర. 39 పే.

పుణ్యపరంపరలు కల ఏ నదిని చూసినంత మాత్రానే కోటిజన్మలలో చేసిన పాపాలు శమిస్తాయో అటువంటి నదీమతల్లి కృష్ణవేణికి నమస్కరిస్తున్నాను.

## పుష్కరస్నాన మహిమ

**జన్మప్రభృతి యత్పాపం స్త్రియా వా పురుషేణ వా।**
**పుష్కరే స్నాతమాత్రస్య సర్వమేవ ప్రణశ్యతి॥** నవపర్వం 82 పే.

పుట్టినప్పటినుండి స్త్రీచేగాని, పురుషునిచేగాని చేయబడిన పాపమంతా పుష్కర సమయంలో స్నానం చేస్తే తొలగిపోతుంది.

## త్రివేణీస్తుతి

**త్రివేణీ యమఘశ్రేణీకృపాణీ ముక్తికారిణీ।**
**మమానిహితామాదహ్యాద్ధిమానీమంశుమానివ॥** తీ.ప్ర. 43 పే.

పాపాలను ఖండించే ఖడ్గంలాగా వుండి మోక్షాన్ని ప్రసాదించే ఈ త్రివేణి సూర్యుడు మంచు సమూహాన్ని కరిగించినట్లు నా పాపాలను దహించివేయుగాక!

## కావేరి మహిమ

**కావేరి! కమనీయాంగం రంగనాథం సదా హృది।**
**ధత్సే! త్వత్సేవయా దేవి! కో ను కుర్యాన్న తం హృది:॥** తీ.ప్ర.76 పే.

కావేరి! మనోహరమైన శరీరంకల రంగనాథుని నీవు హృదయంలో ధరించావు. నిన్ను సేవించినవారు ఎవరు హృదయమందు రంగనాథుని ధరించరు? అంటే నీ సేవా ఫలం వల్లనే రంగనాథుని స్మరించడమవుతుంది.

★ ★ ★ ★



5

# నదీతీరాల్లో పుణ్యక్షేత్రాలు

డాక్టర్ ఎస్.బి. రఘునాథాచార్య

**పరిచయం:**

మనం జంబూద్వీపంలో భరతవర్షంలో భరతఖండంలో నివసిస్తూ, భారతీయులమని పిలువబడుతున్నాం. ఈ ద్వీపంలో భరతఖండానికి ఏర్పడిన ప్రశస్తి ఇక్కడ ఉన్న అనేక విషయాలపై ఆధారపడి ఉంది. భగవంతుడు ఎన్నో అవతారాలనెత్తి తన పరిపూర్ణానుగ్రహాన్ని ప్రకటించిన భూమి యిది. ధర్మ తత్త్వాన్ని బాగా అర్థం చేసుకోవాలనుకొనే వారు చేరవలసిన చిట్టచివరి మజిలీ ఈ దేశం. సౌజన్యానికి, ఆదర్శప్రవృత్తికి, నిస్స్వార్థభావనలకు, విరక్తికి, తపోనిష్ఠకు, ఆచరణానికి, దివ్యమై, ప్రసన్నమై శాంతసుందరమైన బాహ్యప్రకృతికి, ఒక్కటేమిటి? ఇలా ఇంకెన్నింటికో ఆస్పదమైన భూమి మన భారత భూమి. ఏ కోణంలో నుంచి చూసినా, సమగ్రతను పరిపూర్ణతను సాధించిన సాధుజనులెందరో పుట్టిపెరిగిన పవిత్రమైన గడ్డ ఇది. అనేక రకాల ఈ దేశానికి ప్రసిద్ధిని సంపాదించిన లక్షణాలు ఎన్నో ఉన్నా పరంపరగా వచ్చే మన సంప్రదాయాన్ని, సంస్కృతిని, జాతీయసమైక్యతాభావాన్ని ప్రతిబింబిపజేస్తూ, జాతికి మొత్తానికి చక్కని స్ఫూర్తిని, నూతన సముత్తేజాన్ని, మొక్కబోని చైతన్యాన్ని ఎప్పటికప్పుడు అందిస్తూ, మన జీవనవాహినిలో ప్రముఖస్థానాన్ని ఆంక్రమిచుకొన్నాయి పుణ్యక్షేత్రాలు.

**పుణ్యక్షేత్రాలు:**

'తీర్థం' అనే పదానికి పుణ్యమని కూడా అర్థం. తీర్థక్షేత్రమంటే పుణ్యక్షేత్రమన్నమాట. సామాన్యంగా లోకంలో ప్రసిద్ధమైన దేవాలయాలకు దివ్యక్షేత్రాలనే వ్యవహారముంది. భగవంతుడు అక్కడ తన సాన్నిధ్యాన్ని యిచ్చి భక్తులను అనుగ్రహించడమే దానికి కారణం. అది అన్ని విధాల పవిత్రమైంది కాబట్టి తీర్థక్షేత్రమైంది. మన అందరి పుణ్యం వల్ల అక్కడ భగవంతుని సాన్నిధ్యం కలిగింది కాబట్టి, అక్కడ నెలకొన్న స్వామిని సేవిస్తూ మనం పుణ్యాన్ని సంపాదించుకొంటున్నాం కాబట్టి కూడా దాన్ని పుణ్యక్షేత్రమని అంటున్నాం. ఈ పుణ్యక్షేత్రాలకు మన దేశంలో కనబడుతున్న భౌగోళిక - ఆధ్యాత్మిక ధార్మిక - జీవనపరమైన సంబంధం

ఇతర ఖండాలలో లేదని చెప్పవచ్చు. కన్యాకుమారి నుంచి కాశ్మీరు వరకు ఉన్న భారతీయ పుణ్యక్షేత్రాలను సందర్శిస్తే ప్రతి ఒక్క క్షేత్రంలోను ఎన్నో అద్భుత చరిత్రలు, అనుభవాలు, అనుభూతులు, సాక్షాత్కారాలు, వైభవాలు, మన మనస్సును అకట్టుకొంటాయి. వాటి వెనుక ఉన్న అనాదియైన కాలాన్ని, అద్వితీయమైన సంప్రదాయాన్ని, సముజ్జ్వలమైన సంస్కృతిని, సరిగా అర్థం చేసుకోకుండా, అవన్నీ పుక్కిటి పురాణాలను కుంటే అంతకంటే దురదృష్టం ఇంకోటి ఉండదు. సర్వత్రా వ్యాపించి, మన జీవనప్రవాహంతో కలిసిపోయి మన ఖండానికే ఒక విశిష్టతను సమకూరుస్తూ ఉన్న ఈ తీర్థక్షేత్ర సంస్కృతిని మన దేశం నుంచి తీసివేస్తే, ఊహించండి! మిగిలిందేమిటని? నిశ్చైతన్యమై, నిర్వీర్యమై, నిష్ప్రభావమైన ఒక జాతి. అలా చేయడం ఎవరికీ సాధ్యం కాని పని.

**పుణ్యక్షేత్రాలు నదీతీరాల్లో ఎందుకున్నాయి:**

ఎక్కడ చూచినా ప్రసిద్ధమైన, ప్రాచీనమైన దేవాలయాలు నదీతీరంలోనే, కొండలపైననో, కోనల్లోనో, సముద్రతీరంలోనో, అరణ్యాల్లోనో ఉండడం కనిపిస్తుంది. ఇలా ఈ పవిత్రక్షేత్రాలను ఏర్పాటు చేసిన మన పూర్వులు అభిప్రాయాలు ఏమై వుంటాయి? ఇలా అవి ఏర్పడడానికి యింకేమైనా కారణాలున్నాయా? పై ప్రదేశాలలో కాక మనం నివసించే పల్లెల్లోనో పట్టణాల్లోనో మన మధ్యలోనే ఎందుకు దేవాలయాలు ఉండకూడదు? అని మన కెన్నో సంశయాలు కలుగుతాయి. ఈ సంశయాలకు ఇది సంగ్రహంగా సమాధానం.

మానవుడి మనస్సు చాలా చంచలమైంది. కరిగిన లక్క మనం ఏ మూసలో పోస్తే ఆ ఆకృతిలో తయారయినట్లు మన మనస్సు కూడా మనం ఎలాంటి విషయంలో ప్రవేశపెట్టినా దానితో అనుబంధాన్ని తీవ్రంగా పెంచుకొంటుంది. అది దాని స్వభావం. గట్టిపడిపోయి ఒక ఆకారాన్ని ధరించిన లక్కబొమ్మను మనం ఏం చేసినా మళ్ళా ఆ ఆకారం మారదు. అది కరిగినప్పుడే ఇంకో ఆకారం దాంట్లో సాధ్యమవుతుంది. అలాగే దైనందిన జీవితంలో ఎన్నో అభ్యాసాలకు గురై సమస్యల నెదుర్కొంటూ రాగ, ద్వేష. మోహాలకు బద్ధుడైన మానవుడు వీటికి దూరంగా పోయి అహ్లాదకరమైన ప్రకృతిని చూచి పవిత్రాలు ప్రభావసంపన్నాలు అయిన నదీజలాలలో స్వేచ్ఛగా స్నానం చేసి మహోన్నతమైన పర్వతపంక్తులను పరిశీలించి

మానసికంగా ఒక ఆర్ద్రతను, అనుభూతిని పొందుతారు. నిర్మలంగా శాంతంగా వున్న ఆ మనస్సుకు అపుడు కలిగిన ఏ భావమైన సహజంగా స్థిరంగా నిలబడుతుంది. పరవశించిన అతని హృదయంలో వ్యక్తిగతమైన బరువులు, బాధ్యతలు, కష్టాలు కనపడవు. ఆ క్షణంలో అతడి మనస్సు భగవంతునికి సన్నిహితమౌతుంది. అందుకనే మన పూర్వులు ఈ సంసార విషవలయాన్నుంచి మనస్సును కొంచెం పక్కకు తప్పించి భగవంతునికి దగ్గరగా చేయాలనే ఈ దేవాలయాలను మనం నివసించే చోట కాకుండా, దూరంగా ఏర్పాటు చేశారు.

మన ఇతిహాస పురాణాలు పరిశీలిస్తే ఎందరో మహాభక్తులు కొండలపైన, నదీతీరాల్లోను గొప్పగొప్ప తపస్సులు చేసినట్లుగా కనబడుతుంది. వారిని అనుగ్రహించడానికి అక్కడికి దయచేసిన వారి ఇష్ట దేవత ఆ భక్తుల ప్రార్థనపై అక్కడే ఒక రూపాన్ని ధరించడం కూడా మన క్షేత్రమహాత్మ్యాలలో గమనించవచ్చు. కొన్ని పుణ్యక్షేత్రాలు మనదేశంలో అలా ఏర్పడ్డాయి.

ఆగమశాస్త్రాలను పరిశీలిస్తే గ్రామపట్టణాది నిర్మాణానికి ముందే నిర్దిష్టప్రదేశంలో దేవాలయాలను నిర్మించినట్లు మనకు తెలుస్తుంది. అలా నిర్మించడం తప్పనడానికి వీలులేదు కాని పుణ్యక్షేత్ర ప్రయోజనం పట్టణాదుల్లో కంటే నదీతీరాల్లో కాని నగాగ్రాలపై కాని తేలికగా సిద్ధిస్తుంది. అనేది ప్రత్యక్షసత్యం. ఆధునిక కాలంలో అరచేతిలో వైకుంఠాన్ని చూడాలనుకొనే మానవుడు ఎంతో దూరంలో ఎక్కడోవున్న పుణ్యక్షేత్రానికి పోలేక తమ నివసించేచోట దేవమందిరాలను నిర్మించడం ఎక్కువగా మనం చూస్తుంటాం. ఇళ్ళల్లో దేవమందిరాలున్నా, శాంతి, సమాధానం లేక, ఎక్కడో దూరంగా దేవలయానికి పోవడం ఆ కాసేపయినా ఇంటిని, మరచిపోవాలని మనం చేసే ప్రయత్నమే కాని దేని పవిత్రతా, ప్రభావం దానికే ఉన్నాయి.

**ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలు:**

తన చుట్టూ వున్న ప్రపంచంలో అణువణువునా పరమాత్మను సాక్షాత్కరించుకోగలిగిన సంస్కృతి మనది. భగవంతుడు సర్వాంతర్యామిగా వున్నా పొదుగులోనే ఆవుపాలు లభిస్తున్నట్లు, అగ్గిపెట్టేతోనే నిప్పు

పుడుతున్నట్లు, మంచి బల్బులోనే విద్యుత్తు కాంతి నిస్తున్నట్లు కొన్ని చోట్లనే ఆయన సాన్నిధ్యం అధికంగా కనబడుతుంది. ఇంతకు పూర్వం చెప్పినట్లు అలాంటి పుణ్యక్షేత్రాలు మనదేశంలో, ప్రతికొండలోనూ, ప్రతికోనలోనూ, ప్రతి నదీతీరాల్లోనూ, ఇన్ని అని చెప్పడానికి వీలులేకుండా కోకొల్లలుగా వున్నాయి. నదీసాగరతీరాల్లో సుప్రసిద్ధంగా వున్న ఈ క్రింది పుణ్యక్షేత్రాలు మన అందరికీ తెలిసినవే.

1. శ్రీరంగం: ఇది తిరుచ్చినాపల్లికి ఉత్తరంగా కావేరినదీతీరంలో ఉన్న పుణ్యక్షేత్రం. భూదేవి, నీళాదేవులతో శ్రీరంగనాథస్వామి అక్కడ వేంచేసి ఉన్నాడు. ఇది మనకున్న దివ్యదేశాలలో చాలా ముఖ్యమైంది.

2. మధుర: యమునానదీతీరంలో ప్రస్తుతం ఢిల్లీ, ఆగ్రాలకు మధ్య ఉన్న పుణ్యక్షేత్రం మధుర. త్రేతాయుగంలో ఈ ప్రాంతానికి మధువనమనే పేరుండేది. దానికి అధిపతి మధువనే రాక్షసుడు. శత్రుఘ్నుడు ఆ మధువనే రాక్షసుణ్ణి సంహరించి అక్కడ మధురాపట్టణాన్ని నిర్మించాడు. పూర్వం ధ్రువుడు తపస్సు చేసిన స్థలం యిదేనని ప్రసిద్ధి. ద్వాపరయుగంలో శ్రీకృష్ణుడు జన్మించింది ఈ క్షేత్రంలోనే. ఈ మధురానగరానికి దగ్గర్లోనే గోకులం, బృందావనం వున్నాయి. ఇప్పటికీ శ్రీకృష్ణుడు పుట్టినచోటును మనం అక్కడ దర్శించుకోవచ్చు.

3. వారణాశి(కాశి): ఇది వరుణ, అసి రెండునదుల సంగమస్థానం వున్న పుణ్యక్షేత్రం. ఇక్కడ అన్నపూర్ణాదేవితో కూడా విశ్వేశ్వరుడున్నాడు. గొప్ప ఈశ్వర తేజస్సు ఇక్కడ ప్రకాశిస్తుండడం వల్ల దీనికి కాశి అని పేరు వచ్చింది. ఇక్కడ పరమపవిత్రమైన నదీమతల్లి గంగ ప్రవహిస్తున్నది. ఈ నదీతీరంలో పుణ్యప్రదమైన దశాశ్వమేధ ఘట్టం. మణికర్ణికా ఘట్టం, హరిశ్చంద్ర ఘట్టం మొదలగు ఎన్నో ఘట్టా లున్నాయి.

4. రామేశ్వరం: దక్షిణసముద్రసేతు సమీపంలో పర్వతవర్ధిని సమేతుడై రామలింగేశ్వరుడు వేంచేసిన స్థలమిది. సముద్రప్రాంతంలో కల పుణ్యక్షేత్రాలలో ఇది చాలా సుప్రసిద్ధమయింది.

రావణవధ తర్వాత శ్రీరాముడు ఈ లింగాన్ని ప్రతిష్ఠచేసినట్లు ప్రసిద్ధి వుంది. కేవలం పర్వతాగ్రాలపై ఉన్న పుణ్యక్షేత్రాలు ప్రస్తుతం కాదు కాబట్టి, ప్రస్తావించడంలేదు. మన ఆంధ్రప్రదేశాన్ని మాత్రం దృష్టిలో వుంచుకొన్నప్పుడు నదీతీరాల్లో ప్రకాశిస్తున్న ఈ క్రింది పుణ్యక్షేత్రాలు మన దేశానికే గొప్ప విశిష్టతను సంపాదిస్తున్నవని చెప్పక తప్పదు.

**ఆంధ్రలో కొన్ని పుణ్యక్షేత్రాలు:**

1. భద్రాచలం: పవిత్రమైన గోదావరీతీరంలో భద్రుండి కొరికపై సీతాలక్ష్మణులతో శ్రీరాముడు స్వయంగా వెలసిన క్షేత్రమిది. మహాభక్తుడైన రామదాసు నమ్మిన దైవం ఈ క్షేత్రంలో వున్నాడు. నేటికి యావద్భారతాన్ని ఆకర్షించే సీతాకల్యాణం ప్రతి శ్రీరామనవమికి ఇక్కడ జరుగుతుంది. గోదావరి తూర్పుగా ప్రవహిస్తూ ఈ క్షేత్రానికి ప్రదక్షిణం చేస్తున్నట్లుంది.

2. శ్రీశైలం: పాతాళగంగ అనే పేరుతో నల్లమలకొండలలో కృష్ణానది ప్రవహిస్తున్నది. దానికి సమీపంలో భ్రమరాంబాదేవితో మల్లికార్జునుడు ఇక్కడ వేంచేసియున్నాడు.

3. శ్రీకూర్మం: వంశధారా, లాంగలి నదుల మధ్య ఉన్న క్షేత్రం శ్రీకూర్మం. ఇచ్చటి స్వామి శ్రీకూర్మనాథుడు. యావద్భారతదేశంలో కూర్మావతారక్షేత్రం యిదొక్కటే.

4. సింహాచలం: విశాఖపట్టణానికి ఉత్తరంగా సముద్రతీరంలో సింహాచలంపై వెలసిన స్వామి శ్రీనృసింహస్వామి. ఇచటి స్వామి ఎప్పుడూ గంధంతో నింపబడి వుంటాడు. వైశాఖశుద్ధ తదియ చందనయాత్రోత్సవం జరుగుతుంది. ఆనాడు పైనున్న గంధమంతా తీసివేయగా ఎందరో భక్తులు స్వామి నిజరూపసందర్శనం చేసుకొంటారు.

5. అన్నవరం: పంపానదీతీరంలో అనంతలక్ష్మి, సత్యవతీసహితుడై శ్రీ వీర వేంకట సత్యనారాయణస్వామి ఇక్కడ వేంచేసి యున్నాడు. ఇక్కడ నిరతాన్నదానం జరగడంవల్ల దీనికి అన్నవరం అనే పేరు వచ్చిందంటారు.

6. వేదాద్రి: కృష్ణానదీతీరంలో జగ్గయ్యపేట సమీపంలో ఇక్కడ రాజ్యలక్ష్మి చెంచులక్ష్మి అనే ఇద్దరు దేవేరులతో శ్రీ యోగానందలక్ష్మి నృసింహస్వామి వేంచేసిన క్షేత్రమిది.

7.విజయవాడ: కృష్ణానదీతీరంలో దుర్గాఘట్టానికెదురుగా ఇంద్రకీలాద్రి పర్వతం మీద శ్రీ కనకదుర్గ ఇక్కడ వేంచేసి ఉంది. అష్టాదశశక్తి పీఠాలలో ఇది ఒకటి. శుంభ, నిశుంభుల వధ తరువాత ఈమె కనకవర్షం కురిపించడం చేత కనకదుర్గ అనే పేరు ఏర్పడిందంటారు. మహాబలేశ్వర్‌లో పుట్టిన కృష్ణానది 700 మైళ్ళు ప్రయాణం తర్వాత విజయవాడలో ఈ పర్వతం ప్రక్కగా ప్రవహిస్తున్నది.

8. అమరావతి: కృష్ణానదీతీరంలో ఇక్కడ అమరేశ్వరస్వామి నెలకొని ఉన్నారు.

9. మాచెర్ల: చంద్రవంకనదికి దక్షిణాన చారిత్రక ప్రసిద్ధిగల శ్రీ చెన్నకేశవస్వామి ఇక్కడ వేంచేసి యున్నారు.

10. తల్పగిరి: (నెల్లూరు) పినాకిని అనే నామాంతరం గల పెన్నానది ఒడ్డున ఈ క్షేత్రం ఉంది. దీనికే ఉత్తర శ్రీరంగం అని పేరు. ఇక్కడ శ్రీరంగనాయకస్వామి వేంచేసి యున్నారు.

11. మోపిదేవి: కృష్ణానదీతీరంలో చల్లపల్లికి దగ్గరగా ఉన్న ఈ క్షేత్రంలో సుబ్రహ్మణ్యస్వామి వేంచేసి యున్నారు.

12.హంసలదీవి: కృష్ణాసాగరసంగమస్థానమైన ఈ క్షేత్రంలో శ్రీ వేణు గోపాలస్వామి వేంచేసి యున్నారు.

13.శ్రీకాళహస్తి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన తిరుపతికి 20 మైళ్ళ దూరంలో స్వర్ణముఖీ నదీతీరంలో ఈ క్షేత్రం వెలసివుంది. సాలెపురుగు, సర్పం, ఏనుగు – ఈ మూడూ ఇక్కడ తరించడంవల్ల ఈ క్షేత్రం శ్రీకాళహస్తిగా పేరు పొందింది. ఇక్కడ మహాభక్తుడైన

తిన్నప్ప స్వామిలో ఐక్యమయినాడు. జ్ఞాన ప్రసూనాంబ ఇక్కడి అమ్మవారు. ఇక్కడ ఇంకా ఎన్నో తీర్థాలున్నాయి.

14.పుష్పగిరి: పెన్నా నదీతీరంలో సంతానమల్లీశ్వర, ఉమామహేశ్వర చెన్నకేశవులు వెలసిన క్షేత్రమిది. ఇచటి ప్రకృతి చాలా మనోహరమైంది.

ఇలా నదీతీరాల్లో పర్వత శిఖరాలపైన ఉన్న అనేక పుణ్యక్షేత్రాలను సందర్శించడం కోసం మనవారు తీర్థయాత్రావిధిని ఏర్పాటు చేశారు. నిత్యజీవితంలో అనేక సాంసారిక యాతనలకు గురి అవుతున్న మానవులు తీర్థయాత్రా దృష్టితో తోటివారితో కొందరితో కలసి ఆయా పవిత్రనదుల్లో స్నానం చేసి, అచట వెలసిన స్వాములను సేవించి శాంతిని, సౌఖ్యాన్ని పొందుతున్నారు. అంతేగాక సామాజిక దృష్టితో ఆలోచిస్తే, కలసి తీర్థయాత్రలు చేయడం ద్వారా సహజీవనాన్ని, అక్కడక్కడ వున్న విజ్ఞాన విశేషాలను తెలుసుకోవడం ద్వారా చక్కని లోకజ్ఞానాన్ని, విశాల దృక్పథాన్ని పెంచుకొని, స్వార్థాన్ని కొంతకు కొంత తగ్గించుకొంటూ ప్రపంచంలో అన్నిట్లోను అందరిలోను సర్వాంతర్యామియైన భగవంతుణ్ణి చూడగలిగే సంస్కారాన్ని పెంపొందించుకోవడానికి అవకాశముంది. అప్పుడే ఈ దేశం నాది, నా సంస్కృతి విశిష్టమైంది, ఈ దేశానికి ఈ సంస్కృతికి, మహత్తరమైన చరిత్ర వుంది అనే భావం కలిగి ప్రతివ్యక్తి సమిష్టి భావం పెంపొందించుకోవడానికి ప్రయత్నిస్తాడు.

★ ★ ★ ★

# పురాణములలోని నదీమాహాత్మ్యము

ఆచార్య దివాకర్ల వెంకటావధాని

వర్షమును భగవంతుని కరుణరసప్రవాహము అని వర్ణింపవచ్చును. అదే నదుల రూపమున దేశమునందు ఎల్లెడ ప్రవహించుచు పంటలకు హేతువై ప్రజల జీవనవమునకు ఆధారవము అగుచున్నది. పలు ప్రాంతములందు పడిన వర్షము ఒకచోట చేరి మొదట చిన్న కాలువగా ఏర్పడి క్రమముగా మహానదిగా రూపొందును. అందుకు పెక్కు ఉపనదులు వచ్చి దానిలో కలియుచుండుటయే కారణము. ఈ విధముగా నదులు విశాలమైన భాగములను పవిత్రము చేసి ఆ ప్రాంతములందలి పంటలకు కారణమై దేశమునకు అభ్యుదయమును చేకూర్చుచున్నవి. అవి లౌకికముగను, పారలౌకికముగను కూడ జనులకు తోడ్పడు చుండును.

భారతదేశమున పెక్కు నదులు కలవు. వానిలో గంగ, యమున, సింధునది, బ్రహ్మపుత్ర, కృష్ణ, గోదావరి, తుంగభద్ర, కావేరి మున్నగు నదులు మిక్కిలి ప్రసిద్ధములు. వీనిలో స్నానము చేయుట వలనను పితృ దేవతలకు తర్పణాదులు అర్పించుటవలనను పవిత్రతతోపాటు పుణ్యము కూడా కలుగును అని భారతీయుల అభిప్రాయము. నదులు అనేక పర్వతములమీదను, వనములయందును ప్రవహించి వచ్చుచుండును. అచ్చటి ఓషధులు వానిలో కలియుట సంభవించును. ఓషధుల ప్రభావము అపరిమితము అయినట్టిది. మనకు కొన్ని ఓషధులను గుర్తించుటయు వానిని తగిన విధమున ఉపయోగించుకొనుటయు తెలియక పోవచ్చును. అయినను వాని ప్రభావము లేకుండపోదు. నదులలో స్నానము చెయునప్పుడు ఆ ఓషధుల ప్రబావముచే మానవుల దేహములకు పవిత్రత్వమును, తేజస్సును, అనామును చేకూరును. భారతీయులు అందుచేతనే, నదులను కూడ దేవతాతుల్యములుగ భావింతురు. శ్రాద్ధ సమయములందలి పిండములను నదులలో కలిపినచో పితృదేవతలు తృప్తిపొందుదురని వారు భావింతురు. పుష్కర సమయములందు నదులలో స్నానము చేయుటవలన గొప్పపుణ్యము చేకూరును అని

తలంచుట అనాదిసిద్ధము. బృహస్పతి అయా రాసులలో ప్రవేశించునప్పుడు అయా నదులకు పుష్కరములు కలుగుచుండును. నదులు స్త్రీ లింగములనియు సముద్రుడు నదీ భర్త అనియు భావించుట కవి సమయము. ఈ విధముగ నదులు పారలౌకికసౌఖ్యమునకు కూడ తోడ్పడుచుండును.

'నదశబ్దే' అను ధాతువునుండి నదీశబ్దము ఏర్పడినది. అనగా నదించునది లేక శబ్దించునది అని అర్థము. వర్షాకాలమున నదులు ఒడ్డులు ఒరసి ప్రవహించునప్పుడును, పర్వతముల నడుమ ప్రవహించునప్పుడును, ఒక విధమైన శబ్దము ఉత్పత్తిల్లును. ఆ కారణము చేతనే నదికి ఆ పేరు కలిగియుండును. ఐహికముగను, ఆముష్మికముగను ప్రజలకుపయోగపడు నదులను వేదకాలము నుండియు భారతీయులు స్తుతించుట కలదు. పెక్కు పురాణములలో ''నదీమాహాత్మ్యవర్ణనము'' కనిపించును. పురాణములందు వర్ణింపబడిన నదులు కొన్ని ఇప్పుడు కన్పింపవు, కొన్ని మారుపేరులను దాల్చినవి. భారతాది గ్రంథముల యందు పెక్కు తీర్థ విశేషముల మహిమలు వర్ణింపబడినవి.

అనుశాసనికపర్వమున భీష్ముడు ధర్మరాజునకు పుణ్యతీర్థ విశేషములను, గంగానదీ ప్రభావమును వర్ణించి చెప్పి ఉండెను. చంద్రభాగ, వితస్త, ఊర్మిమాలి అనువానియందు ఏడురోజులు ఆహార విరహితుడై ఉండువాడు మునిసమానుడు అగును. మహావనములు చొచ్చి ప్రవహించు కాశ్మీరమండలము నందలి నదుల నీరు సేవించుటవలన స్వర్గము లభించును. పుష్కరము, ప్రభాసము, నైమిశము, ఇంద్రమార్గము, దేవిక, స్వర్గబిందువు అను తీర్థములందు మునిగినచో జనులు అచ్చరలతో కూడ విమానము లందు విహరింతురు. హిరణ్యబిందువు, కుశేశయము అనునవి ఎల్లపాపములను హరించును. గంధమాదనముతో కూడిన ఇంద్రతోయము, కురంగదేశమందలి కరతోయము, మూడు రాత్రులు ఉపవసించి స్నానము చేయువారికి అశ్వమేధఫలము కలిగించును. కనఖలమునను, గంగాద్వారమునను కుశావర్తమునను బిల్వకమునను సుస్నాతుడైన నరుడు పాపములు తొలగ స్వర్గలోక విహారము కావించును. బాగీరథీనది కాశీప్రాంతమున

ఉత్తరభాగముగా ప్రవహించుచోట, ఆహారవిరహితులై ఉండు నరులు ఒక నెలకు దేవతలను దర్శింతురు. విపాశానదీతీరమున నరుడు బ్రహ్మచర్యదీక్షతో మూడు దినములు ఉండిన జన్మరాహిత్యము పొందును. కౌశికినదీతీరమున మౌనముతో ఇరువది ఒక్క దినములు ఉపవసించు నరుడు పరమగతిని సాధించును. నర్మదలో స్నానము చేసినచో రాజత్వము సిద్ధించును. మానవుడు అరిషడ్వర్గమును దూరముచేసి తీర్థసేవ కావించినచో అధికఫలసిద్ధి పొందును. తపము, అహింస, శమదమములు అనువానితో తీర్థముల సేవించిన అమితమైన శౌచము కలుగును. లభింపని వానిని కోరక, లభించినవానియందు మమత్వము లేక నిష్కాములై ఉండు పురుషులు పరమపవిత్రులు. వారికి తీర్థములతో పనియే లేదు. కొన్ని తీర్థములు దుర్గమములు, మిగుల విషమములు అయి ఉండును. అట్టివానిని మనసులో స్మరించినంత మాత్రమున పాపములు తొలంగును.

పవిత్రజలపూర్ణ అగు భాగీరథి ఏ దేశపర్వతముల నడుమగా అరుగునో, అవి పరమ పవిత్రములు గంగా సేవనమున సిద్ధించు ఫలము నియమములతో ఒనర్చు యజ్ఞములు. బ్రహ్మచర్యము, తపము, మున్నగు వాని వలన కూడ కలుగనేరదు. దేహమున ఇంచుక సోకిన గంగానదీజలములు జనుల కల్మషకోటులను హరించి వారికి స్వర్గలోకా నందము కలిగించును. పాపములు ఎన్ని చేసినను చివరకి గంగలో స్నానము చేసినచో సూర్యుడు ఉదయించునప్పుడు విరయు చీకటివలె నరులపాపములు పటాపంచలై పోవును. సోమములేని యజ్ఞమును, చంద్రుడులేని రాత్రియు, రవిలేని ఆకాశమును, ఆత్మధర్మములేని ఆశ్రమమును, పుష్పములు లేని చెట్టును వలె గంగానదిలేని దేశము హీనత పొందును. గంగానది నీరుత్రాగినచో కలుగు నిర్మలత్వము శతచాంద్రాయణ వ్రతములు చేసినను కలుగజాలదు. అగ్నిలోపడిన దూదివలె, గంగలో స్నానము చేయువారి పాతకములు రూపుమాసిపోవును. శరణములేని జనులకు గంగ పరమశరణము. దేవతలకు అమృతము వలె నరులకు గంగాజలము అపారమహత్త్వము ఆవహించును. గంగానది యందలి ఇసుక తలపై పోసి కొన్నను అందలి మట్టి నొసట పూసికొన్నను గరుడుని చూచిన పాములవలె పాపములు పారిపోవును. గంగయందలి కెరటముల తుంపురులతో గూడిన గాలి సోకినచో ఘోరపాపములు కూడ

దూరములయిపోవును. గంగలో స్నానముచేసిన వారు వెనుక ఏడు తరములందును, ముందు ఏడుతరములందును గల పితరులను పవిత్రులను కావింతురు. గంగను చూచినంతమాత్రముననే త్రికరణ జనిత పాపసంతతులు తొలగిపోవును. వినినను, కనినను, చేతితో అంటినను గంగ పితృమాతృకులముల అందుగల పితృదేవతలకు ఎల్ల సద్గతి కలిగించును అన, స్నానము చేసినచో ఎంత పుణ్యము కలిగించునో వేరుగా చెప్పనవసరము లేదు. ''గంగ గంగ'' అని కీర్తించుచు ఇతర నదుల జలములలో మునిగినను జనుల పాపములు పోవునని పెద్దలు చెప్పుదురు. చూచుటకు శక్తి కలిగి ఉండియు, గంగను చూడకుండువాడు పశుసమానుడు, అంధసమానుడు అగును. ఇంద్రాది దేవతలు కూడ గంగను కోరుదురు అన, నరులు కోరకుందురా? మరణకాలమున గంగను తలచినచో మోక్షము చేకూరును. గంగను ప్రశంసించిన ఎడల రాజభయము, చోరభయము, పాపభయము, భూత భయము మున్నగు భయములు సర్వమును నశించును. మూడు మార్గముల చని, మూడు లోకములకును పెంపును, సొంపును కలిగించినట్టి నిర్మలమూర్తియగు గంగను ఆశ్రయించువాడు కృతకృత్యుడు అగును. జనులలో రాజును, గ్రహములలో సూర్యుడును వలె నదులలోని కెల్ల గంగ మహత్త్వమున అధికమైనట్టిది. గంగ ఆకాశమువలన, చంద్రునివలన, సూర్యునివలన, మేరురూపశోభితుడు అయిన విష్ణువువలన, త్రిపురములను జయించిన శివుని శిరమువలన హిమవత్పర్వతమునకు అవతరించినది. పరమ తాత్పర్యముతో నిశ్చలమైన మనస్సుతో మనుజుడు శరణుపొందినచో గంగానది అనన్యలభ్యమైన మహాపదమును ఒసంగును.

స్కాంద పురాణము నందలి ఖండములలో కాశీఖండము ఒకటి. అందు కాశియు, అందలి తీర్థములను వర్ణింపబడినవి. మణికర్ణికా తీర్థమున స్నాన, జప, హోమ వేదాధ్యయనములు ఒనర్చినవాడు మోక్ష ఫలమును పొందును. భూతభవిష్యద్వర్తమాన తీర్థములేవియు దానితో సరికావు. మణికర్ణిక యందు స్నానము చేసి తిల, వ్రీహి, యవములతో పితృదేవతలకు తర్పణమొనరించు నరుడు సర్వయజ్ఞఫలములను పొందును.

కూర్మపురాణమున కురుక్షేత్రయుద్ధమందు బంధువులను చంపితినని దుఃఖించు ధర్మరాజునకు మార్కండేయమహర్షి ప్రయోగ

మహిమ తెల్పి అచ్చటికి అరుగుమని ఉపదేశించెను. భూమిని కల పుణ్యక్షేత్రములన్నింటిలో ప్రయాగ శ్రమ లేకుండగనే ఫలమొసంగును ప్రయాగలో నివసించినచో మానవుడెన్ని జన్మలలో చేసిన పాపములైనను తొలగిపోవును. అందు దేవతలు, విష్ణువు, శివుడు, సూర్యుడు, గంగా యమునలను రక్షించుచుందురు. ప్రయాగను స్మరించినంత మాత్రముననే పాపములు పటాపంచలగును. అచ్చటి నదీసంగమ మునందలి మట్టి శరీరదోషములన్నియు పోగొట్టును. వేయి యోజనముల దూరమున నుడియు నరుడు గంగను స్మరించినచో, దుష్కర్మఫల విముక్తుడై ఉత్తమపదము గాంచి, ముల్లోకములందును పూజింపబడును. గంగా యమునల సంగమమునందు ప్రయత్నపూర్వకముగ ప్రాణములనువీడు నరుడు వాంఛితార్థములు పొంది, బంగారు విమానమున స్వర్గపురము చేరును. స్వదేశమందైనను, అరణ్యము నందైనను, స్వగృహము నందైనను ప్రయాగను స్మరించుచు ప్రాణములు విడుచువారు బ్రహ్మలోకము చేరుదురు. గంగా, యమునా సంగమమున మృతినొందువాడు ముక్తుడగును. అచ్చట ఎట్టి ధేనువునైన (గోవునైన) ఈశ్వరప్రీతిగా దానముకావించువాడు ఆ గోవు శరీరమునందు రోమములెన్ని ఉండునో అన్ని ఏండ్లు రుద్రలోకనివాసము కావించును.

వరాహపురాణమున రైభ్యుని తీర్థయాత్రా ప్రసంగము కలదు. అతడు గంగకు పోయి ప్రయాగను సేవించి, పిదప గయకు అరిగెను. గయలో ఫల్గుణీనది కలదు. ఆ నదీజలములందు స్నానము చేసి అతడు గదాధరుని కొలిచి పితృపర్వతము చేరెను. అచ్చట కంఠమెత్తి గోత్రనామములు చెప్పి హస్తములు పైకెత్తి, పితృగణములను పేరు పేరున పిలిచి నిత్యములు నైమిత్తకములు అయిన నియమములు తీర్చి పిండప్రదానము కావించెను. అచ్చట వటవృక్షము క్రింద కాలోచిత కృత్యములు అచరించి అతడు మట్టమధ్యాహ్నము పిండప్రదానము చేయగా పితృదేవతలు చేతులు చాచి గ్రహించిరట! అచటనున్న ఇతర తీర్థములందు కూడ స్నానము చేసి తపస్సు ఒనరింపగ సనత్కుమారుడు అతనికి ప్రత్యక్షమై అచట పిండప్రదానము చేయుటవలనను, ఫల్గుణీనది పవిత్రజలములందు స్నానమాడుట వలనను కలుగు ఫలములను తెలిపెను.

దక్షిణ భారతమున ఉన్న నదులలో గోదావరి మిక్కిలి పెద్దది. నన్నయ్య భట్టు దీనిని 'దక్షిణ గంగ' అని ప్రశంసించెను.

కృష్ణానది మహారాష్ట్ర మండలమునందలి మహాబలేశ్వరపు కొండలలో పుట్టి మహారాష్ట్ర, మైసూరు, ఆంధ్రరాష్ట్రములలో ప్రవహించి చివరికి బంగాళాఖాతమున కలియును. కృష్ణాసాగరసంగమమున స్నానము చేసినవారికి ఉత్తమగతి కలుగును. శ్రీశైలపర్వతమున కృష్ణానదిని పాతాళగంగ అని అందురు.

పవిత్రవములైన నదులందును సరస్సులందును స్నానము చేయుటచే రోగాదులను పోగొట్టుకొన్నవారును, జవ్వనవమును పొందినవారును, పవిత్రులైనవారును పలువురు కలరు. అధునిక కాలమున ఇట్టి కథలు అన్నియు అతిశయోక్తులగను, కల్పితములగను కన్పించను. కాని నదులకును, పుణ్యతీర్థములకును అటి ప్రభావము కలదనుటకు సందేహించవలసిన అవసరము లేదు. భారతీయులను ఈ విశ్వాసము పూర్తిగా కలదు. అందుచేతనే వారు పుణ్యక్షేత్రములను దర్శించి తీర్థసేవ కావించుటకు ఉవ్విళ్లూరుచుందురు. సామాన్య సమయములందే నదీజలములకు అపార ప్రభావము కలదని తెలియచుండ, పుష్కర సమయములలో వాని ప్రబావము మరింత అధికమై ఉండునని వేరే చెప్పనక్కరలేదు.

★ ★ ★ ★

## నర్మదాస్తుతి

*స్వావగాహన మాత్రేణ యా స్వర్గవనితాజనైః*
*సహనర్మగిరాం దాత్రీ భజే తాం నర్మదా నదీమ్ ॥*   తీ.ప్ర.35 పే.

తనలో స్నానం చేసినవాళ్లకు, స్వర్గాన్ని ఇచ్చి అప్సరః స్త్రీలతో నర్మ సంభాషణం చేసే భాగ్యాన్ని కలిగిస్తూ, దానికి తగిన పేరు ప్రసిద్ధికల నర్మదానదిని సేవిస్తున్నాను.

## తామ్రపర్ణి ప్రభావం

*తామ్రపర్ణ సరిత్తోయం సేవనీయం ముముక్షుభిః*
*ముక్తీకరోతి యత్రత్యా శుక్తిశ్ప పతితం జలమ్ ॥*   తీ.ప్ర.84 పే.

ఏ నదిలోని ముత్యపుచిప్ప తనలోపడిన నీటి బిందువులను ముక్తాలు (ముత్యాలు)గా తయారు చేయగలదో, పతితుడై తనలో స్నానం చేసిన వాణ్ణి ముక్తుణ్ణి చేయగల ఆ తామ్రపర్ణీనది నీటిని ముముక్షువులందఱు సేవించాలి.

# మన దేశంలో జీవనదులు

డాక్టర్ ప్రసాదరాయకులపతి

జీవనది అనగానే సామాన్యంగా అన్ని ఋతువులలోనూ నీటితో ప్రవహిస్తూ, ఎట్టి పరిస్థితిలోను పూర్తిగా ఎండిపోకుండా ఉండేది అని నిర్వచిస్తారు. భారతదేశంలో ఇటువంటి జీవనదులు చాలా ఉన్నాయి. వేదాలలో పురాణాలలో వీటి వర్ణనలు అద్భుతంగా చేయబడ్డాయి. వీటిలో గంగ, నర్మద, సరస్వతి, యమున, గోదావరి, కృష్ణ, కావేరి, భీమరథి, బ్రహ్మపుత్ర, తుంగభద్ర, సింధు, ప్రణీతా అనే పన్నెండు, సుప్రసిద్ధమైన జీవనదులు. మేషం మొదలు పన్నెండు రాసుల్లో వరుసగా గురువు సంచరించే సమయమే ఈ పన్నెండు నదులకు పుష్కరకాలం.

ఈ పన్నెండేకాక మరికొన్ని కూడా పుణ్యనదులు చరిత్ర ప్రసిద్ధమైనవి ఉన్నాయి. వాటి తీరాలలో కూడా మహత్తర క్షేత్రాలు వెలసాయి. అవికూడా పురాణాలలో మహిమాన్వితమైనవిగా వర్ణించబడ్డాయి. ఈ జీవనదులు చరిత్ర క్లుప్తంగా ఇక్కడ ఇవ్వబడుతుంది.

గంగ:- భారతదేశం అంతటిలోకి పరమపవిత్రమైనదిగా ఈ నది కీర్తించబడింది. ఇది హిమాలయ పర్వతం మీద 13,800 అడుగుల ఎత్తున గల గంగోత్రి దగ్గర పుట్టింది. పుట్టినచోట దీనికి భాగీరథి అని పేరు. కొంతదూరం పోయిన తర్వాత జాహ్నవి, అలకనంద అనే ఉపనదులు వచ్చి కలుస్తాయి. ప్రయాగ దగ్గర యమున, సరస్వతి కలుస్తాయి. బంగాళా ఖాతంలో కలిసేముందు కర్ణావళి, గండక, కోసి, సోన్ నదులు వచ్చి కలుస్తాయి. అయితే సముద్రంలో కలిసే ముందు 2 5 0 మైళ్ళ పూర్వం గంగ ఎన్నో ప్రవాహాలుగా విభక్తమై అద్భుత త్రికోణరూపాన్ని ధరిస్తుంది. అది బ్రహ్మ పుత్రానదితో కూడా కలుస్తుంది.

గంగానది ఒడ్డున అసంఖ్యాక పుణ్యక్షేత్రాలున్నాయి. గంగోత్రి, కనఖల, హరిద్వార, ప్రయాగ, కాశి, గంగాసాగరసంగమం మొదలైనవి. కలకత్తాకు దక్షిణంగా 9 0 మైళ్ళ దూరంలో గంగాసారమనే చోట కపిలాశ్రమం ఉంది. దీనికి గుహ్యక్షేత్రమని కూడా పేరు. ఇలా గంగ ఒడ్డున

అడుగడుగునా పుణ్యక్షేత్రాలు, ఆశ్రమాలు వెలసాయి. గంగా జలకణం సోకితే చాలు సర్వపాపాలు తొలగిపోతాయని పురాణోక్తి.

యమున:- ఇది హిమవత్పర్వతంలోనే పుట్టింది. మంచు చరియల మధ్య ఇది పుట్టిన చోటుకు 4 మైళ్ళ తర్వాత జమునోత్రి ఆలయం ఉంది. మామూలుగా యమున ఇక్కడ నించి ఉదయించిందని పేరు. ఇందులో యమునాదేవి విగ్రహం ఉంది. ఇక్కడ నించి కదలి చిన్న చిన్న శైల ప్రవాహాలను కలుపుకుంటూ దాదాపు 8 0 మైళ్ళు హిమాలయ ప్రాంతంలో ప్రయాణం చేసి ఖారా దాటి మరో 1 5 మైళ్ళు వెళ్ళి ఫైజాబాదు దగ్గర పెద్దనది అయింది. ఇక్కడినుంచే ఈ నదికి చాలా కాలవలు తీశారు.

ఇది ఢిల్లీ. బాగ్‌పట్, బృందావ, మధుర, మహావన, ఆగ్రా, ఫిరోజాబాద్, ఇటావా, కల్పి, హమీర్‌పూర్ మొదలైన ప్రసిద్ధ ప్రదేశాల మీదుగా ప్రయాణం చేసి అలహాబాద్ దగ్గర గంగానదితో కలిసింది.

గంగా యమునల మధ్య ప్రయాగ నుంచి హరిద్వార్ దాకా ఉన్న ప్రదేశానికి బ్రహ్మావర్తమని, శశస్థలీ అనీ, అంతర్వేది అనీ పేర్లు.

యమున కళిందశిఖరం నించి ఉదయించటం చేత దానికి కళిందకన్య లేక కాళింది అని కూడా పేరు. వ్యాసుడు యమునలోని చిన్నద్వీపంలోనే పుట్టాడు. శ్రీకృష్ణుని జననం, విహారం యమునతో సన్నిహితమైనవి. పాశ్చాత్యులు టాలమీ, ప్లినీ, అరియన్ ఈ నదిని ఎంతగానో వర్ణించారు. దీనిని కూడా భారతీయులు ఎంతో పవిత్రంగా భావిస్తారు.

సరస్వతి:- ఋగ్వేదంలో ఇది పర్వతం నించి సముద్రంలో కలిసేదాకా వేగంగా ప్రయాణం చేస్తున్నట్లు వర్ణించబడింది. ఇప్పుడిది పైకి కనబడదు. హిమాలయాలలో ప్లక్షప్రస్రవణం దీని జన్మస్థానం. ఇది అదృశ్యమై ఇసుకలో అణగిపోయిన చోటుకు వినాశనమని పేరు. ఈ రెంటి మధ్యస్థలం యజ్ఞోచితమైన పవిత్రప్రదేశమని ప్రసిద్ధి. ప్లక్షప్రస్రవణం హిమాలయాలలో శివాలిక ప్రాంతపు సిరిమూర్ కొండలలో ఉంది. ప్లక్షం ఒక చెట్టు. ఆ చెట్టు మొదట సరస్వతీనది పుట్టిందంటారు. అంబాలా జిల్లాలోని ఆద్‌బద్రీ దగ్గర

ఇది బయటకు కనబడుతుంది. మరికొన్ని చోట్ల బ్రహ్మసరస్సు నించి లేక బదరికాశ్రమం నించి బయల్వెడలినట్లు చెప్పబడింది. హిమాలయాలలో పుట్టి రాజస్థాన్ ఎడారిలో అదృశ్యమై, అబూ పర్వతం దగ్గర కనిపించి, కచ్ ఎడారిలో మాయమై మళ్ళీ సౌరాష్ట్రలోని గిర్ అడవిలో కనిపించి ప్రభాస దగ్గర పశ్చిమ సముద్రంలో కలిసిందని కొన్నిచోట్ల పురాణాలలో కనిపిస్తుంది.

సుప్రసిద్ధమైన కురుక్షేత్రం దీని ఒడ్డున ఉంది. ప్రయాగలో ఇది గంగా యమునలతో కలిసి త్రివేణీ సంగమంగా పేరు పొంది జగత్పూజ్యమైంది.

**సింధునది:–** హిమాలయాలలోని టిబెట్ దీని జన్మస్థానం. కైలాసపర్వతానికి ఉత్తరంగా మానససరోవరానికి దగ్గరగా పుట్టిన ఈ నది 17,000 అడుగుల ఎత్తునుండి ఈశాన్యంగా ప్రవహించి కాశ్మీరులో ప్రవేశించింది, స్కర్దు, అటక్‌ల మీదుగా ప్రయాణం చేసి కరాచీ దగ్గర అరేబియన్ సముద్రంలో కలిసింది. దీని మొత్తం పొడవు 1800 మైళ్ళు. మిఠాన్‌కోట దగ్గర పంజాబ్‌లోని 5 నదులు జీలం, చీనాబ్, రావి, బియాస్, సట్లెజ్ ఈ నదితో కలిసాయి. వేదకాలం నుంచి ప్రసిద్ధిమైనది.

**బ్రహ్మపుత్ర:–** ఈ నది పుట్టింది కూడా మానససరోవరం దగ్గరే. ఇది కూడా 1800 మైళ్ళు పొడవుంది. 800 మైళ్ళు టిబెట్‌లోనే ప్రవహించింది. మన దేశంలో ప్రధానంగా అస్సాంలో ప్రవహిస్తున్నదని. అస్సామీ భాషలో దీనికి లోహితనది అని పేరు. 50 మైళ్ళు వెడల్పున 500 మైళ్ళ పొడవున అస్సాంలో ఇది అలరుతున్నది. తర్వాత ఇది గంగ ఉపనదియైన పద్మానదితో కలిసి బంగ్లాదేశ్‌లోని మేఘనతో మిళితమౌతున్నది. శక్తిపీఠాలలో ప్రసిద్ధమైన కామాఖ్య ఈ నది ఒడ్డునే ఉంది.

**సరయూనది:–** ఇది కుమాయూన్ పర్వతాలలో పుట్టింది. ప్రఖ్యాతమైన అయోధ్య దీని ఒడ్డున ఉంది. రామాయణ, భారత, స్కాంద పురాణాదులలో దీని ప్రస్తావన ఉంది. ఇది కొంతదూరం తర్వాత గోగ్రానదితో కలిసింది. గోగ్ర గంగయొక్క ఉపనది.

**శిప్రానది:**– స్కాంద పురాణంలో దీని మహత్వం ఎంతగానో కీర్తించబడింది. ఇది పారియాత్ర పర్వతంలో పుట్టింది. మాళ్వాలో ఉదయించిన తర్వాత ఉజ్జయిని మొదలైన విఖ్యాతప్రదేశాలమీదుగా వెళ్ళి చంబల్‌నదితో కలిసి చివరకు యమునలో మిళితమయింది. కాళిదాస మహాకవి ఈ నదిని అద్భుతంగా వర్ణించాడు.

**సబర్మతి:**– దీనికి సభ్రమతి, స్వభ్రవతి, చందన అనే నామాంతరాలున్నాయి. మీవార్‌కొండలలో దీని పుట్టుక. అరావళిపర్వతాల దగ్గర ఇది వాయవ్యంగా తిరిగి అర్బుదపర్వతం పక్కగా వెళ్ళి కాంబే అఖాతంలో కలిసింది. దీని పొడవు 200 మైళ్ళు. పద్మాదిపురాణాలలో దీని ప్రస్తావన ఉంది. అహమ్మదాబాద్ దీని ఒడ్డున ఉంది. ఖడ్గతీర్థం దీని తీరాననే. 88000 ఋషులు దీని తీరాల్లో తపస్సు చేశారని పురాణోక్తి. కశ్యపునికి శివుడిచ్చిన వరం వల్ల పుట్టింది గనుక దీనికి కాశ్యపీగంగ అని పేరు. ఈ శతాబ్దపు మహర్షి గాంధీమహాత్ముని ఆశ్రమం దీని ఒడ్డున ప్రసిద్ధికెక్కింది.

**మహానది:**– మధ్యప్రదేశ్‌లో రాయపూర్ జిల్లాలోని సికావో గ్రామం దీని జన్మస్థలం. బ్రహ్మాండపురాణంలో ఇది పారియాత్ర పర్వతంమీద పుట్టినట్లు చెప్పబడింది. ఇది ఒరిస్సారాష్ట్రంలో ప్రవహించి బంగాళాఖాతంలో కలుస్తున్నది. దీని పొడవు 533 మైళ్ళు.

**నర్మద:**– భారతదేశంలోని పెద్దనదులలో ఇది ఒకటి. అమరకంటక పర్వతాల మీద పుట్టి 801 మైళ్ళు ప్రవహించి బ్రోచ్ దగ్గర కాంబే అఖాతంలో కలుస్తుంది. మత్స్య, పద్మ, కూర్మ స్కాంద. పురాణాలలో భారతంలో దీని ప్రస్తావన ఉంది. దీనికే రేవానది అనే మరో పేరుంది. నిజానికి రెండు వేరే. రెండూ కలిసి ఒకటై ప్రవహిస్తాయి. అమరకోశంలో దీనికి ఇంకా సోమోద్భవ, మేఖలకన్యకా అన్న పేర్లివ్వబడ్డాయి.

**గోదావరి:**– ఈ నది నాసిక్‌కు 20 మైళ్ళ దూరంలోని త్ర్యంబక గ్రామానికి చేరువగా ఉన్న బ్రహ్మగిరిలో ఉదయించింది. భారతదేశంలోని గొప్పనదులలో ఇది ఒకటి. పశ్చిమ సముద్రతీరానికి 50 మైళ్ళ దూరంలో పుట్టినా ఇది తూర్పుగా 900 మైళ్ళు ప్రవహించి బంగాళాఖాతంలో కలుస్తున్నది. గౌతమమహర్షి తపస్సువల్ల పుట్టింది గనుక దీనికి గౌతమీగంగ అని పేరు.

జ్యోతిర్లింగమైన త్ర్యంబకం, రాజమండ్రి, కోటిపల్లి, దక్షారామం, భద్రాచలం మొదలైన ప్రసిద్ధక్షేత్రాలు దీని ఒడ్డున ఉన్నాయి. సముద్రంలో కలిసేముందు ఈ నది ఏడుపాయలుగా చీలుతున్నది. ఈ పాయలకు సప్తర్షుల పేర్లు పెట్టబడ్డాయి. ఒకప్పుడు శాతవాహనుల రాజధాని ప్రతిష్ఠానపురం - పైఠాన్ దీని ఒడ్డుననే ఉంది.

ప్రణీత:- సహ్యపర్వతాల మీద దీని పుట్టుక. దీనికే ప్రాణహిత అన్న పేరుందని పండితులంటారు. ఇది వార్ధా, పైన్‌గంగ అనే ప్రవాహాల కలయికవల్ల ఏర్పడి గోదావరితో కలుస్తున్నది. గోదావరి 650 మైళ్ళు తూర్పుగా ప్రవహించి ఆగ్నేయదిక్కున ఈ నదిని కలుపుకుంటున్నది.

భీమ:- దీనికే భీమరథి అని కూడా పేరు. పడమటికనుమలలో సహ్యపర్వత శిఖరం మీద పుట్టి ఆగ్నేయదిశగా పూనా, షోలాపూర్, బీజపూర్ మొ॥ వాటి మీదుగా ప్రయాణించి రాయచూరుకు కొంచెం ఉత్తరాన కృష్ణానదితో కలుస్తుంది. భీమశంకర జ్యోతిర్లింగం దీని జన్మస్థలం దగ్గరే ఉంది. మత్స్య, బ్రహ్మ, వామన పురాణాలలో. భారతంలో దీని ప్రస్తావన ఉంది.

తుంగభద్ర:- పడమటి కనుమలలోని వరాహపర్వతం మీద గంగామూల అనే చోట తుంగ, భద్ర అనే రెండు నదులు దగ్గర దగ్గరగా పుట్టి షిమోగాకు 9 మైళ్ళ దూరంలో కుడ్లి అనే చోట కలిసి తుంగభద్ర అనే పేరుతో ప్రవహించి కృష్ణానదిలో కలుస్తుంది. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లలో ప్రవహించే ఈ నది ఒడ్డుననే చరిత్ర ప్రసిద్ధమైన విజయనగరం ఉంది. శృంగేరిపీఠం తుంగాతీరాననే. ఇది పురాణ ప్రసిద్ధమైనది.

కృష్ణ:- సహ్యపర్వతాల మీద ఈ నదీ పుట్టుక. దీనికి కృష్ణవేణి అని మరోపేరు. దీని పొడవు 800 మైళ్ళు. తూర్పు కనుమలలో ప్రవేశించిన తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో ఒక వందమైళ్ళు ప్రవహించి సముద్రంలో కలుస్తున్నది. శ్రీశైలం, అమరావతి, నాగార్జునకొండ, విజయవాడ మొదలైన ప్రసిద్ధక్షేత్రాలు దీని ఒడ్డున ఉన్నాయి.

**తపతి**:- వింధ్యపర్వతంలో దీని పుట్టుక. 4 5 0 మైళ్ళు గుజరాత్ మొదలగు ప్రదేశాలలో ప్రవహించి సూరత్ దగ్గర అరేబియా సముద్రంలో కలుస్తుంది. స్కాంద పురాణంలో తపతి మాహాత్మ్యమన్న ఒక ఖండం దీనిపై ప్రత్యేకంగా ఉంది. భారత భాగవతాది గ్రంథాలలో దీనిని గురించిన వర్ణనలున్నాయి.

**కావేరి**:- పడమటి కనుమలలో కూర్గులోని బ్రహ్మగిరికొండ దీని జన్మస్థానం. దీనికి దక్షిణగంగ అని కూడా పేరు. ఇది కర్ణాటక, తమిళనాడు రాష్ట్రలలో 475 మైళ్ళు ప్రవహించి బంగాళాఖాతంలో కలుస్తుంది. 5 0 పైగా ఉపనదులు దీనిలో కలుస్తున్నాయి. ఆగ్నేయస్కాంద పురాణాలలో దీని ప్రశస్తి చెప్పబడింది. పుట్టినచోట కావేరీవిగ్రహం ఉంది. దీనిని భక్తులు పూజిస్తారు. చిదంబరం, శ్రీరంగపట్టణం, తంజావూరు, తిరువాయూరు, కుంభకోణం, తిరుచిరపల్లి మొదలగుప్రసిద్ధక్షేత్రాలు దీని ఒడ్డున ఉన్నాయి.

**తామ్రపర్ణి**:- ఇది పడమటి కనుమలలో పుట్టి తిరునల్వేలిజిల్లాలో నించి కేప్ కామరిన్‌లో ప్రవేశిస్తుంది. ఎన్నో చిన్న ఉపనదులు దీనిలో కలుస్తున్నాయి. శివ, కూర్మ, వాయు పురాణాలలో రామాయణ భారతాలలో ఈ నది ప్రస్తావించబడింది. దక్షిణ జాహ్నవి అని కూడా దీనినంటారు. అగస్త్యపుత్రిగా దీనికి ప్రసిద్ధి.

పవిత్రాలు, పురాణప్రసిద్ధాలైన నదులెన్నో ఇంకా ఉన్నాయి. పినాకినీ, సువర్ణముఖీ, మొదలైనవి. అయితే వీటిలో కొన్ని ఎండాకాలంలో వట్టిపోయి వర్షాకాలంలో మాత్రమే కనిపిస్తుంటాయి. ఏదైతేనేమి! ఈ దేశం అగణ్యమైన పవిత్రనదులకు స్థానం.

★ ★ ★ ★

# మన నదులు - మన సంస్కృతి

వెలుకుపల్లి జమదగ్నిశర్మ

దేశం మనకు తల్లి. దేశమాత అని అంటాం. దేశంలో ప్రవహించే నదులూ మనకు తల్లులే! అవి దేశమాత మెడలో ముత్యాల దండలు, చేతులకు మురుగులు, భుజాలకు బాహుపురులు, కాళ్ళకు కడియాలు. దేశాన్ని దివ్యమంగళ విగ్రహమైన తల్లిగా చూడగలగాలే కాని నదులు ఆమెకు సర్వాలంకారాలూ కాగలవు. హిమవత్పర్వత మణికిరీటంతో దివ్యవాహినీ ముక్తాహారాలతో వింధ్య శ్రేణీకాంచీకలాపంతో దక్షిణ వేలా మృదు పద పీఠంతో మన భారతదేశ మాత భావుకుల కళ్ళలో మెదులుతూ ఈ ఇహంలో బ్రదుకంతా ఆమె అనుగ్రహం వల్లనే సాగుతోందనీ, ఆ తల్లి ఒడిలోనే ఆమె పోషణలోనే మన మందరమూ ఉంటున్నామనీ, ఆసేతుశీతాచలం ఏ మూల ఉన్నవారైనా అందరమూ ఆమె బిడ్డలమే అనీ తియ్యని వెలుగుల వంటి ఊహలు తోచి పారవశ్యాన్ని కలిగిస్తాయి.

మన నదులూ మనకు తల్లులే! ఒక్కొక్క నది తన్ను ఆశ్రయించిన జనులను ఒక్కొక్కరకంగా తీర్చి దిద్దుతూ ఉంటుంది. అందుచేతనే నదీనాగరకత లేర్పడ్డాయని చారిత్రకులూ చెప్తూ ఉంటారు. ఓల్గా నాగరికత, నైలునదీ నాగరికత, గంగా నాగరికత దేనికదే విశిష్టమైనది. మన పూర్వులు యావద్భారతీయైక్యభావాన్ని నదులమూలంగానే దృఢపరచుకున్నారు. పైగా అవాంతరసృష్టి ఎప్పుడూ నీళ్ళతోనే ప్రారంభమవుతుంది. 'అప ఏవ ససర్జాదౌ' (మొదట నీళ్ళనే సృజించెను) అను శ్రుతి వినిపిస్తోంది. భూమి అంతా జలమయమై, ఏకార్ణవమైపోగా వటపత్రశాయియైన బాల ముకుందుడు పెరిగిపెరిగి శ్రీమన్నారాయణముడు కాగా ఆయన నాభికమలము నుండి చతుర్ముఖ బ్రహ్మ పుట్టి పునస్సృష్టి చేస్తూ ఉంటాడి. 'ఆపో వా ఇదగ్ం సర్వం' అనే శ్రుతి ఆపోమహాత్మ్యాన్ని సర్వోత్కృష్టంగా వర్ణిస్తోంది. అట్టి నీళ్ళ నుండి భూమి బయటపడి జీవకోటి నిలవడానికి ఆధారమవుతోంది. ఆ జలము జీవమయమే! అసలు జీవనమంటేనే నీళ్ళు. ఆ నీళ్ళు లేకపోతే బ్రతుకే లేదు. అన్నం లేకపోయినా ఉండవచ్చుగాని నీళ్ళు లేకుండా జీవులు బ్రతకలేరు.

*గంగే చ యమునే చైవ గోదావరి సరస్వతి।*
*నర్మదే సింధు కావేరి జలే స్మిన్ సన్నిధిం కురు॥*

నిత్యదేవతార్చనలో పూజకై తీసుకున్న జలాన్ని పవిత్రం చేసేందుకు ఆస్తిక భారతీయులు ఈ శ్లోకాన్ని పఠిస్తూ ఉంటారు. "ఓ గంగా! ఓ యమునా! ఓ గోదావరీ! ఓ సరస్వతీ! ఓ నర్మదా! ఓ సింధూ! ఓ కావేరీ! మీలో ప్రతి ఒక్కరూ వచ్చి ఈ నీళ్ళల్లో సన్నిహితులై ఉండండి". ఆ మహానుభావుడెవరో గాని బలే చక్కని ప్రార్థన చేశాడు. ఎప్పుడు మొదలుపెట్టాడో యేమో ఇప్పటికీ ఆ ప్రార్థనే చేస్తున్నాము. ఇకముందూ చేస్తారు. అన్ని పేర్లూ శ్లోకంలో పెట్టక కొన్నింటినే పేర్కొన్నాడుగాని ఆ మహర్షి హృదయంలో అన్ని నదులూ ఉన్నాయి. ఎక్కడ పుట్టిన వాడైనా భారతీయుడే ఆర్యుడే పూజ్యుడే అన్న నిత్య సత్య వైశాల్యమూ ఉన్నది. ఈ శ్లోకం చదువుతూ పులకిత తనులయ్యే పుణ్యాత్ములకు యావద్భారతమూ ఒకే ఒక దేశమన్న అఖండైక్యభావం మాత్రమే కాక ఆయానదుల పోషణలో ఉన్న సర్వ జీవకోటియందూ సోదరబావమే కలుగుతుంది.

అన్ని నదులు పవిత్రాలే అయినా గంగ మరీ పవిత్రమైంది.అది విష్ణుపదసంభవ. శివశిరస్సంస్థిత, విష్ణుపద మంటే ఆకాశం. శివ శిరస్సంటే హిమగిరి శృంగమైన కైలాస శిఖరం. అన్ని కొండల శిఖరాలు శివశిరస్సులే! అన్ని నదులూ ఆకాశంలో పుట్టినవే! పర్వత శిఖరాల మీదికి దూకి లోపల్లోపల ఘోషపెట్టి, ఎలాగో సందు చేసుకుని బయటపడి, సన్నకాలువ సాగి వేరు వేరు పాయలు చేరి మహాప్రవాహాలై సముద్రాన్ని చేరుకునేవే! అందుచేత అన్నీ గంగలే! అన్నీ సాగరపత్నులే! సంప్రదాయవిదులు నీటి నెప్పుడూ గంగ అనే వ్యవహరిస్తారు. "అమ్మా! కాస్త గంగ ఇప్పించమ్మా!" అని అడుగుతారు. మంచి తీర్థమిమ్మంటారు. గంగా శబ్దమూ తీర్థ శబ్దమూ పావిత్ర్యవాచకాలు. గంగా! గంగా! అని ఎన్నో ఆమడల దూరంలో ఉండి ఆ తల్లిని స్మరిస్తేనే చాలునట ఆ చల్లని తల్లి మహాఘోరపాపపరితాపాన్ని గూడా చల్లార్చివేస్తుందట! మరి ఆమె ఉత్తమగతిలేక అల్లాడుతున్న సగరపుత్రు లరవై వేలమందినీ స్వర్గానికంపించిన కరుణామయి కదా! ఆమె చేయలేనిదేముంటుంది? భక్తుని భక్తివిశేషాన్ని బట్టి ఆమె సాన్నిధ్యాన్ని పొందే సర్వతీర్థాలు అంతటి మాహాత్మ్యమూ కలవే అవుతాయి. మనం మనసారా గంగను స్మరించి మన బావి నీళ్లే పోసుకున్నా శాస్త్రం ప్రకారం గంగా స్నానపుణ్యాన్ని పొందితీరుతాము. పొందామా లేదా అని నిశ్చయించుకోవడానికి మన చిత్తశుద్ధియే నిదర్శనం.

మానవ జీవితం భావనామయమైంది. 'యద్భావం తద్భవతి' అనడం వినలేదా? మనమెలా భావిస్తే అలాగే అవుతుంది. నదుల పేర గిరులు గీసి ధరణిని ముక్కలు ముక్కలుగా భావిస్తే ప్రతిదాన్నీ స్వార్థంతో ముక్కలుచేసి పంచుకునే రాక్షసులమే అవుతాము. అలాకాక ఈ నదులు గిరుల శిరస్సులలో పుట్టి ఉన్నచోట నిలువలేక ''వివేక భ్రష్టానాం భవతి వినిపాతశ్శతవిధః'' అని భర్తృహరి మహాకవి గంగంతటి పరమ పవిత్ర నదీమతల్లినుద్దేశించే అన్నట్లు క్రిందికి జారిపోయి సముద్రంలో కలిసిపోయేవే కాబట్టి వాటివల్ల వ్యక్తిత్వాలను పొందిన జనులు ఆ వ్యక్తిత్వాన్ని వేర్పాటుతనానికి కాక అన్ని విభిన్న వ్యక్తిత్వాల సమాహార రూపమైన జాతీయ వ్యక్తిత్వానికి దోహదం చెయ్యడానికే అని తెలుసుకుని విశాల హృదయాలతో అఖండ భావనచేస్తే దితికి వ్యతిరేక రూపమైన అదితి సంతానం ఆదిత్యులమే అవుతాము. అంటే దేవతలమే అవుతామన్న మాట! మన ఆంధ్ర భూభాగంలో గోదావరీ, కృష్ణా, తుంగభద్రా, పెన్నా, మంజీరాది నదీ విభేదాలెన్నో ఉన్నాయి. ఎక్కడికక్కడ ఎన్నెన్నో వైవిధ్యాలున్నాయి. అవన్నీ కలిసే ఆంధ్రజాతీయత సమగ్రమవుతోంది. ఆంధ్రాది విభిన్న జాతీయతలన్నీ చేరి భారత జాతీయత సమగ్రమవుతోంది. సమగ్ర జాతీయతలో ఏ విభిన్న జాతీయత లోపించినా ఆ మేరకది అసమగ్రమే. ఇట్టి భావన భారతీయుల నందరినీ పరిపూర్ణుల నొనర్చడానికి దోహదకారి అవుతుంది.

బాగా ఆలోచిస్తే పరమార్థమూ చక్కగా బోధపడుతుంది. ఏదో వ్యవహారం జరిగిపోతోంది గదా అని ఆలోచించంగాని స్థిమితంగా కూర్చుని ఆలోచిస్తే తెలియకపోయే రహస్యమీ సృష్టిలోనే లేదు. హిందూ మహా సముద్రం, బంగాళాఖాతం, పసిఫిక్ మహాసముద్రం, అట్లాంటిక్ మహాసముద్ర మంటూ వేరు వేరు పేర్లు చెప్తున్నాం గాని సముద్రాలు పరస్పర సంబంధంలేనివి అనేకం లేనేలేవనీ ఉన్నదొక్కటే మహా సముద్రమనీ అందరికీ తెలుసు. అదే పరమాత్మస్వరూపం.

నన్నయ్యగారు ఒకచోట సముద్రాన్ని వర్ణిస్తూ ''శశ్వదుదవాన మహావ్రత శీత పీడితాచల ముని శొఖ్యహేతు విలసద్బడభాగ్ని శిఖాచయంబులన్ వెలిగెడు దాని'' అని వర్ణించారు. ఎల్లప్పుడూ నీళ్ళల్లో ఉండాలన్న మహావ్రతం పట్టి చలిచే పీడింపబడుతున్నా అచలులైయున్న

మునులకు సౌఖ్యాన్ని కలిగిస్తున్న బడబాగ్ని శిఖలతో వెలుగుతున్న సముద్రమట. అట్టి మహాన్రతాన్ని ఆ మునులు పట్టారంటే దానివల్ల వారు పొందదలచిన పరమసుఖమెటువంటిదో! దాని నుండి వేరై ఉన్నవారు దాని రుచి సహించలేరు.

పరమాత్మ సముద్రం వంటి వాడయితే జీవులు నదులవంటివారు. నదులు భూమి మీద ప్రవహిస్తున్నంతసేపే నామరూపాలు కలిగి ఉంటాయి. ఇది కృష్ణ, ఇది గోదావరి అని మనమెంతో అభిమానంతో పిలుచుకుని గౌరవిస్తున్న కృష్ణా గోదావర్యాది నదులన్నీ సముద్రంలో పడి కలిసిపోయాక నామరూపాలు కోల్పోయి అతా సముద్రమే అయి పోతున్నాయి. అంతకుముందు స్వాదుజలాలతో రుచిగా ఉండి అందరిచేతా విడివిడిగా పిలువబడుతున్న ఆ నదులు ప్రత్యేకమైన పేర్లు లేకుండా సముద్రమైపోయి మాధుర్యాన్ని కోల్పోయి తాగటాని కుపయోగపడకుండా పోతున్నాయి. ఎక్కడెక్కడ పుట్టిన నదులూ ఎన్నెన్ని వంకలు తిరిగినా, ఎక్కడెక్కడ మజిలీలు చేసినా, ఏ యే ప్రతిబంధకా లెదుర్కొన్నా అసలు ఆ నదులు ఎలా పుట్టాయని విచారిస్తే ఆ సముద్రంలో నుంచే వచ్చాయని విస్పష్టమవుతుంది. అంతే కదా! సూర్యుని తీక్షణ కిరణాలవల్ల సముద్రజలం ఆవిరి అయి అది చల్లబడి మేఘాలు ఏర్పడి అవి వర్షిస్తే కొండశిఖరాలమీది నుండి కాలువలు సాగి వాగులయి మహానదులయి సముద్రాన్ని చేరుకుంటున్నాయి. సరిగ్గా జీవుల సంగతీ అంతే! పరమాత్మ స్వస్వరూపానందంలో ఉండిపోతే జీవోత్పత్తియే ఉండేదికాదు. స్వశక్తియైన మహామాయా ప్రభావంతో తనకు తానే బహురూపధారణ చేసి అనేక విభిన్నజీవులుగా వ్యవహరిస్తున్నాడు. జీవభావం స్వస్వరూపస్థితికంటె అన్యమేదో ఆనందమన్నది అజ్ఞానం వల్లనే కలుగుతోంది. శరీరం ధరించి భార్యాపుత్రులను పొంది బ్రతకడ మానందమనుకునే వాడే జీవుడు. జీవితాలననుభవించి వీటిలో ఆనందం లేదని అనుభవం వల్ల తెలిసికొని వైరాగ్యం పెంపొందించుకుని స్వస్వరూపావస్థానమే పరమసుఖమని యాథార్థ్యాన్ని గ్రహించి అజ్ఞాన నిర్మూలనానికి శాస్త్రచోదితమార్గాలలో నిర్విరామ సాధన చేసి చేసి అనుభవపూర్వకంగా స్వాత్మజ్ఞానాన్ని పొందినవాడు పరమాత్మైక్యాన్ని పొంది ముక్తుడన బడుతున్నాడు. నదులు నామరూపాలు కోల్పోతున్నట్లే ముక్తజీవులూ నామరూప విరహితులవుతారు. వారికి మళ్లీ జన్మలుండవు.

ఈ పరమార్థాన్ని ఎవ్వరూ కాదనడానికి వీల్లేదు. అందుచేత ఇహ జీవితాన్ని గురించి ఎందుకు కృషిచేయాలని అనుకుంటేమాత్రం అంతకంటే మూర్ఖత మరొకటి ఉండదు.మన సంస్కృతి బాగా తెలిసినవారు ఎంత వైరాగ్యవంతులో అంత కర్తవ్యనిష్ఠులై ఉంటారు. వారికి బ్రతుకులన్నీ వట్టి నాటకాలని తెలిసినా నాటకాలు కాబట్టే మరింత జాగరూకులమై ఉండాలని ధరించిన వేషంతో ఎన్నడూ తాదాత్మ్యం చెందక పాత్రగత సుఖదుఃఖాదులు నటున కేవలమాత్రమూ పట్టనట్లే బ్రదుకుతూ ప్రతిజీవితాన్నీ ఆనందమయకేళిగా వినోదిస్తూ తమ బ్రదుకువల్ల అందరికీ ఆనందాన్ని కలిగిస్తూనే మళ్లీ వేషం వెయ్యవలసినత గతి నతిక్రమించి ఉపసంహరింపబడి పరమాత్మతో ఏకమైపోతారు.

నదులు మనకి పరమార్థాన్ని బోధిస్తున్నాయి. మమ్మల్ని చూచి మా జీవితాల మిథ్యాత్వాన్ని గ్రహించండంటున్నాయి. నిరంతరం ప్రవహించడం తప్ప నదికి వ్యక్తిత్వమేమున్నది? ఇది నదిఅని మనచేత చూపబడే జలబిందువు మనం చూపే సమయానికి బారెడుముందుకు సాగిపోయి వెనకెక్కడో ఉన్న బిందువు మన వేలున్నచోటికి వచ్చి ఉంటుంది. అది మాత్రమక్కడ ఉంటుందా? తరుముకుని వస్తున్న జలబిందువుల త్రోపిడికి నిలువలేక కదిలిపోతూ ఉంటుది. ఆ నదివంటిదే ఈ విశ్వమంతా! ఇది నిత్యనిరంతర గమనశీలమైంది కాబట్టే జగత్తు, సంసరణశీలమైంది కాబట్టే సంసారం! అనిత్యం! అందులో సందేహం లేదు. అయినా అనిత్యమైన ఈ జగత్తూ శరీరమూ కూడా నిత్యమైన పరమార్థాన్ని అందించడానికే ఉద్దేశింపబడ్డాయి. ఉత్తమమైన మనుష్యశరీరం లభిస్తేనేగాని ఏ జీవుడూ సాధనచేయలేదు. 'సాధనమున పనులు సమకూరు ధరలోన, అన్నట్లు ఐహిక ప్రయోజనాలే సాధన లేనిదే సమకూడవు. పరమార్థానికి మరింత సాధన కావాలి. మంచి శరీరం లభించినా జగత్తు లేకపోతే సాధనకు రంగస్థలమే లేదు. జగత్తు ఉండి మంచి శరీరం లేకపోయినా ప్రయోజనం లేదు. ''జంతూనాం నరజన్మ దుర్లభ''మని శ్రీ శంకరులన్నట్లు మన మందరమూ పూర్వ పుణ్యవిశేషం వల్ల దుర్లభమైన నరజన్మను పొందిన ధన్యులము. నారాయణుల మవడానికి యోగ్యులము. మన జీవితాలను మన సంస్కృతి కనుగుణంగా మలచుకుని పరమార్థ సాధకులమై ఈ జన్మకు కాకపోయినా మరికొన్ని జన్మలకయినా తరింపగలుగుతామని ఆశిద్దాము.

★ ★ ★ ★

# నదులు ధార్మికభావన

**శ్రీ డి.ఆర్. ఆచార్య**

**పరిచయం:**

మన దేశంలో ఎన్నో మహానదులు ఇంకెన్నో ఉపనదులు ప్రవహిస్తున్నాయి. మన దేశంలోలాగానే ఇతర దేశాల్లో కూడ ఎన్నో నదులు ప్రవహిస్తున్నాయి. కానీ మన నదులకు ఇతర దేశాల్లో నదులకు తాత్త్వికంగానే ఎంతో తేడా వుంది. అక్కడ సమాజం ఆ నదులను కేవలం జలకేంద్రాలుగా, తమ జీవనానికి ఉపయోగించే జలాశ్రయాలుగా చూడడమే జరుగుతుంది. కానీ మనకో! వేదకాలం నుంచి జలాలు మనకు దేవతలు. హిమవత్పర్వత శిఖరాగ్రం నుంచి పొంగి పొర్లి మహోత్సాహంతో ఉరకలు వేస్తూ ప్రవహించే బాగీరథి దగ్గర నుంచి కుగ్రామం ప్రక్కగా సన్నగా పారుతున్న చిన్న నది వఱకు మనమొక పవిత్రభావాన్ని తరతరాలుగా పెంపొందించుకున్నాం. వాటిని నదీమతల్లులని ఎంతో గౌరవంగా మన తల్లులతో సమానంగా పూజిస్తున్నాం. నిజమే! మనలో మాట. ఈ దేశంలో మధురాతి మధురజల ప్రవాహాలతో సంవత్సరం మొత్తం ప్రవహించే జీవనదులు లేకపోతే మన జాతి ఏమౌతుందో ఊహించండి. ఎలా ఊహించగలం? జలం లేకపోతే ప్రాణికోటికి ఈ గడ్డమీద జీవనమే లేదు. అందుకే 'జీవనం' అనే పదానికి 'జలం' అని కూడా అర్థం ఏర్పడింది. కాబట్టే నదుల్లేకపోతే మన సామాన్యజీవనం కూడా గడవదని స్పష్టంగా తెలిసింది.

అందఱికీ కనబడే ఈ బాహ్యప్రయోజనాలకంటే నదులవల్ల అనాదినుంచి మన జాతి పొందుతున్న స్ఫూర్తి అపారమైంది నదులు మనకందిస్తున్న ధార్మిక, ఆధ్యాత్మిక సందేశం అద్వితీయమైంది. మనం ఈ నాటికీ సమాజంలో ఇలాంటి ధార్మిక జీవనాన్ని సాగిస్తున్నామంటే అందులో నదులపాత్ర మహోత్కృష్టమైంది. నదులు మనకు తెలియకుండా సమాజాన్ని ఎంతో ప్రభావితం చేస్తున్నాయి.

**నదీ స్వరూపం:** మానవుని శరీరంలో కొన్ని ప్రదేశాలు ఎలా పవిత్రమైనవిగా చెప్పబడతాయో అలాగే ఈ భూమాత శరీరంలో కొన్ని ప్రదేశాలు పుణ్యతమమైనవిగా పేర్కొనబడ్డాయి. దానికి కారణం భూమియొక్క, దాని మీద ప్రవహిస్తున్న నదులయొక్క, తద్గతమైన తేజస్సు యొక్క,

అద్భుతమైన ప్రభావం తపస్సంపన్నులైన మహామునులు ఆ ప్రదేశాలలో నివసించి ఆ నదులను పరిగ్రహించడం ఈ విషయం పద్మపురాణంలో ఇలా చెప్పబడింది:

*యథా శరీరస్యోద్దేశాః కేచిన్మేధ్యతమాః స్మృతాః।*
*తథా పృథివ్యా ఉద్దేశాః కేచిత్పుణ్యతమాః స్మృతాః॥*

*ప్రభావాదద్భుతాద్భుమేః సలిలస్య చ తేజసా।*
*పరిగ్రహాన్మునీనాం చ తీర్థానాం పుణ్యతా స్మృతా॥*

ఇలాగే స్కంద పురాణ, నారదీయ పురాణ, మహాభారతాలలో కూడ నదీస్వరూపం ప్రస్తావించబడింది.

ఋగ్వేదంలోను, తైత్తిరీయ సంహితలోను, అధర్వణవేదంలోను, సాంఖ్యాయన బ్రాహ్మణంలోను ఎన్నోచోట్ల సామాన్యంగా జలప్రశంస విశేషంగా ఆయా నదీప్రశంస కూడ చేయబడింది. ఋగ్వేదంలో పదవ మండలంలో ఇంద్రుడు దేవతలకోసం, మానవులకోసం తొంభైతొమ్మిది నదులను సంపాదించినట్లు పేర్కొనబడింది. అదే పదవ మండలంలో సరస్వతి, సరయు, సింధు అనే ముఖ్యమైన మూడు నదుల ప్రస్తావం ఉంది. గంగ,యమున, సరస్వతి మొదలైన ఎన్నో నదుల ప్రస్తావం అక్కడే మనకు కనబడుతుంది.

భౌగోళికంగా చూస్తే ఒక్కొక్క పర్వత పంక్తిలో నుంచి ఒక్కొక్క నది ఉద్భవించినట్లుగా మనం తెలుసుకొంటున్నాం. మన దేశంలో నదులు, తీర్థాలు లెక్కకు మిక్కిలిగా వున్నాయి. ఇదివరకే చెప్పినట్లు నదులన్నీ మనకు తల్లుల్లాంటివి. తల్లి ఎలా పిల్లలను పెంచి పెద్దచేసి వారికి జీవనోపాధిని కల్పిస్తుందో నది కూడా తన తీరంలో వున్నప్రజలకు తాగటానికి తియ్యటి నీళ్ళను యివ్వటమే కాకుండా అనేక పంటల నుంచి తినటానికి ఆహారాన్ని యిస్తోంది. అందుకనే పరమపవిత్రమైన ఈ మహానదుల సంస్మరణం కూడా పుణ్యాన్ని యివ్వగలదనే విశ్వాసం మన భారతజాతిలో దృఢపడింది. ప్రతినిత్యం స్నానం చేసేటప్పుడు ఈ నదులను స్మరిస్తూ తమ స్నానానికి ఉపయోగించే నీళ్ళలో ఈ నదీమతల్లులను సాన్నిధ్యం చేయండి అని ప్రతి భారతీయుడు ఇలా ప్రార్థిస్తున్నాడు:

*గంగే చ యమునే కృష్ణే గోదావరి సరస్వతి।*
*నర్మదే సింధు కావేరి జలేస్మిన్ సన్నిధిం కురు॥*

ఇలా సాధారణ కృత్యాలైన స్నానం, పానం దగ్గరినుంచి పర్వదినాల్లో ఆచరించే అనేక వైదికకర్మల వరకు మన జీవితంలో నదులు ఒక ధార్మికచైతన్యాన్ని కలిగిస్తున్నాయి. మానవుడు చేయదలచిన ప్రతి ఉత్తమకార్యానికి నదులతో సాక్షాత్తుగానో, పరంపరగానో సంబంధం ఉంది. బ్రతికివున్నంతవరకే కాదు చనిపోయిన తరువాత కూడా ఇతడి ఉత్తమగతులకు చేసే కర్మలన్నీ నదీతీరాల్లోనే జరుగుతాయి. చివరకి అస్థినిమజ్జనం కూడా గంగ మొదలైన పవిత్ర నదుల్లో జరగడం మనమందరం గమనించదగిన విషయం. మొత్తంమీద వీటన్నింటిని పరిశీలిస్తే మానవుడు పుట్టిందగ్గర నుంచి చనిపోయే వరకు తరువాత కూడా ఇతడికి ధార్మికభావన పెంపొందడానికి పవిత్రత చేకూర్చడానికి నదీస్వరూపం. ఎంతగానో ఉపయోగపడుతుంది. చూడండి! ఇలాంటి సత్సంప్రదాయాన్ని భారతీయులమైన మనకు అందించిన ఆర్షసంస్కృతి ఎంత ఉదాత్తమైందో.

**నదీసందేశం:** నదులు కేవలం స్నాన, పాన, ఆహారాది ప్రయోజనాలను సిద్ధంపచేయడానికి, ధార్మిక చైతన్యాన్ని మనజాతికి కలిగించడమేనా లేక యింకేదైనా సందేశాన్ని మనకందిస్తున్నాయా? అని ప్రశాంతంగా ఆలోచిస్తే ఒక మహత్తరమైన సందేశం ఈ నదుల మనుగడద్వారా మనకు లభిస్తోందని తోస్తుంది. ఏమిటా సందేశం?

మహోత్తుంగ శిఖరాల నుంచి పుట్టి భూమిపైన ఎన్నో పవిత్రారణ్యాలలో ప్రవహించి అక్కడక్కడా సంక్రమించిన గుణాలను దోషాలను తమలో కలుపుకొని ఎంతో దూరం ప్రయాణం చేసి చివరకు తమ భర్త అయిన సముద్రుడిలో చేరిపోతున్నాయి ఈ నదీవధూటులు. పుట్టినచోట చాలా చిన్నవిగా వున్నా కాలక్రమేణా బాగా పెరిగితిరిగి సముద్రంలో చేరుతున్నాయి. అందుకనే అంటారు ''నదీనాం సాగరో గతిః'' అని. జీవులు కూడా భగవదంశగానే పుట్టి, పెరిగి, ఎన్నో గుణదోషాలను సంక్రమింపచేసుకొని ఎన్నో జన్మల సుదీర్ఘ ప్రయాణం చేసి చిట్టచివరకు ఆ పరమాత్మనే చేరుతున్నారు. నదులకిలా ఒక ప్రదేశాన్ని బట్టి నామరూపభేదముందో జీవులకూ అంతే. నదులెలా పుట్టిన దగ్గర నుంచి తమ స్వామి అయిన సముద్రుణ్ణి చేరాలని తహతహలాడుతూ త్వరత్వరగా పరిగెత్తుతుంటాయో, జీవులుకూడా ఆనందస్వరూపుడైన భగవంతుణ్ణి చేరాలని తహతహలాడుతుంటారు. 'కాబట్టి ఎన్నో పేర్లతో ఎన్నోచోట్ల చిత్రవిచిత్రాలుగా మేము ప్రవహిస్తున్న జలమనే పేరుతో చివరకు ఒకటిగా

ఎలా సముద్రాన్ని చేరుతున్నామో అలాగే విభిన్నమైన వేషభాషలు, సంస్కృతులు, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు కలిగివున్న మీరు ఒకేజాతి అనే భావాన్ని బహువిధాలుగా పెంచుకొని పురుషోత్తముని చేరండి' అంటున్నాయి.

'మేమెలా శాశ్వతంగా ఒక చోట వుండక బాగా పెరిగినట్లే కనబడి ఉన్నట్లుండి ఎన్నో మిట్టపల్లాల్లో పడి తగ్గిపోతున్నప్పటికీ ఈ జీవనం అనిత్యమని భావిస్తూ, సమాజసేవను వదలకుండా సముద్రంలో లీనమవుతామో, మీరు కూడా అలాగే మధ్యలో వచ్చిన ఒడుదుడుకులను లెక్కచేయకుండా జీవితం అనిత్యమని మరచిపోకుండా పరమాత్మ సాన్నిధ్యాన్ని చేరడానికి ప్రయత్నించండి అని చెప్పక చెప్తున్నాయి.

*ధార్మిక ప్రవృత్తి:*

మానవజాతిలో ధార్మికప్రవృత్తి కలగడానికి ఈ నదులెంతో సహకరిస్తున్నాయి. అనేక పర్వదినాల్లో నదీస్నానాలు చేయడం, కొన్ని కోర్కెలు సిద్ధించడానికి నదులకు మొక్కడం, కొన్ని రకాలైన శారీరక, మానసిక రుగ్మతలను పోగొట్టుకోవడానికి పవిత్రమైన నదీజలాలలో అవగాహనం చేయడం నదీతీరాల్లో వున్న పుణ్యక్షేత్రాలను. అక్కడవుండే విశేషాలను సందర్శించి ప్రభావితులై భక్తిభావాన్ని పెంపొందించుకోవడం యివన్నీ ఇలాంటి ఇంకెన్నో నదులవల్లనే మనకు కలుగుతున్నాయి. కన్యాకుమారిలో వున్న భారతీయుడు గంగాస్నానం కోసం ఇతర పవిత్ర నదీస్నానాలకోసం ఎక్కడో ఉత్తరభారతదేశానికి వెళ్ళడం, అలాగే కాశ్మీరంలోవున్న భారతీయుడు దక్షిణభారతంలో వున్న గోదావరి, కృష్ణ, కావేరి మొదలగు మహానదుల్లో స్నానంచేసి, రామేశ్వరంలో సేతుస్నానం చేయడం ఇలాంటి తీర్థయాత్రల మధ్యలో ఎన్నో పుణ్యక్షేత్రాలను, దివ్యస్థలాలను, పీఠాలను, మఠాలను, మహాపురుషులను సందర్శించి సాంస్కృతికంగా, ఆధ్యాత్మికంగా వైజ్ఞానికంగా మాత్రమే గాక ధార్మికంగా కూడా నూతన చైతన్యాన్ని సంపాదించుకొంటున్నారు. చూడండి! నదులవల్ల మనకు తెలియకుండానే మన జీవితాలు ఎంత ప్రభావ సంపన్నాలవుతున్నాయో. ఇలాంటి భావనను పెంచుకొని, జీవితాన్ని సార్థకం చేసుకొంటూ పరమార్థాన్ని సంపాదించుకొంటున్న భారతజాతిలో పుట్టడం నిజంగా మన అందరి అదృష్ట విశేషం.

★★★★

# తీర్థయాత్రలు వాటి స్వరూపం

*డాక్టర్ శలాక రఘునాథశర్మ*

పండ్లలో శ్రేష్ఠమైన యాపిల్ ఏదో ఒక ప్రదేశంలోనే పండుతుంది. ఎంతో విలువైన కుంకుమపువ్వు అపూరూపంగా ఎక్కడో ఒక్కచోట మాత్రమే లభిస్తుంది. అది ఆ మట్టికున్న ప్రత్యేకత. ఒక నదిలోని నీటికి రోగాలను పోగొట్టే లక్షణం ఉంటుంది. ఒక నదీజలానికి అమృతప్రాయమైన రుచి ఉంటుంది. ఒక నది నీరు ప్రవహించిన పొలంలో రాజనాలు పెద్దయెత్తున దిగుబడి అవుతాయి. అది ఆయా జలాలకున్న ప్రత్యేకత. ఒక కొండ గృహారామాదుల నిర్మాణానికి కావలసిన బలిష్ఠమైన రాళ్ళను సమకూరుస్తుంది. ఒక్కో పర్వతం వందలకొలది నీటిబుగ్గలతో సస్యలక్ష్మిని తాండవింపచేస్తూ వుంటుంది. ఒక్కొక్క పర్వతం మీద వింత వింత రుచులుగల ఫలాలు వేలకొలది సంఖ్యలో పండుతాయి. అది ఆయా పర్వతాల ప్రత్యేకత. ఈ విధంగా సాక్షాత్తుగా కానవచ్చే ప్రత్యేకతలను గమనించి మానవుడు ఫలితాలను అనుభవిస్తూనే ఉన్నాడు. పైకి కానరాకుండ ప్రత్యేకతలు గలిగిన స్థలాలు జలాలూ కూడ లేకపోలేదు. ఒక ప్రాంతంలో పుట్టిన కుందేళ్ళు వేటకుక్కలపై విజృంభించి తరిమికొట్టటం చూచి ఒక మహానుభావుడు అచట మహాసామ్రాజ్య కేంద్రస్థానాన్ని నిర్మించాడని మనం వింటున్నాం. ఈ విధంగా భౌతిక కారణాలను చెప్పజాలని ఒక ప్రత్యేకత - ముఖ్యంగా పవిత్రత - ఉన్న ప్రదేశాన్ని క్షేత్రమనీ, నదులను, సముద్రప్రాంతాలను తీర్థములనీ వ్యవహరిస్తూ ఉంటాము. ఈ క్షేత్రాలు తీర్థాలు కొన్ని ప్రత్యేక సమయాలలో మానవులు సేవించే పుణ్యస్థలాలుగా ప్రసిద్ధి పొందుతాయి.

అయితే తీర్థాలకు క్షేత్రాలకు నిజంగా మహిమ వున్నదా? లేక ఇది కేవలం అంధవిశ్వాసమేనా? అని చాలమందికి ఈ రోజులలో ఆశంక కలగటం సహజం. పరిశీలిద్దాం 'ఏ వైద్యవిధానంలోనూ ఎన్ని రోజులు కడచినా నయంకాని కొన్ని రోగాలను తీర్థక్షేత్ర సేవల ద్వారా మానవులు రూపుమాపుకోవటం చూస్తున్నాం. సంతానం లేదని పరితపించే దంపతులు

ఏ తీర్థంలోనో, క్షేత్రంలోనో అర్చనలు చేసి సంతానవంతులు కావటం వింటున్నాం. ఉన్మాదం, మనోవ్యాధి మొదలైనవి తీర్థసేవలవలన అంతరించటం అనుభవసిద్ధమైన విషయం. అయితే అందరికీ అలా జరుగుతున్నదా? అంటే ఆధునిక విజ్ఞానశాస్త్రం సమర్పించే అద్భుత ప్రక్రియలు మాత్రం అందరికీ ఒకే విధంగా ఫలితాల నిస్తున్నాయా? ఇంజెక్షన్ తీసుకున్న వాళ్లందరికీ రోగాలు నయమవుతున్నాయా? కాబట్టి కొంతమందికి ఫలితం లభించనంత మాత్రాన అసలు ఆ ప్రత్యేకత లేదనటం తర్కసమ్మతం కాదు.

భక్తశిఖామణి ప్రహ్లాదుడు తిరుగులేని సత్యాన్ని నొక్కి వక్కాణించాడు. ''ఇందు గలడందు లేడని సందేహము వలదు చక్రి సర్వోపగతుండు'' అని. అయితే సాధారణ మానవునకు ఈ పరమోత్తమస్థితి అనుభవానికి రావటం అంత సులభం కాదు, రాకపోవటం అపేక్షణీయం కాదు. ఈ విషయాన్ని జాగ్రత్తగా గమనించిన మహానుభావులు వీలయినంత ఎక్కువ పరిధిలో భగవంతుణ్ణి దర్శించటానికి అనేక మార్గాలు కల్పించారు. అందులో భాగాలే అడుగడుగనా కానవచ్చే దేవాలయాలు, ఏదో ఒక నెపంతో అర్చనలందుకొనే వృక్షాలు, పక్షులు, పశువులు, పాములు, క్షేత్రాలు, తీర్థాలు మొదలైనవి. పెద్దలు ఒక మాట అంటారు - దైవం, గురువు, వైద్యుడూ, తీర్థం మొదలైనవాని విషయంలో మన భావన ఏ ప్రమాణంలో ఉంటుందో సిద్ధి ఆ ప్రమాణంలో ఉంటుందని. కాబట్టి భారతీయులు చాలమంది తీర్థాదులలో దైవత్వాన్ని దర్శించి సేవిస్తూ ఉంటారు. వారి వారి ప్రమాణబుద్ధి ననుసరించి ఫలితాలను పొందుతూ ఉంటారు.

ఈ రోజులలో సాధనసంపత్తి చాలా వృద్ధి పొందింది. కాబట్టి తీర్థాదులు జనసామాన్యానికి బాగా అందుబాటులోనికి వచ్చాయి. ఒకప్పుడు ఎంతో శ్రమపడి ఎన్నో క్రోసుల దూరం కాలినడక సాగించి, నిద్రాహారాలకు కూడ నోచుకోక, మార్గంలో సంభవించే దొంగలభయం, క్రూరమృగాలభయం మొదలైన వానిని ఎదుర్కొంటూ తీర్థయాత్రలు చేసేవారు. అయినా పట్టుదలా, ఉత్సాహం సడలనిచ్చేవారు కాదు.

ఈ రోజులలో కూడా అంతప్రమాణంలో కాకపోయినా, శ్రమలేదనటానికి లేదు. అప్పుడు దేహశ్రమ అధికమైతే ఇప్పుడు ధనార్జనశ్రమ ఎక్కువగా ఉంటున్నది. మొత్తానికి అనాడైనా ఈనాడైనా ఏదోశ్రమ లేకుండా తీర్థయాత్రలు చేయటం సాధ్యం కావటంలేదు. ఇంత శ్రమను మానవుడు ఇష్టపూర్వకంగా స్వీకరించి తీర్థయాత్రలు చేస్తున్నాడంటే అతడు సాధారణమైన లౌకిక భోగభాగ్యాదులవలన పొందలేని తృప్తి అక్కడ పొందుతున్నాడని స్పష్టమవుతున్నది. ఈ అలౌకిక తృప్తి అతని హృదయంలో క్రమంగా సత్ప్రవృత్తినీ, వైరాగ్యాన్నీ కలిగించి మెల్లమెల్లగా పరమపదమార్గం చూపుతుందనటం సత్యదూరం కాదు.

తీర్థయాత్రలు సాధారణంగా రెండు విధాలుగా చేస్తారు. ఎవరికివారు కావలసిన వస్తుసామగ్రిని సమకూర్చుకొని తన భార్యాపుత్రులతో బయలు దేరటం ఒక పద్ధతి. ఒకడు సంకల్పించి పదిమందితో చెప్పి వారిలో ఉత్సాహాన్ని రేకెత్తించి ఒక సముదాయంగా బయలుదేరటం రెండోపద్ధతి. ఈ రెండో పద్ధతి మొదటి దానికంటె చాలా మేలైనదనటంలో సందేహం లేదు. ఎందుకంటే ఇటువంటి ప్రయాణాలలో ఒకరి సాయం ఒకరికి ఎంతో అవసరం. 'కలిసి ఉంటే కలదు సుఖం' అని కదా పెద్దలమాట. ఇక్కడ అనుకోవలసిన మరో ముఖ్యాంశం కూడా ఉంది. దురదృష్టవశాత్తు ఈ రోజులలో మనిషికీ మనిషికీ, అనేక అల్పాల్ప కారణాలవలన, దూరం పెరుగుతున్నది. కులాల పేరిటనో, ఆర్థిక అసమానతల వలననో, అధికారం ప్రాపకం మొదలైన వాని వలననో మానవహృదయాలలో వైషమ్యాలు పెరిగిపోతున్నాయి. తీర్థయాత్రల వంటివి వీనిని కొంతవరకు అరికట్టి, మానవుల హృదయాలలో ప్రేమాదరాలను కలిగించటానికి దోహదం చేయగలవనటంలో సందేహంలేదు. ఉదాహరణకు ఒక గ్రామంలో ఉండే వ్యక్తులు కొంతమంది కూడబలుకుకొని యాత్ర చేస్తున్నారంటే వారంతా తప్పనిసరిగా ఐకమత్యంతో ఉండాలి. సంరక్షణకుగానీ, యాత్ర సుఖంగా సాగటానికి గానీ, అసమర్థులకు సమర్థులతోడ్పాటు లభించటానికి గానీ ఈ ఐకమత్యం ఎంతో అవసరం. సాముదాయకంగా వచ్చే కష్టాలు, శ్రమలు మనస్సును అంతగా వేధించవు. అందరూ కలిసి మెలసి భోజనాదికాలు

చేస్తూ వుండటం వల్ల హృదయాలలో పొరపొచ్చాలు అంతరించిపోవటానికి అవకాశం ఏర్పడుతుంది. యాత్రలనుండి తిరిగి వచ్చిన తర్వాత కూడా నెమరుకు వస్తున్న ఆ సుఖానుభవాలు, వింత వింత సంఘటనలు ఎదలలో మంచితనాన్ని పదిలపరచి తుచ్ఛకారణాలవలన ఏర్పడిన అసూయా ద్వేషాలను అంతరింపజేస్తాయి.

అంతేకాదు ఒకచోటి ప్రజలు మరో ప్రదేశానికి యాత్రలకు వెళ్లినప్పుడు ఎన్నో భిన్న భిన్న ప్రాంతాల వారు కలుస్తూ ఉంటారు. ఆ కలయికలో జాతీయ సమైక్యతా భావాన్ని అనుసంధించుకోవటానికి కూడా అవకాశమేర్పడుతుంది. ఆయా ప్రాంతాల ఆచార వ్యవహారాలు తెలుసుకోగలుగుతాం. ఆ విధంగా లోకజ్ఞానం అలవడుతుంది. ఇటువంటి ప్రయోజనాలెన్నో తీర్థయాత్రల వలన మాన సమాజం పొందవచ్చును.

సాధారణంగా వైద్యులు ఆరోగ్యం చక్కబడటానికి స్థలం మార్పును కూడా సూచిస్తూ ఉంటారు. తీర్థాలు, క్షేత్రాలు, ముఖ్యంగా నదీ పరిసరాలు, సుప్రసిద్ధ దేవాలయాలు గల పర్వతప్రాంతాలు నిర్మలమైన వాతావరణంతో అలరారుతూ ఉంటాయి. అవి యాత్రికుల ఆధి వ్యాధులను పారద్రోలటానికి మంచి అవకాశాన్నిస్తాయి. ప్రసన్నంగా ప్రవహించే చల్లని జలాలు, పట్టుపరుపుల మెత్తదనాన్ని తలపించే యిసుక తిన్నెలు, మైమరపించే చల్లని పిల్లగాలులూ, ఎటువైపుచూచినా హృదయాలను ఆకర్షించే రమణీయ ప్రకృతిదృశ్యాలు ఇటు దేహానికీ అటు మనస్సుకూ కూడా ఉల్లాసాన్ని కలిగిస్తుంటే, అంతకంటే ఆరోగ్యలక్ష్మికి వేరే నివాసస్థానం ఏమి ఉంటుంది? ఆ విధంగా కూడా తీర్థయాత్రలు మానవులకు అవశ్యకాలవుతున్నాయి. అటువంటి పరమానందం వెల్లివిరిసే తావులలో పవిత్రత ఉంటుందనటం సత్యదూరం కాదు. పవిత్రత పరమాత్మ లక్షణమని మనమంతా అంగీకరించే విషయమే. పవిత్రతనూ, ఆనందాన్నీ అభిలషించటం మానవనైజం. ఆ దృష్టితో తీర్థస్థలాలు భగవన్నివాసాలనీ, తత్సేవ భగవత్సేవ అనీ, దాని వలన అలౌకికానందం కలుగుతుందనీ భావించటం ఎంతైనా సముచితం.

మరొక విశేషం. తీర్థస్థలాల నాశ్రయించుకొని దరిద్ర నారాయణు లనేకులు ఉంటారు. అట్టి స్థలలాలలో చేసే దానాది కర్మలు అనంత పుణ్యాన్నిస్తాయని మనవారి విశ్వాసం. తదనుగుణంగా యాత్రికులు తమకు ఉన్నంతలో దానధర్మాలు చేస్తూ ఉంటారు. దానివలన పుణ్యం లభించటం మాట అటుంటి ఆకలితో అలమటించే, అంగ వైకల్యంతో క్రుంగిపోయే దీనజనావళికి ఇంత భుక్తి లభిస్తుంది. "సర్వే జనాః సుఖినో భవన్తు" అనే భారతీయుల పరమలక్ష్యానికి ఈ విధంగా తీర్థయాత్రలు కొంత దోహదం చేస్తున్నాయి.

తీర్థయాత్రలు మన సంప్రదాయంలో అనాదిగా వస్తున్న విషయాలు. శ్రీరామచంద్రుడు అరణ్యవాసం చేసినపుడు అనేక తీర్థాలు, క్షేత్రాలు దర్శించినట్లుగా రామాయణం వక్కాణిస్తున్నది. భారతంలో ధర్మరాజు, బలరాముడు, అర్జునుడు తీర్థసేవ చేసినట్లు విస్తృతంగా వర్ణింపబడి ఉంది. తీర్థవిశేషాలనూ, తీర్థయాత్రామహిమనూ భారతగ్రంథంలో పరమోదాత్తంగా వర్ణించారు.

పుణ్యం పురుషార్థం అన్నట్లు తీర్థయాత్రలు మానవులకు హృదయ సంస్కారాన్నీ, తోడి మానవుల పట్ల సోదరభావాన్నీ, ధర్మానురక్తినీ కలిగిస్తాయనటంలో మరో అభిప్రాయానికి తావులేదు.

పంద్రెండు సంవత్సరాల కొకమారు ఒక్కొక్క నదికి పుష్కర పుణ్యకాలం వస్తుంది. ఆ సమయంలో ముక్కోటి దేవతలు ఆ నదికి సన్నిహితంగా ఉంటారని మనవారి విశ్వాసం. కృష్ణానది తెలుగు దేశపు నడిగడ్డమీద ప్రవహిస్తూ భుక్తికీ, రక్తికీ, ముక్తికీ దోహదం చేస్తున్నది. ఆ తీర్థంలో ఆ పవిత్ర సమయంలో పవిత్ర హృదయంతో స్నానమాడి, సూక్ష్మంలో మోక్షమన్నట్లు తరిద్దాం.

★ ★ ★ ★

# ఇతిహాసపురాణాలు పేర్కొన్న నదులు

శ్రీమురళి – దుర్గ

ప్రపంచదేశాలలో నదులు అక్కడి ప్రజలకు కేవలం భౌతిక జీవనాధారాలుగ పరిగణింపబడుతున్నాయి. కాని భారతదేశంలో అవి సాంస్కృతిక, ధార్మిక జీవనానికి ఆధారులుగా పరిగణింపబడుతున్నాయి. భారతీయులు మన నదీనదాలు మూలోత్పత్తులను, వాని వెనుక గల అధిదైవిక శక్తులను గుర్తించి పరంపరాగతంగా పరమ పవిత్రాలుగానూ, తీర్థక్షేత్రాలుగాను, ముక్తి సాధనాలుగాను ఆరాధిస్తూ వచ్చారు.

''*గంగే చ యమునే చైవ గోదావరి సరస్వతి*

*నర్మదే సింధు కావేరి జలేస్మిన్ సన్నిధింకురు*'' అంటూ స్నాన సమయంలో సప్తనదులను నిత్యం స్మరిస్తారు. మన ధర్మంలో దైవచింతన, ఆధ్యాత్మికత, దేశచింతన, సమాజ చింతన, అఖండ జాతీయతా దృష్టి అన్నీ పెనవేసుకుని వున్నాయి. పూర్ణయాత్ర అంటే ఆధ్యాత్మిక దృష్టి. యావద్దేశసందర్శనమే కదా! నిత్యం అన్ని నదులను స్మరించుకోవాలంటే అర్థం దేశం మొత్తాన్ని అందులోని అణువణువును అందులోని దైవీశక్తి సంపదను స్మరించుకోవాలనే కదా!

ఇక గంగ, నర్మద, సరస్వతి, యమున, గోదావరి, కృష్ణవేణి,కావేరి, తామ్రపర్ణి పుష్కరవాహిని, తుంగభద్ర,సింధు, ప్రణీత నదులుమాత్రం పుష్కరనదులుగా చెప్పబడ్డాయి. ఇంకా ఎన్నో పుణ్యనదులు వేదాలలోనే కాక రామాయణ మహాభారతాది పురాణేతిహాసాలలో ప్రస్తావించబడ్డాయి. ఆయా నదుల మహాత్మ్యాలు ప్రశస్తి ఎన్నో విధాలుగ వివరింపబడింది. అందలి కొన్ని అంశాలు ప్రస్తుతం స్మరించుకుందాం.

*గంగ:–* విష్ణు పాదాలనుండి జనించింది. హిమవంతుని పెద్దకుమార్తెయై దేవతల ప్రార్థనతో దివికి వెళ్ళింది. భగీరథుడు తపస్సు చేసి దివినుండి భువికి తీసుకొని వచ్చాడు. భువి నుండి పాతాళలోకంలో నున్న సగరుల భస్మరాసులపై ప్రవహింపచేస్తాడు. పితరులు ముక్తిని పొందుతారు. అందుకే సాధారణంగా అస్థులను గంగలో కలిపే ఆచారం వచ్చియుండవచ్చు.

భగీరథుడు ఆ నదీ జలంతోటే తర్పణాలు విడిచాడు. అని విశ్వామిత్రుడు గంగను గూర్చి రామలక్ష్మణులతో చెపుతాడు.

సీతారామలక్ష్మణులు గంగానదిని దాటి వనంలో ప్రవేశించే సందర్భంలో సీత సురక్షితంగ వనవాసం ముగింప చేయమని గంగకు మ్రొక్కింది. చిత్రకూట పర్వతం వద్ద రాముడు సీతతో మందాకిని గురించి వివరిస్తాడు. ఇందులో జంతువులన్నీ పరస్పర వైరాలు లేక గుంపు గుంపులుగా స్నానం చేస్తాయి. ఇంకా రామాయణంలో పలుచోట్ల ఈ నదీ ప్రస్తావన ఉన్నది.

భారతంలో అనుశాసనపర్వంలో భీష్ముడు ధర్మరాజుకి గంగామహాత్మ్యాన్ని వివరిస్తాడు. గరుత్మంతుని చూచి సర్పాలు పరిగెత్తినట్లు గంగలో స్నానం చేస్తే పాపాలు పారిపోతాయి. ఔషధాల్లో తులసికెంత ప్రాధాన్యతుందో నదులలో గంగకంత ప్రాధాన్యత ఉన్నది. గంగానదిని స్మరించిన, స్పృశించిన. దర్శించిన ఏడుతరాలు పితృవర్గీయులు తరిస్తారు. సమస్త వ్యాధులు నశిస్తాయి. ధర్మనిలయాలైన తపోవనాలు ఈ నదీతీరాల కొకొల్లలు.

యమున:- రాముడు వనవాస సమయంలో భరద్వాజాశ్రమంలో విశ్రాంతి తీసుకున్నాడు. తరువాత చిత్రకూట పర్వతం వద్దకు వెళుతూ మధ్యలో గంగాయమునల సంగమాన్ని చూచాడు. యమునాతీరం నుండి తెప్ప సాయముతో యమునానదిని దాటాడు. అక్కడ సీతాదేవి యమునానదికి తమ వనవాసాన్ని శుభప్రదంగ ముగింపచేయమని ప్రార్థించింది. పట్టాభిషేకానంతరం మద్యదానం,గోదానం నీ పేర చేయిస్తానని మొక్కింది.

యమునానది ఒడ్డునే మాంధాత జన్మస్థలం ఉన్నది. గంగా యమునల సంగమంలో వేదాలు అధ్యయనం చేయబడ్డాయి. యజ్ఞాలు అనుష్ఠింపబడ్డాయి. 60 కోట్ల పుణ్యతీర్థాలు ఈ సంగమంలో కలిసుంటాయి. ఇందులో స్నానం చేసి రాజసూయ అశ్వమేధ యజ్ఞఫలాన్ని పొందుతారు. సత్యవాదులౌతారు. చతుర్వేద పఠన ఫలాన్ని పొదుతారని భారతంలో ప్రశంసించబడింది.

**సరస్వతి:** ఇది బ్రహ్మసరస్సు నుండి పుట్టింది. దేవతలచే గంగానదివలె ఋషులచే యీనది సేవింపబడింది. బలరాముడు భారతయుద్ధంలో కౌరవపాండవుల పక్షం వహించక సరస్వతీ తీర్థయాత్రకు వెళ్ళాడు. ఆ సందర్భంలో భారతంలోన సారస్వతో పాఖ్యానమనే పేరుతో అనేక విధాల వర్ణించబడింది. ఈ నదీతీర ప్రదేశాలన్నీ వేదఘోషలతో ప్రతిధ్వనిస్తాయి. ఇద సప్తసారస్వతమని ఏడు విధాలుగ చెప్పబడింది. దీనిలో వందల కొలది తీర్థాలున్నాయి. ప్రతి తీర్థానికి ఏదో ఒక ప్రత్యేకత వుంది. చంద్రుడు యీ నీటమునిగి రాజయక్ష్మవ్యాధిని పోగొట్టుకున్నాడు. విశ్వామిత్రుడు ఇక్కడ తపస్సు చేసి బ్రహ్మర్షి అయినాడు. ఇంద్రుడు బ్రహ్మహత్యా దోషాన్ని పోగొట్టుకున్నాడు. వరుణుడు జలాధిపత్యాన్ని, కుబేరుడు ధనాధిపత్యాన్ని ఈ నదీ సేవనం వలన పొందారు. శుక్రాచార్యుడు ఈ నదీతీరానగల ఔశనస తీర్థంలో తపస్సుచేసి శుక్రనీతిని రచించాడు. ఈ తీరంలోగల నూతిలో నిరాధారుడైన త్రితుడు సంకల్పబలంతో యజ్ఞాన్ని నిర్వహించి దేవతలను సంతృప్తిపరచి సోమపానం గావించాడు.

ఈ నదీ తీరంలో ఉన్న రావిచెట్టుపై కుమారస్వామి నివసించి యున్నాడు. బలరాముడు అనేక దానాలుచేస్తూ ఆ తీర్థాలను సేవించాడు. దానం అంటె పరార్థచింతన. త్యాగం, పరమార్థచింతనే కదా! భక్తిగాని, సద్గుణాలుగాని యీ నదిలో పొలనేరవు.

గంగ యమున సరస్వతుల సంగమాన్నే త్రివేణీ సంగమమంటారు. ఈ తీర్థ సేవనం వలన నూరు యాగాల ఫలితాన్ని పొందుతారు. దేవతలు, యోగులు, సిద్ధసాధ్యులు, నాగేంద్రులు సంతోషంతో ఈ తీర్థంలో నివసిస్తారని భారతంలో చెప్పబడింది.

**కావేరి:-** అగస్త్యుని తపస్సువలన విష్ణుమాయ యొక్క ఒక అంశ విదర్భరాజుకు లోపాముద్రగా జనించింది. రెండవ అంశ కావేరీ రాజునకు కుమార్తెగా జన్మించింది. ఈమెయే కావేరీనదియై తండ్రిని పవిత్రుని చేసింది. ఇందులో స్నానంచేసిన అశ్వమేధ యాగఫలాన్ని పొందుతారని భారతంలో చెప్పబడింది.

**గోదావరి:–** దీనిని దక్షిణగంగ అంటారు. సీతారామలక్ష్మణులు ఈ నదీతీరంలో కల పంచవటిలో నివసించారు. లక్ష్మణుడు శూర్పణఖ ముక్కు చెవులను యిక్కడనే కోసాడు. అదియే నాసికాతీర్థంగా ప్రసిద్ధి కెక్కింది. దశరథ మరణవార్త విన్న రాముడు ఈ నదిలోనే సుస్నాతుడైనాడు. ఆత్మీయుల మరణవార్త విన్న పిదప చక్కగా స్నానం చేయడం హిందువుల ఆచారమే కదా! గోహత్యా నివారణకు శివుని గౌతముడు ప్రార్థించాడు. శివుని జటనొక దానిని తెచ్చి పిండగా ఆ జలంచేత గోవు జీవిస్తుంది. గోవును ఇచ్చింది కనుక గోదావరి అయింది. గౌతమునిచే తేబడింది కనుక గౌతమి అయింది. శివుని జటనుడి గంగలో భాగం ప్రవహించింది కనుక దక్షిణగంగ అయింది. రామాయణ కథాంశంలో భాగమయింది గోదావరి.

నిస్సంతువులు స్నానం చేస్తే సంతానవంతులవుతారు. ఈ నదీ స్నానం వల్ల కుష్ఠు, రక్తపోటు, అజీర్ణవ్యాధులు హరిస్తాయి. అరణ్యవాస సమయంలో ధర్మరాజు గోదావరిని సేవించాడు.

**నర్మద:–** ఇది మహాభారతంలో ప్రస్తావించబడింది. రేవ, నర్మద రెండూ ఒకటేనని అమరంలో ఉంది. నర్మద ఋక్ష్యపర్వతం నుండి, రేవ వింధ్య పర్వతము నుండి జన్మించుటవల్ల వేరువేరు నదులని అంటారు. ఇది రుద్రుని శిరం నుండి ఉద్భవించింది కావున అయోనిజ, రుద్రకన్య అని పిలువబడుతున్నది. ఈ నదీతీరంలోనే ఉపపాండవులు సంహరింపబడ్డారు. ఆత్మనిగ్రహం కలవారు ఈ నదిలో స్నానం చేస్తే 100 తరాల పూర్వీకులు పవిత్రులవుతారని భారతంలో ఉంది.

**సరయు:–** మానససరోవరాన జనించి గంగతో కలిసింది. రాముడు విశ్వామిత్రునివలన తమసా నదీతీరంలోనే బల - అతిబల విద్యలను పొందుతాడు. మొదటి రోజులో ఈ నదీజలంలో ఉపవసించి వనవాసం ఆరంభిస్తాడు. వేదస్రుతి, గోమతి, స్యందిక నదులను కూడ దాటుతాడు, భరతుడు తాతగారి రాజ్యం నుండి అయోధ్యకు వచ్చేమార్గంలో సుదామ, హ్లాదినీ, శతద్రు మొదలగు అనేక నదులు వచ్చాయి. అగస్త్యుని అనుమతితో సుగ్రీవుడు తామ్రపర్ణీ నదిని దాటాడు. భీష్మపర్వంలో వందకు పైగా నదుల ప్రస్తావన ఉన్నది.

ఈ విధంగా రామాయణ భారతాలలో అనేక నదులు స్మరింపబడ్డాయి. కృష్ణవేణి భారతంలో మాత్రమే స్ఫురించబడ్డది.

ఈ పవిత్ర నదీ నదాల ప్రశస్తి మన ఆధ్యాత్మిక సంపదకు మూలభూతం. తీర్థయాత్రల వలన సమాజంలో ప్రతివారు తమకు చేతనయినంత లోకజ్ఞానాన్ని పొందడానికి అవకాశముంది. ఈ పవిత్ర భావాల స్మరణ ద్వారా ప్రతివాడి భావాలు సంస్కరించబడతాయి. ఆదర్శంగా ప్రవర్తించడానికి కొంత జంకు ఏర్పడుతుంది. రాజు తాను స్వయంగా తీర్థసేవ ఆచరించి ప్రజలకు మార్గదర్శి అయినాడు తనచే పాలింపబడే రాజ్యానికి సరైన న్యాయం చేకూర్చగలుగుతాడు. రాముడు మానవుడు. రాజు. సంపూర్ణ మానవత్వమనేది ఆ జీవితంలో కనిపిస్తుంది. ఆయా సందర్భాలలో రాముడు తన విధులను సామాన్యునివలె నిర్వర్తించాడు నదులవద్ద. అట్లే అర్జునుడు బలరాముడు మున్నగువారు యాత్రల ద్వారా సమాజాన్ని దర్శించి జాతీయం అవగాహన పెంపొందించుకున్నారు. భారతంలో ధర్మపక్షపరులైన ప్రతివారు ఆధ్యాత్మిక జీవితాన్ని పూర్తిగా కొనసాగించకపోయినా కొంతకాలమైన తప్పనిసరిగా దాన్ని ఆచరించి భావసంస్కారాన్ని పొందారు.

ఈ కృష్ణాపుష్కర సమయంలో మన పవిత్ర నదులను వాని ననుసరించి ఉన్న పవిత్ర దేశ ధర్మ భావనలను స్మరించుకుంటూ భావస్నాతులవుదాం. కలియుగంలో స్మరణే కదా ముక్తి!

★ ★ ★ ★

# పుష్కర స్నానాదివిధులు

శ్రీ వంగల రామకృష్ణశాస్త్రి

పరమపవిత్రమైన మన భరతఖండమున అసంఖ్యాకములయిన గంగాది పుణ్య నదులు, నదములును నిరంతరము ప్రవహించుచున్నవి. సృష్ట్యాది నుండియు ప్రకృతి సిద్ధములై ప్రవాహరూపమున, జగత్పావన కరములగు ననంత చరిత్రములతో విలసిల్లుచు, నకృత్రిమములగు నీ మహానదుల నిత్యనూతనములగు దివ్యమహిమలను, వర్ణించి తెల్పుట యసాధ్యమేయైనను, నట్టి యుత్కృష్ట చరిత్రగల నదీమతల్లుల యనన్యమహిమను యథాశక్తి తెలిసికొనుట బాపహరము.

సాధారణముగ బశ్చిమోత్తరముల నుండి ప్రవహించి, ప్రాగ్దక్షిణ సముద్రములలో లీనమగుచుండునవి మహానదులనియు, ప్రాగ్దక్షిణుల నుండి ప్రవహించి, పశ్చిమ సముద్రమున లీనమగునవి, మహానదములనియును వ్యాసప్రోక్తములగు పురాణాదుల నిర్వచింపబడి యున్నవి. ఈ పవిత్ర నదీనదములయందు త్రిలోక ప్రఖ్యాత మహిమ సంపన్నములయి, సర్వభూతహితంకరములయిన మహానదులలో..

| | | | |
|---|---|---|---|
| 1. గంగ | 4. యమున | 7. కావేరి | 10. తుంగభద్ర |
| 2. నర్మద | 5. గోదావరి | 8. భీమరథి | 11.సింధునది |
| 3. సరస్వతి | 6. కృష్ణవేణి | 9. పుష్కరవాహిని | 12. ప్రణీత |

యనునీ పదిరెండును (12)పుష్కర మహానదులుగ బేర్కొనబడు చున్నవి.

పుష్కర శబ్దమునకు నానార్థములున్నను ప్రస్తుతార్థమున పన్నెండు సంవత్సరము. కాలమని గ్రహింపనగును. మరియు పవిత్రమైనదనియు గూడా చెప్పవచ్చును.

**దేవాన్ భావయతానేన తే దేవా భావయంతువ:**
**పరస్పరం భావయంతశ్శ్రేయ: పరమవాప్స్యథ**

అని గీతావచనము గదా? దేవలోకమునకు మనుష్యలోకమునకు పాలకపాల్య భావము సహజముగ గలదు. వేదములలో దేవతలు ముప్పదికోట్లుగా జెప్పబడుచున్నారు. వారికెల్లరకు, బృహస్పతి గురుదేవుడై యగ్రాసీతము నలంకరించియుండుట, సర్వలోక విదితము.

అట్టి బృహస్పతి యాకాశ తలమున సకలదేవతా పరివారయుతమై శింశుమారచక్ర రూపమునమున్న జగచ్చక్ర విశిష్టమయిన, నవగ్రహ మండలములోని, ఇరువదియేడు నక్షత్ర పాదముల ద్వారా మేషాది ద్వాదశ రాసులయందు సంచరించుచుండును.

ఈ సందర్భము భరతఖండమున ప్రవహించు మహానదుల యుత్పత్తి చరిత్రము సంగ్రహముగ దెలిసికొనవలసియున్నది. పిండాండమగు మన శరీరముననున్న ప్రదేశముల (అవయవములు) న్నిటిలోను శిరస్సు ఎత్తైన ప్రదేశమగుటయు, దాని నుండి, క్రింది శరీర నాడులకన్నిటికిని, తేజస్సు ఎట్లు ప్రసరించుచున్నదో? అట్లే బ్రహ్మాండమునందు అన్ని లోకములకు పై భాగమున పదియారవదిగా (16) ప్రకాశించునది గోలోకము. ఇదియన్ని లోకములకు మూలస్థానము. ఇచ్చట; ''షోడశ షోడశేశ్వరః'' అన్నట్లు సర్వ లోకాధ్యక్షులగు రాధాకృష్ణులు గోగోపగోపీజన కోట్లతో విహరించు చుందురు. ఈ లోకమునకు ప్రళయము లేదు. ఇది శాశ్వతమైనది.

కృతయుగాదిని యొకప్పుడు లోకానుగ్రహ తత్పరులైన రాధా కృష్ణులు ప్రణయ కోపావేశముతో గంగాది పుణ్యనదుల పేర్లతోనున్న గోపికలను శపించి భూలోకమున బుట్టునట్లు శాసించిరట! అప్పుడు గోగోపికాదులు దైన్యముతో ప్రార్థింప పరమానుగ్రహపూర్ణులగు రాధా కృష్ణులు, శాపరహస్యమును వారికి దెల్పి. మనుష్యలోకములో భరతఖండమున మీమీ నామములతో పుష్కర మహానదులై ప్రవహించి, బహువిధ ప్రయోజనములతో మనుష్యాది సకలజీవుల నుద్ధరింపుడని, యాదరించిరట! తదాజ్ఞగా గోలోకస్థిత గోగోపికా వర్గములన్నియు, నిచ్చటి మహాపుష్కర జీవనదులుగ ప్రవహించుచున్నవి. అందు మొదట ''విష్ణు పాదోద్భవీ గంగా'' యన్నట్లు, గోలోక కృష్ణుడు (విష్ణువు) తన పాదముల నుండి, గంగను ద్రవింపజేసెను. (ఇదియే ఆకాశగంగ) తదనంతరము సహ్యపర్వతమున దేవతలకొఱకై యశ్వత్థవృక్ష రూపము ధరించిన గోలోక కృష్ణుడు తన శరీర వామ భాగమునుండి (రాధా రూపము) కృష్ణానదిని బుట్టించి, ప్రవహింపజేసెనట! కావుననే

''కృష్ణే కృష్ణాంగ సంభూతే జంతూనాం పాపహారిణీ''

యనను వాడుక సార్థకమగుచుండెను. తరువాత బహువిధ కథా సంవిధానములతో భగీరథాదుల తపః పుణ్యఫలితముగ, సర్వేశ్వరుని యాజ్ఞతో గోలోకమునుండి భూలోకమున కవతరించి మహానదుల సేవించుటకొరకై ముప్పైకోట్ల దేవతలు మనుష్యమానము ననుసరించి, సంవత్సరమున కొకపర్యాయము, భూలోక భరతఖండ తీర్థసేవ కేతెంతురట! ఆ వచ్చునపుడు గురుసహితులై వత్తురు.

గురువు మేషాది ద్వాదశరాసులయందు సంచరించునపుడు, సంవత్సరమునకొక రాశిచొప్పున ప్రయాణించుచుండును. ఈ రాశి చక్రము ఇంతకు పూర్వము ప్రస్తావనలోనున్న శింశుమారచక్రములో నొక భాగమందుండును. కావున సకల దేవతాపరివృతుడైన బృహస్పతి యేరాశిలో ప్రవేశించునో! తత్సంబంధియగు నదీపుష్కరము వచ్చుచుండును. ఈ ప్రకారము 12 నదులు పుష్కరనదులుగా సిద్ధాంతీకరింపబడుచున్నవి. భూలోక భరతఖండమున మహానదీతీర్థ స్నానాభిలాషులగు ముప్పైకోట్ల దేవతలు, బృహస్పతి మేషాది రాసుల యందు ప్రవేశించిన పర్వదినముల పితృవర్గములతో సహా ఆయా నదుల కేతెంతురు. కావున, గురుదేవతా పితృవర్గ సాన్నిహిత్యమున నానదీ జలములు పుష్కరమనుపేరుతో (పుష్కరమనగా పవిత్రీకృత జలమని యర్థము) సకల జీవులను, దర్శన, స్పర్శన, స్నాన, పాన మాత్రమున, పంచమహాపాతక, ఉపపాతకముల బోగొట్టుటయే గాక, శారీరక, మానసిక, కఫవాతపైత్యశ్లేష్మాది ప్రారబ్ధజన్యవ్యాధులను సయితము, నిర్మూలన మొనరించి, పితృముక్తి హేతువులగుచుండును.

ఈ సిద్ధాంత ప్రకారం పన్నెండు సంవత్సరముల కొక పర్యాయము క్రమముగ నీ పై నదులకు పుష్కరోత్సవములు వచ్చుచుండును. మరియు నదులకన్నిటికి, సర్వాధ్యక్షుడు వరుణదేవుడు. ఈ వరుణుని కుమారుడు, ''పుష్కరుడు'' ఈ పర్వము సంక్రమించినపుడు, వరుణుని యాజ్ఞచే నాయా తీర్థపాలకుడుగా వచ్చి, నదులలో నివసించి యుండుటను బట్టియు, పుష్కరములని వాడబడుటకు మరియొక కథ ననుసంధానము గావించుకొనవచ్చును. పుష్కరపర్వము ప్రతినదికిని సంవత్సర కాలముండును. బృహస్పతి రాశి ప్రవేశకాలము నుండి, మొదటి 12 దినములు ప్రధాన పుష్కర పర్వములుగ పరిగణింపబడుటయు,

సంవత్సర మధ్యమును మధ్య పుష్కరమనియు, అంత్యమున, అంత్య పుష్కరములనియు నార్యవ్యవహారము గలదు. ఈ మూడు సమయముల యందును యాత్రికులు, స్నాన, దాన హిరణ్య శ్రాద్ధ, తీర్థశ్రాద్ధ పితృ తర్పణ విధులతోను, గంగ పూజలతోను భక్తిసల్పుట భారతీయ సత్సంప్రదాయము.

*కృష్ణవేణీతి యో బ్రూయాత్ సప్తజన్మార్జితాన్యపి*
*మహాపాపాని నశ్యంతి విష్ణులోకం స గచ్ఛతి॥*

కృష్ణవేణీ! యని, యామె పవిత్రనామము నుచ్చరించినవాని కేడుజన్మముల క్రిందటి పాపములు పోవుటయేగాక, స్వర్గలోకప్రాప్తియు గల్గునట!

మొట్టమొదట నదిలో దిగబోవునపుడు ఈ క్రింది మంత్రముతో రేగిపండంత మృత్తికను నదిలో మూడుమార్లు వేయవలెను.

*పిప్పలాదాత్సముత్పన్నే! కృష్ణే! లోకభయంకరి!*
*మృత్తికాం తే మయా దత్తాం ఆహారార్థం ప్రకల్పయ॥*

పుష్కరస్నానము చేయునపుడు పఠించదగినవి. స్నానమునకు అజ్ఞ తీసికొనుట!

*పావని! త్వం జగత్పూజ్యే! సర్వతీర్థమయే! శుభే.*
*త్వయి స్నాతుమనుజ్ఞాం మే దేహి కృష్ణే! మహానది॥*

మనస్సులో ధ్యానించుకొనుట.

*కన్యాగతే దేవగురౌ పితౄణాం తారణాయ చ।*
*సర్వపాపవిముక్త్యర్థం తీర్థస్నానం కరోమ్యహమ్॥*

నదికి నమస్కారము చేయుచు చెప్పవలసినది.

*తీర్థరాజ నమస్తుభ్యం సర్వలోకైక పావన।*
*త్వయి స్నానం కరోమ్యద్య భవబంధ విముక్తయే॥*

ఈ క్రింది మంత్రములతో ఒక్కొక్క దేవతకు ప్రత్యేకముగా అర్ఘ్యమీయవలెను.

కృష్ణానదికి: కృష్ణనది! మహాదేవి! సర్వపాపహరే శుభే!
స్నానపాద్యార్ఘ్యసిద్ధ్యర్థ మిదమర్ఘ్యం దదామ్యహమ్॥
శ్రీకృష్ణవేణ్యై మహానద్యై నమః ఇదమర్ఘ్యం సమర్పయామి

తీర్థరాజునకు: తీర్థరాజ! మహాభాగ! సర్వతీర్థసమావృత!
ఇదమర్ఘ్యం మయా దత్తం గృహాణ వరదో భవ॥
తీర్థరాజాయ నమః ఇదమర్ఘ్యం సమర్పయామి॥

బృహస్పతికి: బృహస్పతే! సురాధ్యక్ష! సర్వదేవనమస్కృత!
ఇదమర్ఘ్యం ప్రదాస్యామి సంగృహాణ మహామతే॥
బృహస్పతయే నమః ఇదమర్ఘ్యం సమర్పయామి॥

విష్ణువునకు: శ్రీరమానాథ! శ్రీ విష్ణో గంగోద్భవ పదాంబుజ!
సంగృహాణ! జగన్నాథ! ఇదమర్ఘ్యం దదామ్యహమ్॥
శ్రీమహావిష్ణవే నమః ఇదమర్ఘ్యం సమర్పయామి॥

శివునకు: ఉమానాథ! మహాదేవ! గంగాధర! మహేశ్వర!
ఇదమర్ఘ్యం మయా దత్తం సంగృహాణ త్రియంబక॥
శివాయ నమః ఇదమర్ఘ్యం సమర్పయామి॥

బ్రహ్మాదిదేవతలకు: బ్రహ్మేంద్రాగ్ని ముఖాస్సర్వే సురాః పుణ్యఫలప్రదాః
ఇదమర్ఘ్యం ప్రదాస్యామి గృహీతా విధినాధునా॥
బ్రహ్మాదిసర్వదేవేభ్యో నమః ఇదమర్ఘ్యం సమర్పయామి॥

వశిష్ఠాదిమునులకు: వశిష్ఠ గౌతమోఽత్రిశ్చ భారద్వాజో మృకండుజః!
విశ్వామిత్రో దేవలశ్చ తుభ్యమర్ఘ్యం దదామ్యహమ్॥
వశిష్ఠాదిమునిభ్యో నమః ఇదమర్ఘ్యం సమర్పయామి

గంగాది సకల నదులకు: గంగాద్యాశ్చ మహానద్యో యాశ్చ పుణ్యాస్సమాగతాః!
ఇదమర్ఘ్యం ప్రదాస్యామి యూయం గృహీత సన్నిధౌ॥
గంగాదిభ్యో నమః ఇదమర్ఘ్యం సమర్పయామి॥

సూర్యనారాయణమూర్తికి:

ఉదయే బ్రహ్మ రూపీ చ మధ్యాహ్నే తు మహేశ్వరః
సాయంకాలే సదా విష్ణుః త్రిమూర్తిశ్చ దివాకరః॥
ఛాయా ఉషాసమేత శ్రీ సూర్యనారాయణ పరబ్రహ్మణే నమః
ఇదమర్ఘ్యం సమర్పయామి

గంగలో నీళ్ళు మూడుమార్లు పుచ్చుకొని ఒడ్డునకు వచ్చి, నీళ్ళలోనె నిలిచి, ఈ క్రింది మంత్రముతో కట్టుకున్న వస్త్రము నీళ్లను ఒడ్డుమీద మూడుమార్లు పిండవలయును.

యన్మయా దూషితం తోయం శారీరమలసంయుతమ్।
తస్య పాపవిశుద్ధ్యర్థం యక్ష్మాణం తర్పయామ్యహమ్॥

ఒడ్డునకువచ్చి, పొడిగుడ్డలు (పట్టు వస్త్రములు) కట్టుకొని సూర్య ధ్యానము చేసి కొనవలెను.

ధ్యేయస్సదాసవితృమండల మధ్యవర్తి నారాయణ స్సరసిజాసన సన్నివిష్టః
కేయూరవాన్ మకరకుండలవాన్ కిరీటీ హారీ హిరణ్మయవపుః ధృతశంఖచక్రః॥

★★★★

T.T.D. Religious Publications Series No.89

Price Rs.10-00

Published by Sri Ajeya Kallam, I.A.S., Executive Officer,
Tirumala Tirupati Devasthanams and Printed at T.T.D. Press, Tirupati.